C MBO1A 212

చిగురు

కవితా సంపుటి

4220

సంపాదకుడు
ముసునూరు

871
SUP

CI

MB01A212 H=8.6 W=25.7
825
4220

అగ్నిగర్భ

కవితా సంపాతి

హైదరాబాద్ పుస్తకాలయం
వారి మొదటి ముద్రణ

సంపాదకుడు :

డా॥ సుప్రసన్న

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

ప్రచురణ :

జాతీయ సాహిత్య పరిషత్,

ఆంధ్ర ప్రదేశ్, హైద్రాబాదు.

I

AGNIGARBHA (An Authology of Modern Telugu Poetry) Edited by Dr. Suprasanna. Published by Jateeya Sahitya Parishat, Andhra Pradesh, Hyderabad.

ప్రచురణ : 8 మార్చి 1974 న

ప్రతులు : వేయి

వెల : ఆరు రూపాయలు

ప్రతులకు :

జాతీయ సాహిత్య పరిషత్

కేంద్ర కార్యాలయము

2-1-272 నల్లకుంట

హైదరాబాదు - 44

ముద్రణ :

విజయ ప్రెస్,

జె. పి. యస్. రోడ్,

వరంగల్..

ప్రస్తావన

తెలుగు సాహిత్య సంప్రదాయము ఇతిహాస పురాణములు వానియందలి విహితమైన బద్ధనిరూపితార్థాన్ని తెలుగు చేయడంతో ప్రారంభమయింది. అయితే సంస్కృత సాహిత్యాన్ని ఆదికవి ఆరంభించేనాటికే వేదసంప్రదాయము కొనసాగుతూనే ఉన్నది. అందువలన వాల్మీకి దాని చివురులను తన కావ్యములో తుసుమింపజేసి అతిలోకశోభను సమకూర్చినాడు. ఆ సంప్రదాయము వ్యాస కాళిదాసాదుల వలన సజీవముగా నడిమి యుగముదాక కొనసాగినది.

వైదేశిక దురాక్రమణలు వచ్చేనాటికి సంస్కృత సాహిత్యములోని సజీవ చైతన్యము మందగించి కృత్రిమములైన అలంకారముల ఆడంబరము, శాస్త్రపాండిత్య జాటిల్యము, వర్ణనాధిక్యము మొదలైన లక్షణాలు వృద్ధి పొందినవి. రీతివాదానికి ప్రాధాన్యము వచ్చినది. వైదేశికుల తాకిడికి దేశం, సమాజం ఒక్కసారి హఠాత్తుగా అనుకొనని ఆపదను ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధపడి ఉండకపోవడంతో ఎక్కడికక్కడే కుంచించుకుపోవడం మొదలైంది. ఈ సమాకుంచనలో ఆధునిక భారతీయ భాషల ఉజ్జీవనం ప్రారంభమయింది.

అయితే దేశంలో ఈ భాషలన్నిటికీ కావలసిన సంస్కృతీ సంప్రదాయాలు మళ్లీ మూలస్రోతస్సు సంస్కృతమే కావడాన అందులోనుంచే రావలసివచ్చింది. అది ఒక్కటే ఈ భయోద్విగ్నమైన, నిరుద్ధమైన, సహజోద్గతి కోల్పోయిన సమాజాన్ని చైతన్యవంతం చేయగలది. నన్నయ ప్రారంభించిన ఈ సంప్రదాయం దాదాపు మూడువందల సంవత్సరాలపాటు తెలుగు సాహిత్యంలో కొనసాగింది. భారతమువలన మరల భారతీయాత్మను దర్శించే ప్రయత్నం కొనసాగింది. కాని మధ్యయుగంలో జాతిలో యేర్పడ్డ రూఢి

వాదాలు, ఆర్థాన్ని కోల్పోయిన వ్యవస్థలు, అవసరం తీరిపోయిన ఆచారాలు నాటికి సత్యములుగా గోచరిస్తున్నవి. నిత్యపరిణామ పరిణాహ్ చైతన్య సరస్వతి యైన ఈదేశపు సభ్యతను వారు సర్వసమగ్రంగా కాకపోయినా దర్శించడం సాధ్యపడిందనే చెప్పవలె. అందువలననే కవిత్రయ భారతములో కొన్ని కొన్ని సన్నివేశాలు రూఢీవాదాన్ని ప్రతిపాదించే అంశాలు చెప్పేవిగా ఉన్న ప్పటికీ కవిత్రయమువారు అందుకొన్న శిఖరాలు అద్వితీయమై ఈ యుగం నిండా వెలుతురులు ప్రసరింపచేస్తూ వున్నాయి. కవిత్రయ కావ్య సంప్రదా యము కేవలము ఐతిహాసికమే కాక తరువాత వృద్ధి పొందిన కావ్య సంప్ర దాయములోని మెలకువలు తనవిగా చేసుకొన్నది కావడాన ఈ సాహిత్య మార్గము ప్రజలలోని విద్వాంసులు లోనారసి మేలసునట్టిదిగా రూపొందినది.

కావి ఈ యుగంలోనే పాల్కురికి సోమన్న ప్రజల పాటల ఫణితుల ఆధారంగా గీతిమార్గానికి చెందిన ద్విపద సంప్రదాయాన్ని 'దేశి' భాషా సంప్రదాయాన్ని నిలువబెట్టే ప్రయత్నంచేశాడు. సోమన్న ఉద్యమం ప్రజల కెంత సన్నిహితమైనదైనా ఆయన దృష్టి అంతా ఏకపక్షంగా వీరశైవ ప్రచారం పరమార్థంగా గలది కావడాన, ఇతరుల నింద ఉండటం మూలాన, ఈ ఉద్యమమూ సాహిత్యంలో సంపూర్ణంగా ఆదరణ పొందలేకపోయింది.

కవిత్రయం ఈ యుగపు చైతన్యానికి సంకేతం. తెలుగు కవిత్వ చరిత్రలో సత్త్వగుణం పరిపాలించిన వేళ యిది. స్థూలంగా మహాభారతము ద్వారా మన సంస్కృతి, సంప్రదాయము అవిచ్ఛిన్నముగా నిలిచేట్లు చేసినారు. అంతేకాకుండా కావ్యపరమార్థమును నిర్దేశించడములో విశ్వశేయః కావ్యమ్మని జగద్ధితబుద్ధిని వాచ్యముగా పేర్కొని తాము భావించినమేరకు ఆ మార్గాన ప్రయాణం చేశారు. వారి మితవాక్కు, రసస్యంది రచన, తెలుగు భాషలోని చైతన్యాన్ని స్పందించే వారి భావనాశక్తి భారతాన్ని భావితరాలవారికి పాఠ్యంగా నిలబెట్టింది.

తరువాత వచ్చిన శ్రీనాథుని- శ్రీకృష్ణదేవరాయల కాలం భాషలో రజోగుణం ప్రాధాన్యం వహించిన యుగం. ఈ కాలంలో కవిత 'రీతి'

వాదాన్ని ఆశ్రయించింది. కవికి వక్తవ్యం కంటే అభివ్యక్తి ముఖ్యమైంది. ఈ యుగనాయకుడు శ్రీనాథుడు ఈ రజోగుణానికి ప్రతినిధి. ఆయన పద్యాలు ఓజోగుణోన్నీ, సామాసికతనూ పెంచి తెలుగు కవిత్వాన్ని ఒక మోహవిభ్రాంతిలో పడవేసినవి. ఈ యుగములో బమ్మెర పోతన్న కాహిరంగా రీతి వాదాపికే చెందిన వాడయినా ఆతని రచన శ్రోతకుడికి తాదాత్మ్యాన్ని కలిగించగల శ్రేష్ఠతనం కలిగింది. అనాడు పైక్లబ్యం పొందివున్న సమాజాన్ని ఆర్ద్రమైన శ్రీమతో వెన్నుతట్టి భక్తి సులభుడయిన భగవంతుని చూపి, వారికి ఒకవిధమైన సమైక్యభావాన్ని కలిగించినవాడు ఆయన. అందువలననే భాగవతకవి ఒక్కడే పండితులకు, వర్గాలకు పరిమితం కాకుండా ఇంటింటా, గుండె గుండెలో స్థానం ఏర్పరచుకున్నాడు. ఈ యుగంలో పోతన్న కాకుండా సమాజానికి ఒకవిధమైన కుదుపు తెచ్చినకవి అల్లసాని పెద్దన్న. భోగమే జీవిత పరమార్థంగా భావింపబడుతూ వచ్చేఆ రోజుల్లో అర్థకామాలు ధర్మానుబంధములు కావలసిందే, లేకపోతే సుఖం లేదనీ, ఆవ్యవస్థ ఏర్పడుతుందనీ మనుచరిత్ర ద్వారా నిరూపించడం జరిగింది. కవిత్రయ యుగంలో రజోగుణంతో పాల్కురికి సోమన్న ఎలా వచ్చాడో ఈ యుగంలో సత్త్వగుణముతో పోతన ప్రకాశించాడు.

కవిత్రయము, పోతన్న, పెద్దన్నలు వీరి ఔన్నత్యమే తెలుగు సాహిత్యములో మణిశిఖరాలు. ఈ యుగంలో కవితానైపుణ్యప్రదర్శన క్రిమ క్రిమంగా పెరిగి విషయప్రాధాన్యం తగ్గిపోయి వసుచరిత్ర శిల్పనైపుణికి పరాకాష్ఠగా నిలబడింది.

దానితో తెలుగు కవిత్వం పతనోన్ముఖమైంది. సాహిత్యికులకు సమాజ జీవితంతో సంబంధం తెగిపోయింది. అల్పులైన చిన్న చిన్న రాజుల, పాలెగాండ్లకోరికలమేరకు మనిషిలోని పశువును మేల్కొల్పేశృంగారపద్యాలు, రసహీనములైన చిత్రగర్భ బంధకావ్యాలూ ప్రతిభా హీనాలైన అనుకరణలు బలిసిపోయినవి. ఇది తమోగుణం విజృంభించిన యుగం.

అయితే ఈ యుగంలోని తమస్సు ఆధునికకాలం వస్తేగాని చీల్చబడలేదు. పాశ్చాత్యుల విద్య, సంస్కారము, భారతీయ జీవనంలో తెచ్చిన కల

వరపాటుతోపాటు వినిదర్శినూ నూతనోత్తేజాన్నీ కలిగించినవి. రామమోహన రాయలు. రామకృష్ణులు. దయానందులు. వివేకానందులు. తిలక్. గాంధీ రమణమహర్షి. రవీంద్రులు. శ్రీ అరవిందులు ఈ దేశపు వినూత్న జీవన శక్తికి ప్రాణం పోసిన స్రష్టలు. చైతన్య స్రష్టలు. తెలుగు దేశంలో ఈ చైతన్యం వీరేశలింగంగారితో ప్రవేశించింది. సర్వజీవనరంగాలలో లాగానే సాహిత్యరంగాన్నీ ఆయన నూతన చైతన్యంతో నింపాడు. తెలుగు సాహిత్యం కొత్త కొత్త మార్గాలు చూచుకొన్నది. వచన వాఙ్మయం రూపుకట్టి ప్రజలకు సాహిత్యంతో ప్రత్యక్ష సంబంధం కూర్చింది. సామాజిక ప్రయోజనానికి సాహిత్యాన్ని ఆయన ఉపకరణంగా చేసి దానికి ఎక్కువ పదును పెట్టినారు.

ఈ తోవలో ప్రయాణం కొనసాగించి భాషకు ఆధునిక చైతన్య శక్తిని సమకూర్చింది గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు. కాశీనాథుని నాగేశ్వరరావు. కొమర్రాజు లక్ష్మణరావు ప్రభృతులు. తెలుగుకవిత్వాన్ని వీకటిలోంచి వెలుగులోనికి తెచ్చినవారు తిరుపతి వేంకటకవులు.

ఆధునిక కవిత్వం జాతీయోద్యమ ప్రేరణతో ప్రారంభమయింది. ఆత్మాశ్రయ కవితామార్గం కొత్తగా ప్రాచుర్యం వహించింది. గీతీమార్గం ఏర్పడ్డది. ప్రకృతి వర్ణన, జానపద భాషాప్రయోగము, అమలిన శృంగారము ఈ విధముగా ఎన్నో శాఖోపశాఖలుగా ఈ కవిత రూపు దిద్దుకొన్నది. ఈ బహుధా వికాసానికి మూలవిరాట్టు రాయప్రోలు సుబ్బారావు. ఈయన కాలంలో పెయ్యేండ్ల తరువాత తెలుగుభాష మారడం ఆరంభించింది. భావ కవిత్వం కొత్త స్పందనను తెచ్చింది. కృష్ణశాస్త్రి, వేకుల, నండూరి సుబ్బారావు. నాయని సుబ్బారావు వంటి గొప్పకవులు ఈ యుగంలో వచ్చారు. దేశభక్తి కవిత కర్తృత్వంగా రాష్ట్రోద్యమ కవితగా పరిణమించింది. ఈ ఉద్యమంలో సమగ్ర భారత దర్శనానికి భిన్నంగా సంకుచితమైన భాషా రాష్ట్రము కృత్రిమ కర్తృత్వంగా ప్రాధాన్యం పొందింది. ప్రాంతీయ వీరులు. గాథలు వారి గొప్పతనమూ ఇతివృత్తాలైనవి. భాషా దురభిమానం పెరిగింది. ప్రతి ప్రాంతంలో జరిగినట్లే తెలుగు తల్లి, తెలుగు జాతి, తెలుగు పక్షులు, తెలుగు నదులు, తెలుగు రక్తము ఇలా నానావిధాలైన విభేదక లక్షణాలు కవులలో వ్యక్తి పొందినవి.

ఈ క్లిష్ట సన్నివేశంలోనూ దీనికి మించి ఎదిగి గాంధీజీ ఉద్యమాన్ని స్పందింపజేసే 'సౌందరనందం' వెలువడింది. ఇంకొకవైపు జాతీయ సంగ్రామానికి ప్రేరణగా శివభాతము. రాణా ప్రతాపసింహచరిత్ర వెలువడ్డవి. దేశంలో వస్తూవున్న పునరుజ్జీవనోద్యమపు ఛాయల్లో విశ్వనాథ రామాయణ కల్పవృక్ష రచన ప్రారంభమయింది.

పాంథ్రామికీకరణ, నగరాల వృద్ధి, గ్రామముల విధ్వంసము దేశంలో కొత్త సమస్యలను, ఆవేజడులను సృష్టించినవి. ఈ నూతన సన్నివేశానికి తోడుగా రెండు ప్రపంచ మహా సంగ్రామాలు అంతర్జాతీయమైన క్రొత్త క్రొత్త అవగాహనలను కూర్చినవి. మానవుడికి అంతర్బహిర్జీవనంలో ఇతఃపూర్వం ఎరుగని సంఘర్షణ ప్రారంభమయింది. దీనికి నివారణోపాయం మార్క్సిజం చెప్పే సామ్యవాదమని కొందరు భావించడం జరిగింది. సామ్యవాద వ్యవస్థ మానవుని జీవనంలోని భౌతిక పార్శ్వం ఒక్కటే స్పృశిస్తుంది. అందువలన మానవుని సమస్య లన్నిటికీ దానిలో సమాధానాలు లేవు. మానవుని మానసిక ఆధ్యాత్మిక భూమికలను అది నిరాకరిస్తుంది. వ్యక్తి వ్యవస్థలోని యంత్రం. ఈ దేశంలో ఈ ఉద్యమం రష్యాలోని కమ్యూనిష్టుపక్ష ప్రేరణతో ఉన్ని రంగాలనూ ఆవరించే ప్రయత్నం చేసింది. అభ్యుదయ రచయితల సంఘం దీని ఫలితమే.

అభ్యుదయ రచయితల సంఘంలోనూ, సాహిత్యంలోనూ ఈ పక్షపు రాజకీయపు ఎగుడు దిగుళ్లను బట్టి ఎగుడుదిగుళ్లు ఏర్పడ్డాయి. రచయితలుగా విశ్లేషణలో తమ స్వేచ్ఛను నిలబెట్టుకోవడం జరుగలేదు. పార్టీ బిగువు సడలిన వేళల్లో ఈ రచయితలు తమ సంకుచిత పరిధినుండి బయటపడి మానవుని విశాల చైతన్యాన్ని స్పృశించే రచనలు చేశారు.

ఇంకొకవైపు కవులకు సహజమైన ప్రయోగశీలము కూడా పాశ్చాత్య దేశాలలోని నూతన ఉద్యమాలు ఆధారంగా చాలామంది కవులలో కానవచ్చింది. ఈ ప్రయోగాలు మొదట్లో వికారంగా, అసహజంగా కానవచ్చినా క్రమంగా వాటిలోని మేలు తోవలు మాత్రమే కవిత్వానికి నూత్నమైన చేర్పుగా నిలబడుతూ వచ్చింది. ఇలా ప్రయోగవాదుల వల్ల వచ్చిన

ప్రక్రియయే వచన పద్యము. తెలుగు కావ్యభాష యిక్కడి సంపూర్ణమైన పరివర్తన చెందింది.

స్వాతంత్ర్యం వచ్చినతరువాత దేశంలో కొంతకాలం ప్రగతివాదం విజృంభించి ఉన్నా క్రమంగా దాని జోరు తగ్గింది. జాతీయభావ ప్రేరణతో ప్రజాహిత కాంక్షతో ఈ దేశపు సమస్యలను మన అవసరాల కనుగుణంగా పరిష్కరించుకోవలెననీ, మనకు సరిపడని, జాతీయ ప్రయోజనాలు నెరవేర్చలేని పరిష్కారాలు అక్కర లేవనీ సాహిత్యంలో ఒక దృష్టి ఏర్పడ్డది.

ఈనాడు తెలుగు కవులు రెండు భిన్న మార్గాలుగా ఉన్నట్టు కానవస్తున్నారు. ఎక్కువమంది జాతీయభావ ప్రవాహంతో సాగిపోయేవారు. మరి కొందరు ఏవో దూరతీరాలమీది ఆశతో ఇక్కడి పరిస్థితులకు అనుగుణం కాని సిద్ధాంతాలతో, నిరాశనూ, వైక్లబ్యాన్నీ కసిద్వారా హింసనూ, విధ్వంసాన్నీ ప్రబోధించేవారు. అయితే ఇది కాలంతోపాటు స్పందించేవారి సంగతి. ఇంకా చాలామంది తమ 'దంత' గోపురాలలో సంప్రదాయ మనే పేర తాము ఆగిపోయిన చీకటి గుహల్లో, స్వచ్ఛకవితా సిద్ధాంతాల మైకంలో మునిగి తేలుతూ వున్నారు.

ఇటీవల సామ్యవాద దేశాలలోనూ జాతీయతా తత్త్వం అంగీకృత మవుతున్నది. ఇంకా మౌలికంగా వారి ఆలోచల్లో ఎన్నో మార్పులు వస్తూ వున్నవి. మానవ చరిత్ర, విజ్ఞానశాస్త్ర పురోగతి, మనస్తత్త్వ శాస్త్రంలో ఆవిష్కృతమయ్యే నూతన దిశలు మానవుని కొత్త లోకాలకు ద్వారాలు తెరుస్తున్నవి. మధ్యలో ఏర్పడ్డ వికృతులు తొలగించితే భారతీయ జీవన వ్యవస్థ మానవుని సర్వతోముఖ వికాసమునకూ, వ్యక్తికీ సమాజానికీ నడుమ వికాసరూపమైన అనుబంధానికీ, వ్యష్టిచేతన, క్రమంగా సమష్టిచేతనగా పరిణమిల్లడానికీ- పర్యవసానంగా ఒక దుఃఖ రహితమైన పరిపూర్ణ వికాసం పొందిన నూతన సమాజం ఏర్పడటానికి హేతువుగా గోచరిస్తున్నది. ఈ విశ్వాసంతో రచనలు చేసేవారు ఈనాడు కవిపిస్తున్నారు.

ఈనాటి కవులు ఈ చైతన్యంతో స్పందిస్తున్నారు.

తెలుగు కవితారంగంలో ఈనాడు జాతీయ సాహిత్య సంపద్రాయాన్ని పునఃదర్శించుకునే యత్నంలో కవులు కానవస్తున్నారు. భారతీయ భాషా సాహిత్యాల నడుమ మధ్యయుగంలో తొలగిపోయిన సంబంధాలు మళ్లీ అనుబంధము లయ్యే ప్రయత్నం జరుగుతున్నది. అన్ని భాషలలోనూ సమానాంతరంగా కొన్ని కొన్ని ఉద్యమాల ధ్వని ప్రతిధ్వనులు వినబడుతున్నాయి. క్రమక్రమంగా ఈ ఉద్యమము కొనసాగితే కొన్ని సంవత్సరాలలో భారతీయ సాహిత్యమనే ఒక భావన నిలబడుతుందని తోస్తుంది.

జాతీయత అంతర్జాతీయ చైతన్యానికి లేదా ఆధునికతా బోధకు విఘ్నమైందా అని ఒక ప్రశ్న. మన జాతీయ స్పందన క్రమ క్రమంగా విశ్వచైతన్యంగా వికసించే లక్షణం కలది కావడాన దానికి ఆధునికతతోడి అవినాభావ సంబంధం ఉంటుంది.

౧

'అందు ఈ విలక్షణ జీవయాత్ర కొరకు పృథివినే నవ్యులు సమాశ్రయింతురు. భక్తి తల్లిగా, ధాత్రిగా దేవతామతల్లిగా సపుత్ర పరాపర కావ్యములకు' (రమ్యాలోకము) అని ఆధునిక కవితా ప్రారంభములు రాయప్రోలు సుబ్బారావుగారు నవకవికి అధారభూమిని నిర్దేశించడం జరిగింది. మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః అన్న భావనతో మన జీవనం ఆరంభమౌతుంది. ఈ జన్మభూమి - దీనివెంట మన జీవనాన్ని పరిపాలించే సంస్కృతి, సభ్యత-చరిత్ర జాతి జీవనంలోని ఉత్థాన పతనాలు అన్నీ ముడిపడి వున్నవి.

కవి ఈ భూమి ఆధారంగా ఆకాశందాకా వెలుగునిచ్చెన కడతాడు. పృథ్వికీ ఆకాశానికీ నడుమ నిలిచి వున్నది అగ్ని. 'ఈ అగ్ని రెంటికీ ఆరోహణావరోహణములకు నిచ్చెన. ఇదే మనోమయ లోకము, 'వాక్స్నాహపము. వాక్కు మనుష్యులలో రసమని కీర్తి. ఈ దివ్యాదివ్య లోకాల నడిమి అనుబంధంగా నిలిచిన అగ్ని సృష్టిచైతన్యానికి ప్రతీక.

వేదము అగ్నిముఖము. దేవత లందరూ అగ్నిముఖులు. అగ్ని పరిసన్న మయితేనే ఈ దేవతల స్వరూపము అవగాహన మవుతుంది. ఆది

త్యని అగ్నిగర్భుడని వాల్మీకి పేర్కొనడం జరిగింది. అగ్ని అంటే అదితి అన్నమాట. అదితి సర్వ జీవశక్తులకూ ఆద్యాశక్తి. మహాసరస్వతి. ఆమె నుండి వెలువడే వాక్కులు దేవతలు. అందుకే శ్రుతి 'మాతాదిత్యానాం దుహితా వసూనాం ప్రాణః ప్రజానాం అమృతస్య నాభిః హిరణ్యవర్ణా మధు కశా ఘృతాచీ మహాన్ భర్గః చరతి మర్త్యేషు (అథర్వ 9-1-1-4) అంటు న్నది. ఈ మనుష్యులలో చరించే వాఙ్మహత్తు ఇంతగా పేర్కొనడం జరిగింది. దేవతలందరూ ఈమె బిడ్డలు. రసవంత వాక్కులు ఇక్కడే ఉదయిస్తవి. ఈమె వసువుల బిడ్డ. వసువులు ప్రాణశక్తులు. ప్రాణ మయ మనోమయ చేతనలే ఈమె ఉత్పత్తి స్థానములు. లోకానికి ఈమె ప్రాణము. అంతే కాక మహాసృష్టి చక్రములో యీమె నాభి. నడిమి అగ్ని. అందువలన హిరణ్యవర్ణ - 'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖం' ఉన్నటి జ్ఞానమునకు ఆచ్ఛాదనగా ఉన్నది. ఈమెను ఉపాసించి ఉన్నటి స్వరూపము అవగాహన చేసికోవలె. ఈ వాక్కు మధుకశ. మధుత్వ లక్షణము కశ లక్షణము రెండూ కలది. హితమై కశాగ్రము వలె ఒక చురక వేసి లోలోతులలోని కల్మషాన్ని లాలగిస్తుంది. ఇది గొప్ప ఐశ్వర్యము. మర్త్యులలో చరించే యీ మహదైశ్వర్యము ఈ మర్త్యులకు అమృతత్వము కలిగించుటలో మిక్కిలి సమర్థమైనది.

ఈ అగ్నిరూపమైన సరస్వతి ఉపాసనము కవులకు సంప్రదాయము. అందువలన సర్వ కవిత్వమును అగ్నిగర్భమే.

ఈనాటు కవులలో ఒక అనిర్వచనీయమైన ఆర్తి ఉన్నది. ఆ ఆర్తి స్వరూపమును తెలుసుకునేందుకు వారు లోలోపల తర్కిస్తూకొంటూ పోతున్నారు. కవి అంతర్ముఖీనతా లక్షణము యిక్కడ అభివ్యక్తమౌతున్నది. ఈలోపల ఆర్తి కవికి ప్రేరణ కలిగిస్తున్నది. తనను అరణిగా మథించుకునే కవిలో నుండి ఈ అగ్ని జ్వాలారూపమైన కవిత ప్రాదుర్భవిస్తున్నది. ఈ ఆర్తి బాహిరమైన లోకమునందు దృశ్యమానమయ్యే దుఃఖము. వ్యధ, దారిద్ర్యము, అవ్యవస్థ ఇలాంటి రూపమై ఉన్నది. ఇక్కడ బహిర్ముఖీనమైన ప్రేరణ కలుగుతున్నది. ఆ ప్రేరణ ఆంతరమైనా బాహిరమైనా కవి

స్పందనం మనోమయ లోకంలోనే. అక్కడ అవ్యక్తంగానే సమష్టిచేతనా స్పందం స్ఫురించి కవి నిమాజచేతస్సును పలికిస్తున్నాడు.

మనోమయ చేతనలోని అగ్ని ఉన్నత భూమికలను స్పృశించ గలిగి స్పందించ గలిగినపుడు అతని వాక్కులు అతిలోక లక్షణాన్ని కలిగి ఉంటు న్నవి. పాశ్చాత్య భాషల్లోని మహాకవుల వాక్కులలో కానవచ్చే ఈ సర స్వతీస్పందం వారిని దేశకాలాలకు అతీతులనుగా, సర్వ మానవులనూ స్పందింప జేసేవారుగా చేస్తున్నది. ఈ అగ్ని జ్వాలలో ఉన్మనీదశలోని వెలుగులను సంతరించుకొంటున్నవి. ఏకవి వాక్కు ఆ దశలోనుండే బహి ర్గతం అవుతున్నదో ఆది మంత్రి మవుతున్నది. దానియందు అలౌకికమైన లయ ఉంటున్నది. వాక్కు ఆత్మిక దీప్తి కలిగి ఉంటున్నది. ఈ మంత్రి మయమైన వాగ్లక్షణము గలవారు వ్యాస వాల్మీకులు. మంత్రిదర్శిష్టలైన వేదర్షులు.

భవిష్యత్తులో మానవ జీవనం దివ్యచేతసను అధిరోహించ గలదనీ, కవిత మంత్రిమయతను పొందగలదనీ శ్రీ అరవిందులు పాశ్చాత్యించినారు.

3

కవితా సంహితలు మన సాహిత్యంలో పూర్వంనించే వస్తూవున్నవి. సంస్కృత ప్రాకృత సాహిత్యాలలో అనేక కవితా సంకలనాలు గోచరిస్తవి. తెలుగు భాషలోనూ ప్రాచీనకాలంలో సకలనీతి సమ్మతము వంటి సంహితలు ఉన్నవి. ఆధునిక కాలంలో 'వైతాళికులు (1935), నవసీతము (1940), మహోదయము (1946), కల్పన (1953), ఉదయఘంటలు ('953), నవ్య సాహితి (1958), తెలుగు కావ్యమాల (1959), మణిమకుటము (1961), అడుగుజాడ గురజాడది (1962), దర్శన (1965)' మొదలుగా అనేక సంకలనాలు వచ్చినవి. ఇన్నింటిలోనూ వైతాళికులు చాలా ప్రసిద్ధిలో నున్నది.

కవితా సంహితలు కూర్చే కూర్పులో- మాలాకారుడు రంగు రంగుల పూవుల నెన్నుకొని ఇందర్శి ధనువుల్లాంటి మాలలు కూర్చినట్లే- ఎంతో నేర్పు

అవసరమై యుంటుంది. సాధారణంలో పుష్పమాల మాలాకారుని నైపుణ్యాన్ని అభిరుచినీ వ్యక్తం చేస్తుంది. కవితా సంహిత సంపాదకుడి కవితాభిరుచి. రసానుగుణమైన స్పందం గల చిత్తవృత్తినీ వ్యక్తం చేస్తుంది.

కవితా సంహితలు సాధారణంగా యాదృచ్ఛికంగా కూర్చడం, ఒక భావనతో, కవితా పద్ధతితో, సిద్ధాంతముతో, వ్యంజకతా పద్ధతితో ఆకర్షించి తత్పరిధిలోనికి వచ్చిన వాటినన్నింటినీ జతకూర్చడం, మూడవ పద్ధతి ఒక కాలపరిధిని నిర్ణయించుకొని దానికిలోబడిన రచనలను సేకరించడం. ఈ మూడు పద్ధతులూ పైన పేర్కొన్న ఆధునిక కాలంలోని కవితా సంహితలలో గోచరిస్తవి.

మరికొన్ని కవితా సంహితలు కొన్ని ప్రత్యేక సన్నివేశాలను పురస్కరించుకొని వెలువడేవి. ఆంధ్రప్రదేశ్ అవతరణ, గాంధీ శతాబ్ది, చైనా దురాక్రమణ, పాకిస్తాన్ దురాక్రమణ, బంగ్లా విముక్తి ఈ ఈ సందర్భాలు లాంటి గర్జింపా లెన్నింటికో కారణమైనవి. ఇట్టి సంపుటాలలో తాత్కాలిక మైన ఆవేశము ప్రధానముగా గోచరిస్తుంది. వీటిలో కొన్ని రచనలు గొప్ప ప్రేరణ పొంది సమకాలీనతా పరిధిని అతిక్రమించి సార్వకాలీన చైతన్యంతో ప్రకాశించుతవి.

ఒక త్రోవకు చెందిన కొందరు పరిమితకవుల కవితా సంకలనాలు వేయటం కూడా ఇటీవల జరుగుతూ వచ్చింది. ఈ త్రోవలో దిగంబర కవుల సంపుటాలు చేతనావర్తం రెండు భాగాలు, మేం మొదలైన సంకలనాలు పేర్కొన దగ్గవి.

ఈ కవితా సంహితలో కవులలో చాలామంది యీ శతాబ్దపు మూడవ దశకంలో పుట్టినవారు. కొద్దిమంది ముందరి దశాబ్దంలోవారూ, ఒకరిద్దరు తరువాతి దశాబ్దంవారూ ఇందులో చేరినారు. ఈ యుగంలోని కవులు రచన చేపట్టింది స్వాతంత్ర్యం వచ్చిన తరువాతనే. ఈ రచనలు అన్నీ 1950 తరువాతవే. స్వతంత్ర భారతంలో తెలుగు కవి పొందిన 'ఆర్తి' ఇందులో అభివ్యక్తమవుతున్నది. ఈ దేశాన్ని ఆధారభూమిగా - జాతీయతా శక్తిని ఉన్నత దివ్య జీవనానికి నిశ్రేణికగా స్వీకరించని కవుల రచనలు దీనిలో

స్వీకరింపబడలేదు. ఐనా ఎంతోమంది కవుల రచనలు స్థల పరిమితీ, కాలము యొక్క సంకోచమూ కారణంగా వదలివేయడం జరిగింది.

నేటి కవిత్వంలో కనిపించే అన్ని భావధారలూ, రూపధోరణులూ, ప్రయోగరీతులూ దీనిలో కనిపిస్తవి. దీనిలో యాభై యొక్క మంది కవుల ఖండ కావ్యాలు సంకలనం చేయబడ్డవి. ఇంకా దీనికి సమగ్రత వచ్చిందని చెప్పలేము. ఒకవిధంగా ప్రాతినిధ్యం వహిస్తుందని తప్ప.

జాతీయ సాహిత్య పరిషత్తు తన ప్రథమ మహాసభల సందర్భంలో కొలి ప్రచురణగా అగ్నిగర్భను ప్రచురించే నిర్ణయం చేసింది. కవిమిత్రులు మైత్రితో, ఆదరంతో, సహకరించి ఈ సంకలనంలో తమ రచనలు చేర్చేందుకు అనుమతించారు. వారందరికీ మా కృతజ్ఞతలు.

చాలా కొద్ది కాలమే ప్రచురణకు మిగిలి, తమ కర్తల పరిమితిలో ఇది అసాధ్యమైన పని కాగా దీన్ని ఒక సవాలుగా స్వీకరించి, అక్షరశః తమదిగా భావించి ఈ కవితా సంహితను వేళకు అందించిన మా ఆప్త మిత్రులు శ్రీ పల్లా రామకోటార్యగారికి మా కృతజ్ఞతలు.

ఈ సంకలనం కోసం ఎన్నో విధాల సహాయపడిన చిరంజీవులు టి. కృష్ణమూర్తి, చిట్టిమల్లె శంకరయ్య, యం.యన్. రంగాచార్య, అడ్డగట్ల శ్రీధర్ లకు మా అభినందనలు.

హైదరాబాదు
8-3-1975

కోవెల సుప్రసన్నాచార్యులు

అనుక్రమణిక

***

ప్రారోచన		i
అమృత పుత్రిలు	సుప్రసన్న	1
సువర్ణ మంత్రపుష్పం	ముదిగొండ శివప్రసాద్	3
ఋణంతుడి. దీతో కలిసి వయవించలేను	జానకీజాని	5
లోకాలోకము	పి. నారాయణరెడ్డి	8
వసధారతి	ప్రసాదరాయ కులపతి	10
కాలాన్ని కత్తిరించి చూడకు	వే నరసింహారెడ్డి	13
సమాజం ఎక్కడా కన్పించలేదు	నంపత్కుమార	16
కావ్యసూక్ష్మము	యస్వీ. జోగారావు	23
దేహళి	శ్రీపెరుంబూదూరు లక్ష్మణమూర్తి	24
ఇది నాతరం గీతం	అరిపిరాల విశ్వం	28
ఆనందం జీవనది	గోపాలచక్రవర్తి	31
అనుభూతి	వేగుంట మోహనప్రసాద్	33
ఆందాల ఆటిభుజి	గుంటూరు శేషేంద్రశర్మ	36
ఆచుంబితం	దాశరథి	38
నవత-కవిత	దేవకొండ బాలగంగాధర తిలక్	41
ఆత్మమూర్తి	మాదిరాజు రంగారావు	43
నర్మతోభద్ర	శశాంక	46
ఆగ్నిపుత్రి	నాయని కృష్ణకుమారి	48
ఇక్కడే మనమేంతా	పేర్వారం జగన్నాథం	50
ఉదయ విహారం	కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ	51
ఋభితాత్మ	జె బాపురెడ్డి	55
మధుదీక్ష	గడియారం శేషఫణిశర్మ	57
పూలమొక్కలూ - పళ్లచెట్లూ	గొర్తి శంకరధాను	59
విష్ణు చక్రువులు	మిరియాల రామకృష్ణ	62
సూర్యు డెన్నిమారులొస్తేనేం	పరిగి రాధాకృష్ణ	65

కాలుసేయి కడప దాటదు
కపివ్యథ
ఋక్పథము
సోహం
చీమలేమ
నా సంచి
వర్జితదీక్ష
నై వేద్యము
అందమైన అంతరంగం
అహర్ముఖం
స్వేచ్ఛాగానం
మహాంబుధి
యువత - నవత
కాంతదర్శనము
రేపు
ఇది జీవితం
చాపూ!
దివృష
నే
సాఫిచేతన
శిశుగీతం
మరచిపోయిన పాట
ఆనోభద్రాః
ఉషసి
పితృభక్తి
కనకాంబరపు రంగుచీర
ముఖం ఎత్తిందో లేదో!
ఉభయసంధ్యలు
నీవు
హంస పయనించింది
ఆవేశ

మెల్లంద రఘుమారెడ్డి 70
ఆనుముల కృష్ణమూర్తి 71
శశాంక 72
పురాణపండ రంగనాథ్ 73
పేముగంటి నరసింహాచార్యులు 76
దుర్గానంద్ 78
దోనెపూడి వెంకయ్య 79
ఉప్పలి సత్యనారాయణాచార్యులు 82
చల్లా రాధాకృష్ణశర్మ 83
గాడేపల్లి కుక్కుటేశ్వరరావు 85
ఇస్మాయిల్ 87
పిలుకమట్టి రామానుజాచార్యులు 88
చౌడూరి గోపాలరావు 91
కొర్లపాటి శ్రీరామమూర్తి 93
ముదిగొండ వీరభద్రయ్య 94
ఓ. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి 95
భండారు పద్మశివరావు 97
మనశ్యామల 99
రుద్రకోటి 100
టి.బి.యం. అయ్యంగారు 101
కొడవటి శ్రీరామచంద్రమూర్తి 102
పణతుల రామచంద్రయ్య 105
ఎల్లోరా 108
తుమ్మపూడి కోటేశ్వరరావు 110
మల్లంపల్లి శరభయ్య 111
వంగపల్లి విశ్వనాథం 112
మూదిరాజు రంగారావు 113
ముదిగొండ శివప్రసాద్ 115
సంపత్కుమార 117
సి. నారాయణరెడ్డి 118
సుప్రసన్న 120

నిరుద్యోగి స్వగతం	గోపాలచక్రవర్తి 123
కన్నీళ్ళ కడవ	జానకీజాని 125
నాదోత్సవంలో	పాల్తపల్లి సత్యనారాయణ 126
హంసేబీడులో నేను	లరికిరాల విశ్వం 127
ఎత్తిపట్టిన పిడికిలిలోని రహస్యం	వే. నరసింహారెడ్డి 128
నన్ను పశువుగా చిరకాలం ఉంచలేవు	పింగారు సదాశివరావు 131
యుగానికొక పూర్ణిమ	వనమాలి 133
చంద్రిసూక్తం	పాయని కృష్ణకుమారి 134
సహగమన సీమంతిని	దుర్గానంద్ 137
మండేసూర్యుడు	గుంటూరు శేషేంద్రశర్మ 141
రాజీవగీతం	దాశరథి 143
కవితాసరస్వతి	అనుముల కృష్ణమూర్తి 145
అనుభవం	వేగుంట మోహనప్రసాద్ 147
కారదావిర్భావము	సుప్రసన్న 149
మహాభారతీ	దాశరథి 151

అమృత పుత్రికలు

పులుముకున్నారు వెన్నెలలు మొగాలపైన,
వేసుకొన్నారు పండిళ్లు మల్లె తీవలకు మనసుల్లో.
కన్నుల్లో కాశ్మీర సౌందర్య దీపం వెలిగించుకున్నారు,
ఆలోచనల్లో సిత హిమాచలం పెంచుకొన్నవాళ్లు
ఎవళ్ళు వీళ్ళు?

పుడమి నిండా వికారంగా గీసిన సీమారక్త రేఖలు
సముద్రిగర్భంలో కదలాడే తరంగాలపై సామ్రాజ్య ముద్రలు
వ్యోమవీధిలో గ్రహాలపై, గోళాలపై పంపకాలు
ఎరుగరు వీరు, ఎంత వెనుక ఉన్నారు సభ్యతకు?

ఎరుగరు బంగారు తళుకు, అణువులో అంగారం ఉనికి,
ఎదుటివాడి నెత్తురుతోగాని విచ్చని వైరమందారం,
ఎరుగరు మనస్సులోని మారు పొరల్లో ఎంగిలి ఊహలు,
ఊహలోని కాలుష్యానికి రమణీయ వేషం వెయ్యడం.

కన్నీళ్లే వీళ్ల ఆస్తి, మిన్నేటి చల్లని పీచికల నీడ
వీళ్ల ప్రభుత్వ పర్యాప్తి, చిన్నారి పాపలచిర్నవ్వు
సర్వ రోగాలకూ వాడే మందు, సర్వ ప్రపంచమూ ఇల్లు
ఎల్లరూ ఒకే కుటుంబం, ఆనందమే వీళ్ల అనుబంధం.

కూలి డబ్బులకోసం నేర్వని విద్యలూ కళలు,
వాదించి నిర్ణయింపబడేది కాదు న్యాయం- నిత్యమైంది,
చంపెయ్యరు మనుష్యులని జైళ్లల్లో కోరల్నా పెంచి,
సౌందర్యాన్ని బజార్లోపెట్టి చౌకగా అమ్మడం తెలియదు.

చరిత్రలోంచి జాతీయ దురహంకారం నేర్వరు
రంగునుబట్టి, మాటనుబట్టి మానవుల్లో భేదాలు చేయరు
ఉన్నది అనుభవించడం తెలుసు, లేనిదానికోసం అల్లాడరు
ఎక్కే- శిఖరం మీదినించి ఎవర్నీ కిందికి లాగరు.

ఇంద్రియాలు స్వేచ్ఛానిలైన విలాస విమానాలు
మనస్సు రమణీయ మధురోహ కల్పనాచక్షువశక్షము
ధీ వీధి సర్వసమగ్రత్వ దిశాగమన లక్షితము
ఎవరికీ తెలీదు లోపమని, 'అశాంతి' ఎక్కడా లేదు.

మనోమాయాజాలాన్ని ఛేదించిన వాళ్ళు
నాగరకత పేక మేడలు కూలిపోవడం చూచిన వాళ్ళు
వీళ్ళు భూమ్మీద పడిపోయే అంబుదాల కన్నీళ్లు కారు
ఆకాశానికి ఎగబ్రాకే మనోజ్ఞ కాంతివల్లికలు.

తరణి కిరణాలవలె స్వచ్ఛమైన వాళ్ళు
తరుణభావంవలె ఎప్పుడూ ఉప్పొంగే వాళ్ళు
కర్పూరంవలె పరీమళంలో వెలిగిపోయే వాళ్ళు
చైతన్యసాగర సింహాలు, సౌందర్యాకాశ మరాళాలు
సంసార మహావృక్షం పండిన తొలి మధురఫలాలు
ఎవళ్ళు వీళ్ళు?

అమృత పుత్రులు, ఆనందగాత్రులు, అంభోద నేత్రులు.

— సుప్రసన్న

సువర్ణ మంత్రి పుష్పం

ఈ దేశం నాదనటం ఎప్పటిదో పాత మాట
ఈ దేశం నేనటం ఇది నవకవితా సూక్తం
నాలోపలి సిరాధమనుల్లో పారే రక్తం
గంగా సింధూ యమునలు కావేరీ కృష్ణమ్మలు
హిమమకుటం ఉష్ణీషం, కాశ్మీరు నా కుంకుమ
వింధ్యావళి నా హృదయం సింధువులో నా ఉదయం

వాఘీరాతీరంలో మ్రోగిన త్రిశరణ ధ్వని
స్వచ్ఛమహావీరసత్వ లిచ్ఛవీ సువంశధార
శబరిమలై అయ్యప్పల శరణచరణ సంగీతం
కలకత్తా కాళి కాలిగజ్జెల పర్జన్యగర్జ.

బృందావన బృందమంద సుందరవంశీ స్రవంతి
అమృత సరోవరమున విన్పడిన సువర్ణ స్వరాళి
యజ్ఞారుణ సంధ్యలలో ఉదయ దయానంద గీతి
నా యెదలో సుప్తసప్తనాదాలివి— వేదాలివి.

ఈ వెలుగులు నావనటం, ఎప్పటిదో పాతపాట
ఈ వెలుగులు నేననటం, ఇది నవ యుగసంకేతం
దీపంలో శలభమట్లు దూకు సాహసం కన్నా
దీపంగా నేనేమారి దీపించుట మిన్న కదా!
నా రక్తపు తైలంలో నా యెముకల వత్తులతో
నిలువున నేమండి వెలిగి ఇలకిస్తా సందేశం.

లాగములివి దేహములో అమరిన వెన్నెలనా
ఆత్మ ఒక్కటే జీవిక కంతరంగ సూత్రం
వేషం భాషా ప్రాంతం మతం మఠం వేరైనా
ఒకే దేశ మొకే ఆత్మ ఒకే ఒక్క జెండా
వేయిస్తంభముల గుడిలో వేంచేపిన స్వయంభువుకు
కాశ్మీరపు కస్తూరీ, కేరళ చందనము వచ్చె.

గంగా సంగమమందున గీతికలవి తిరక్కూర్చో
కావేరీ సైకతమున గానం తులసీదాసుది
సహ్యాద్రికి వైన వృషభ సంకేతం బిసపనిదది
వాగ భూమిలో వివేకనాదం శ్రీనరేంద్రునిది.

వేవేలను మనిషి కొల్చు తత్వమ్మది పాత మాట
మనిషి కొరకు యెదమలచిన మందిరమిది కొత్త బాట
ఈ సహస్రశీర్ష దేవుడితడే మన భారతీయు
డజ్ఞుడు, ప్రాజ్ఞుడు, మహర్షి, ధనవంతుడు, నిర్ధనుడూ
ఇతడే సాకారముగా నేలపై నడిచే దైవం

ఇది సువర్ణ మంత్రపుష్ప మాతని దివ్యార్చనకై
ఈ భారత మందిరమున ఇదిగో కళ్యాణ వీణ.
ఈ నవసుమ సమారాధనమునకు జయఘంటికలివి.

ఈ దేశం నాదనటం ఎప్పటిదో పాతమాట
ఈ దేశం నేననటం ఇది నవకవితా సూక్తం.

— ముదిగొండ శివప్రసాద్

క్షమించండి!
మీతో కలిసి పయనించలేను!

క్షమించండి, మీతో కలిసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను

తియ్యని పండ్ల చెట్లతో
మధురమైన వాసనల్ని విరజిమ్మే
రకరకాల పూల మొక్కలతో,
అందంగా స్వేచ్ఛగా ఎగురుతున్న
సీతాకోక చిలుకలతో
రంగురంగుల వర్ణ చిత్రంగా భాసించిన
బృందావన తుల్యమైన,
నందన సదృశమైన ఈ వనం
వనమాలి నిర్లక్ష్యంవల్ల పాడుపడిందని
బ్రహ్మజెముడు పొదలు, రక్కసులు, ఉమ్మెత్తలు,
అక్కడక్కడ మొలిచాయని
మొత్తం తోటని సమూలంగా పెకలించలేము
మరుభూమిగా మార్చలేను

క్షమించండి, మీతో కలసి పయనించలేను,
మీ ఆలోచనలతో శ్రుతి కలపలేను.

సువిశాలమైన మందిరం
తరతరాలుగా దారుణ నిదాఘాల నుంచి
భయంకరమైన పెనుతుపానుల నుంచి

ఒడిలోని శిశువును ప్రేమముడితో
సాకే తల్లిగా రక్షించిన గేహం,
తాతల తాతలు కట్టినా, ఈనాటికి
చెక్కుచెదరని, బీటవారని భవంతిని,
ఏదో ఒక మూల నేలను
ఎలుకలూ, పందికొక్కులూ తొలి చేస్తున్నాయని
కిటికీలకూ, తలుపులకూ చెదలు పట్టాయని
పునాదుల్లోకి పడగొట్టలేను,
చీమల బారునుంచి రక్షించాలని
ఇంటికి నిప్పంటించిన పరమానందయ్య
అవివేకపు శిష్యునిలా ప్రవర్తించలేను
క్షమించండి, మీతో కలసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను

చిటికిన వేలు చివర లేచిన
చీమంత చిన్న కురుపు
పొగలూ సెగలూ కక్కుతున్నట్లు
పెడుతున్న బాధ దుర్భరమే అయినా
ఓర్పుతో, ఓపికతో ఒక్క రోజు
గడిపితే పోయే బాధ కోసం
చేతిని తెగగొట్టలేను- జీవితాంతం
అవిటిగా జీవించలేను
క్షమించండి మీతో కలసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను

తరులు తలలూపేటట్లు
ఝరులు పొంగేటట్లు
చేతనా చేతనమైన సమస్త ప్రకృతి
పరవశించేటట్లు

ఒకనాడు మధుర నిస్వనాన్ని పలికిన నా విపంచిని
సాధనలేక మూలబడివున్న కారణంగా
తంత్రులు తుప్పుపట్టి అపస్వరం పలుకుతున్నవని
పగులగొట్టతేను; పారవెయ్యలేను
క్షమించండి మీతో కలసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను

తాతలూ, తండ్రులూ పరదాస్యంతో మగ్గి,
ఎన్నో కష్టాలకూ బాధలకూ తలవొగ్గి,
ఉరిత్రాళ్ళను చిరునవ్వులతో
విరిమాలలుగా కోరి గళసీమ దాల్చి
త్యాగానికి, ప్రతీకలై, అపురూపంగా
అందించిన స్వాతంత్ర్య సంపదని
మరే దేశానికి పణంగా పెట్టలేను
మరో జయచంద్రుడుగా చరిత్రలో నిలువలేను
క్షమించండి మీతో కలసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను

వర్తమాన భారతావనిలో వందలాది సమస్యలు
ఆకాశన్నంటే ధరలను అందుకోలేక
జీవచ్ఛవాలుగా మిగిలివున్న అసహాయులైన
అన్నార్తుల ఆక్రందనలు, ఆకలి మరణాలు
నాలుకలుగా సామాన్యుల్ని కాటేస్తూ
బుసలు కొడుతున్న వేయిపడగల భుజంగ పతులు
దరిద్రంతో, బాధలతో, వ్యాధులతో
కృంగి కృశిస్తున్న అట్టడుగు సోదరులను
అంటరాని వారినిగా హింసిస్తూ
కర్మ సిద్ధాంతాల నల్లమందును
భగవత్ప్రసాదంగా పంచి పెడుతున్న

స్వాములూ, పీఠాధిపతులూ,
ఇందరు సృష్టించిన విలయానికి
ప్రతి రూపమైన పరిస్థితులూ— నన్ను
ఎర్రగా కాలిన పెనం మీద నిలబెడుతున్నవి
నిజిమే! కాని
కాలిపోతున్న కాళ్ళు కలిగించిన ఆవేదన
నామస్తిష్క ద్వారాలను మూసివెయ్యలేను
నా మనో నిబ్బరాన్ని సడలించలేను
కాలిపోతున్న కాళ్ళను పరిరక్షించుకోవటానికి
పెనం మీది నుంచి పొయ్యిలోకి దూకటం
విజ్ఞతగా భావించలేను
క్షమించండి మీతో కలసి పయనించలేను
మీ ఆలోచనలతో శ్రుతి కలుపలేను.

మేలుకున్నవాడి కలలు — జానకీజాని

లోకాలోకము

ఆకసము బీజ ప్రదాతగ
అవనియే ఒక ఆద్య మాతగ
ఖానగల్గిన మానవునకు జ
గజ్జనాళి ఒకే కుటుంబము

వింగి లోపల లేవు ఎల్లలు
సిరధిని కనరావు ఎల్లలు
ఎందు కీ ధరణితలమ్మున
ఇరుకు వాడలు, ఇనుప గోడలు

అన్ని జాతుల కొకే సూర్యుడు
అన్ని నేలల కొకే చంద్రుడు
అయినచో జాత్యహంకారము
అటవిక తత్త్వమ్ము కాదా?

ఏ కులము వెన్నెలది? తెమ్మెర
ఏ జాతికి చెందినట్టివి?
అట్టిదే కద మానవత్వము
అన్నిటికి ఎత్తైన సత్యము

ఊహలే రెక్కలుగ జేసి మ
హోన్నతముగా ఎగిసి చూచిన,
వసుధ యంతయు కన్నడును పసి
వాడు విసిరిన బంతి పోలిక

ఒక అహంత మనస్సులో వే
రూరు తొల్తగ; దాని బాహిర
శాఖలే 'నా దేశ మిది నా
జాతి యిది' యను భావ రేఖలు

ఆత్మ పాలసముద్ర మటు విం
డార విచ్చిన దండి మనిషికి
విశ్వ గోళము పండువెన్నెల
వెన్ను లొరిగిన పంట పొలమగు

మనసు నంటిన అహంభావము
మంచు మాదిరి కరిగి పోయిన
మనిషి లోపలి దేవతాత్వము
మణి ముకురము వోలె భాసిలు

స్నేహ పవమానము అగస్త్య ఋషి
షింద్రు పోలిక సాగిపోయిన
నెత్తి బిగిసిన గిరులు సైతము
మెత్తబడి మును సాగిలంబడు

మనుషు లందరు అన్నదమ్ములా
మాదిరిగ జీవించ గలిన
మర్త్య లోకమె దివ్య పదవికి
మారు పేరై పరిమళించును

చంద్ర మండల మందుకొన ఛీ
శక్తులను వెచ్చించు కన్న
మానవుని దేవతగ మార్చెడు
మార్గమును కనుగొనుట మిన్న

— సి. నారాయణరెడ్డి

న వ భా ర తి

శ్రీ భారతి అధరోష్ఠము చిందించెడి చిరునవ్వులా
ఈ భారతమాత పూజకెత్తిన బంగరుపువ్వులు
అనుపమాన దీక్షగలుగు అత్యద్భుతసాధకులే
ఆ పూజావేళలోన దీపమ్ములను వెలిగింతురు

శ్రీదేవీనిటలతటీ సిందూరారుణకాంతులు
కప్పివేయ కొందరు తమ కొలాంబరమెత్తినారు
అంధకార నీలాంబుద యవనికలను జీల్చివచ్చు
చండాంశునిదృష్టి నెదురజాలమనుచు తెలియలేరు

మ్లేచ్ఛభావదూషితమై స్వచ్ఛత కోల్పోవుచున్న
భారతీయ సాహితికిని ప్రక్షాళనవలయు నేడు
వీరార్జున విక్రములే వినుత వాఙ్మయాచార్యులు
కలముదాల్చి కదనమ్మున కాలుపెట్టవలయునిపుడు

వైదేశికదాస్యభావ పరతంత్రులు కలరిచ్చట
వినాశమ్మె ధ్యేయమ్మగు వికృతాత్ములు కలరిచ్చట
అలసు లకర్మణ్యులైన అజ్ఞానులు కలరిచ్చట
సత్య ధర్మవీరులైన సాహసులకె కొరత నేడు

సద్యఃపరనిర్వృతియౌ హృద్యానందమునె కాక
ధర్మనిష్ఠ జనులకిచ్చు తత్వము సాహితికి కలదు
ప్రాజ్ఞులుప్రజ్ఞాప్రభావ పరిణతులును సమయజ్ఞత
పూనుకొనగ నవసరమిప్పుడు వచ్చెను గ్రహియింపుడు

దుష్ట రాజకీయమ్ములు దుమారమ్ములవోలె వచ్చి
శిష్ట సాహితీ రంగము చెన్నుతరగ జేసెనకట
కష్టకాల మేతెంచెను కల్లోలము చెలరేగెను
నష్టపడినదిక చాలును నవశక్తిని ధరియింపుడు

పానపాత్ర ముందులేక పద్యము రాదొక సుకవికి
కంటి ముందు కాసులేక కదలదు పదమొక బుధునకు
బుషులు కవులుగా వెలసిన యీ పవిత్ర ధారుణిలో
వింత వింత రచయిత లీ వేళ మనకు కన్పింతురు

శాస్త్ర జ్ఞానమ్ములేని సాహసులౌ విమర్శకులు
గ్రంథము లోపల జూడని క్కాటలాగు పండితులను
సంప్రదాయమన్నంతనె శత్రుత్వము జూపు బుధులు
రచనా రంగమున నేడు రాణమీరి కనిపింతురు

కులముపేర విద్వేషాగ్నులనే విరజిమ్మి వారు
బలముమీరి వృధాన్యార్థ భంగము కావించువారు
కలముతీసి అక్రమముగ కల్లోలము రేపువారు
కలిపక్షీభావమ్ముచేత కిరాపూర్ణులై రిప్పుడు

రామాయణ గాధలన్న రంకులనుచు రచియింతురు
భారత కథలన్ననింక పచ్చిబొంకులని మింతురు
పురాణమ్ములెల్ల వట్టి పోచికోలు కబుర్లంద్రు
భారతీయ సంస్కృతియే వారి దృష్టికతిహీనము

ఆ దుష్ట తమస్సులిప్పు డావరించె నంబరమున
ఆట్టి కూరకుటిలాత్ములు అధికారములందు వెలసి
రమల సాహితీ సరసిని కుమతులు కలిపెదరు విషము
స్వచ్ఛారుణ సావిత్రీ సాంధ్యరాగ మెప్పటికో

ఎప్పటికో ధర్మశైల హిమజీవన జలపాతము
ఎప్పటికో నవసమాజ ఋషిభావన నిర్మాణము
ఎప్పటికో జాతి నుద్ధరింపగలుగు నైతిక బల
మెప్పుచుండు సాహిత్యాభ్యుదయ మహోదాత్త సృష్టి

ఆ నూతన సృష్టి కొరకు ఆ చైతన్యమ్ము కొరకు
ఆ మహితస్ఫూర్తి కొరకు ఆ యఖండ శక్తి కొరకు
ఆ వాఙ్మయ దీక్షకొరకు ఆ తీవ్రతపమ్ము కొరకు
అఖిలమ్మును అర్పించిన ఆర్యయోగి భావన యిది

భారతీయ సంస్కృతియే పరిపంచానికిక నిష్కృతి
విమల హిందు ధర్మమ్మే విశ్వశాంతికిక మార్గము
సాంస్కృతిక జ్వాలరేపు శాత్రవులను రూపుమాపు
కవులు నేడు రంగములో కాలూనక తప్పదింక

తప్పదింక భారతీయ ధార్మిక నవ విప్లవమ్ము
తప్పదింక ఉపనిషదసి ధారావ్రత పాలనమ్ము
తప్పదింక సాహిత్యోద్ధరణ విశిష్టోద్యమమ్ము
తప్పదింక తపస్వులకు ధర్మఖడ్గ ధారణమ్ము

— ప్రసాదరాయ కులపతి

కాలాన్ని కత్తిరించి చూడకు

కాలాన్ని కత్తిరించి చూడకు
భూతం భూతం కాదు భయపడకు
గతంలోకి తొంగి చూడొచ్చు.

వర్తమాన కేంద్రంమీద విలబడి
భవిష్యత్తు జరీఅంచు అందుకోవచ్చు
నీ చూపుకి ఒక్క ముఖం కాదు
శత సహస్ర ముఖాలుండాలి.

గతం ఆది; అది పునాది
వర్తమాన భవనంమీద విలబడ్డ నువ్వు
అదిగో ఆ చీకటి మబ్బుల వెనక నిలిచి చూస్తున్న
ఉషాయోష పాపటపై సింధూరం తీర్చాలి.

కాలానికి గండ్లుపెట్టి చూడరాదు
అది నిరంతర ప్రవాహం

దేశాన్ని విభజించి భజించరాదు
అది అఖండ స్వరూపం

జీవితం దేశకాలాల సహగామి, వేరు చెయ్యరాదు
అది త్రివేణీ సంగమం.

కాలాన ఈది ఈది వచ్చే
ఈదేశం నీది, ఈ బ్రతుకు నీది
నీ దేశాన్ని నువ్వు కాపాడుకోవాలి
నీ బ్రతుకు నువ్వు బ్రతకాలి

ఇప్పుడు దేశానికి స్వాస్థ్యం లేదు
బ్రతుక్కి బ్రతుకు తెరువు లేదు.

తెల్లగా నవ్వగల్గటం ఇక్కడి చీకటి ప్రత్యేకత
నల్లముసుగు కప్పుక మూల్గటం ఇక్కడి వెల్గుకు దుగ్మత

అహంకార సాకారమూర్తులు
అవివేక కిరీటధారులు
కాలస్వభావం గురుతించనివారు
గత చరిత్ర గమనించనివారు

చెప్పడానికి సిగ్గెందుకు
వాళ్ళీ దేశం నేతలు.

స్వార్థం వాళ్ల మనోరథసారథి
మౌఢ్యం వారి నడుమ వారధి

గుండెను రెండుగా జీల్చినట్లు
అఖండ దేశాన్ని ఖండించింది చాలక
ఇరుగు పురుగులకు ఇంకా
'భూదానం' చేస్తునే ఉన్నారు.

అభిమానం విడిచి, అవమానాన్ని
తురాయిగా తురుముకొంటున్నారు.

అయోమయపు గందరగోళాన్నే
చైతన్యంగా భ్రమపడమంటున్నారు.

ఇదీ ... నేడు
దేశం .. గోడు.

అంతమాత్రాన నీరసపడరాదు
అంతటితో అయిపోలేదు.

భూతం వర్తమానం భవిష్యత్తు
చైతన్య కాలపు క్షణిక రూపాలు
ఏ ఒక్క అరలోనో బ్రతికేవాడు
ఎప్పుడూ సుఖపడలేడు.

వర్తమానం దుస్తర విషావర్తమే
అయినా అదే సర్వస్వం కాదు.

గతం నాస్తికాదు నేస్తం!
అది అనుభవాల ఆస్తి
గతాన్ని స్వాగతంగా చేసుక
భావికి స్వాగతం పలకాలి

అవమానాన్ని అనవరతం
అలాగే గాన ధరించరాదు
అవసరం వస్తుంది, అప్పుడు
గరళంగా విరజిమ్మాలి.

నిన్న నువ్వు తిన్న అన్నం
నేడు రక్తంగా, శక్తిగా మారాలి.
వక్రించి వ్రణంగా మారిందా
అవశ్యం దాన్ని తొలగించాలి.

నేడు నువ్వు పాడేపాట 'రేపు'కు వినిపించాలి
నేడు నువ్వు వేసే బాట రేపుకు నడిపించాలి.

జారవిడుచుకున్న ఉదయం మన బాల్యం
తిరిగిరాదు నిజమే కాని

అది మన హృదయంలో మెదలుతూనే ఉంటుంది.
అంతేకాదు, రేపు మన పాపల రూపంలో
మళ్లీ ఉదయిస్తుంది.
విన్నటి ఉదయం మళ్లీ వచ్చినట్లే
నేటి దేశం మళ్లీ అఖండమవుతుంది.

కాలాల్ని కత్తిరించి చూడకు
దేశాన్ని విభజించి భజించకు

నేస్తం! కాస్త హుషారు వేవించు
విన్న జారవిడుచుకున్న ఉదయాన్ని
నేడు సంపాదించుకోవాలి.

— వే. నరసింహారెడ్డి

సమాజం ఎక్కడా కన్పించలేదు

ఉద్రేకాలతో హృద్రోగాలతో నిండి
ఉద్వేగాలతో నిర్వేదాలతో ఎండి
ఆవేశాలూ ఆక్రోశాలూ ప్రవహించగా
మోసాలూ ఉక్రోశాలూ పొంగిపారగా

ఏకాండభ్రాంతి సర్వత్రా కల్పిస్తూ
ముక్కలుగా చెక్కలుగా విరిగిపోయి
అతుకులుగా గతుకులుగా తయారైన
అతి విశాలమైన ఈ దేశంలో

ప్రతివాడి నాల్కచివరా నాట్యంచేసే
ప్రతినాడి గుండెలపై కుంపటి పెట్టే
స్వరూప స్వభావ ప్రభావాలతో
కరాళ భయంకర ప్రవృత్తితో
నిర్వచింపబడుతున్న-నిరూపించబడుతున్న
సమాజాన్ని చూడాల్నని
దానితో ఒకసారి మాట్లాడాల్నని
అడుగడుగునా వెతుకుతున్నా ;
అందర్నీ అడుగుతున్నా.

అయ్యా !
ఎక్కడండీ సమాజం ?
ఏదండీ దాని చిరునామా ?

ఏ మహోన్నత సింహాసనంపై కూర్చుంది
ఈ దేశాన్నది పాలిస్తున్నది ;
అనంతంగా బాధిస్తున్నది ;

ఏ సుదీర్ఘ హస్తాన్ని ప్రసారించి
స్వేచ్ఛను బిగిస్తున్నది ?
కాంక్షను విరుస్తున్నది ?

ఏ ప్రగాఢ లోహపదఘట్టనతో
ఆత్మ నణుస్తున్నది ?
అందాన్ని చంపుతున్నది ?

ఏ కరాగ్నేయదృష్టిపాతంతో
ఆనందాన్ని కాలుస్తున్నది,
అభ్యుదయాన్ని కూలుస్తున్నది,
లేత మనసుల్ని కమిలిస్తూ
పాత మనుషుల్ని వెలిగిస్తున్నది,

మాజీ మనుషుల ఊహల తీరుల్లో
గాజు కన్నులు దాచిన చూపుల్లో
తమ మనస్సులో నిండిన కాలుష్యానికి
స్వార్థజనీనత కల్పించే యత్నాల్లో

మాట వినకుండా ముందుకురుకుతున్న
అల్లరి చిల్లరి దుందుడుకు పిలగాణి
ఆపేందుకు,
భయాన్ని కల్పించేందుకు
ఉరుకుడు నియమించేందుకు
బూచిని చూపే మనస్తత్వాల్లో

వైయక్తి కాధికార దార్ఢ్యానికి
పారంపరీ భావలోభానికి
బలం సమకూర్చుకునే ఊహల్లో
తలలు పండినా మనస్సు పండని
ఫలించని కలల్లో బలం చాలని
చాలీ చాలని ఇరుకు బతుకుల్లో
చీలిన బతుకుల గతుకుల్లో

అందరి తాపాలకూ లక్ష్యమైన
అందరి కోపాలకూ గురైన

సమాజాన్ని చూడాల్నని
దానితో ఒకసారి మాట్లడాల్నని
విసుగు లేకుండా తిరుగుతున్నా
విరామం లేకుండా వెతుకుతున్నా

పరస్పరం నేరారోపణ సహజమై
ఆంతర్యములో ఆలుముకొన్న భయాన్ని
తన చుట్టూతా పరుచుకొంటున్న

పరస్పరం అవగాహన విహ్వతమై
ఆంతర్యంలో పెరిగిన అనిష్టానికి
అందలి భాగస్వామ్యం కోరుతున్న
తృష్ణా వికృష్వనుష్వమాణ భావజ్ఞో
రుష్యన్మనుష్యభ్రిమకృద్రూపాల్లో
అవి వేసిన మార్గాల్లో

అఖండ కాలాన్నాసరాగా తీసుకొని
అలసటా సొలసటా అణచుకొని
ఆగకుండా వెతుకుతున్నా.

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.

నమ్మకంగా దొరికిన చిరునామాను
నమ్మకోనిపోయి చూస్తూగదా—
చూస్తున్న నే నొకణ్ణే తప్ప
ఆలోస్తుచినవాణ్ణి తప్ప
కనిపించిందొకే ఒక్క శూన్యం
సింహాసనంమాట దేవుడెరుగు

చివరకు చిత్రాసనమైనా కన్పించలేదు
అందాజాగనైనా రూపు కట్టించుకునేందుకు
అస్పుటంగానైనా రేఖాచిత్రం గీసేందుకు
ఏ ఒక్క ఆధారమూ కన్పించలేదు.

చిరాగ్గా గిరుక్కున వెనక్కు తిరిగి
ముందుకడుగు వేస్తూ గదా—
నమ్మకంగా చిరునామా నందించిన
నమ్మకందార్ల జిడ్డు మొహాలపై
తుడిచినా పోని మట్టి మొహాలపై
సంతలో కొనుక్కొచ్చిన చిరునవ్వులు
చౌకగా సంపాదించిన ఇకిలింతలు
చీకటిబజార్లో సాధించిన అతిపొదుపైన ఓదార్పులూ
వాణ్ణి వీణ్ణి నెత్తి కొట్టిన సానుభూతులు
తప్పనిసరి నిట్టూర్పులూ ప్రక్కకు తిరిగి కన్నిల్పులు.

బిగసిన మొహాన్ని మరింత బిగించి
గుండే గొంతూ పెకిల్చి తీసిన
మాటల్ని మొహాన గొట్టి
జారవేసిన జబ్బలనూ దిగాలుపడ్డ కన్నులనూ
అట్లనే తెరిచిన నోళ్లనూ
అమాంతం కదిలిన వాళ్లనూ
తప్పుకొంటూ, తప్పించుకొంటూ
అనుకోనంత వేగంగా, మరోదారి చేరంగా—

౪

తాను తప్ప మిగతా సర్వమూ
ధర్మేతరమూ, దర్పితక్రౌర్యమూ

దమనశిల్పమూ అన్న ఊహా—
అధికారమూ ప్రతీకారమూ
ఆత్మ సుస్థితికవసరమూ తప్పనిసరీ అన్నభావం
అలభ్యమైనసాహసాన్ని అన్యత్ర దర్శించినప్పుడు
పురివిచ్చిన అసూయ—

ఒకందుకు పంచిపెట్టితే మరొకందుకు పంచుకొనే
ఆలోచనా సంక్లిష్టత—

అంతరాంతరాల్లో దాగిన
మనస్సు కేమాత్రం అందని భవిష్యత్తుపై భయం—
వ్యక్తి పరిమితం కావలసిన నమ్మకాలు
పరిధిని మించి బాధలు కలిగించే పరుగుగట్టిన అజ్ఞానం
అవసరాన్ని సామర్థ్యాన్ని మించి
ఆనందాన్ని దాచిపెట్టుకొనటంలో హద్దుమీరిన ఆశ—
లోకానికి రకరకాల వేషాలేసి
అందర్నీ కర్షించి బిగించాల్నని విజృంభించే మోహం—

డబ్బుతోటే సమస్తాన్ని బంధించి
అరచేత వైకుంఠం నెలకొల్పాల్నని ఉరవడించే తృష్ణ—
కూలిపోయే తరాల అంతరాల్ని
బలహీన హస్తాలతో ఆపాల్నని నిరంతర యత్నం—
ఏం చెయ్యాల్నో తోచక
దేన్నీ పట్టించుకోని గాఢనిష్క్రియత—
అనేకానేక రీతులుగా విజృంభించి
వైయక్తికావర్త ప్రవృత్తులు

౫

అన్నిటినీ బేరీజువేసి చూస్తుంటే
ఎక్కడా కన్పించలేదు సమాజం,

సమాజంపేర భయంతప్ప—
ఎక్కడా రూపుకట్టలేదు సమాజం
సమాజంపేర భారం తప్ప—

గాలిసి ధూళివి పోగుచేసి
గగనంలో గారడీ తప్ప.
మాటలతో మప్పిదాలతో
జాగ్రత్తగా మిన్నెత్తుగా కట్టిన
కనుకట్టు మేజ తప్ప.

అధైర్యాన్ని దాచుకుంటూ
పాశవికతను మూసుకుంటూ
మనుష్యత్వాన్ని ప్రదర్శించే
ఆకార వికారాలు తప్ప.
సమాజం ఎక్కడా కన్పించలేదు.

అత్యవసరాల కందకుండాపోయి
ఎక్కడో కేంద్రీకృతమైతున్న వేళ—
అనుబంధా లసలే మిగులకుండా

బతుక్కు బతుక్కు మిన్నెత్తుగ
కంచుగోడలు కడుతున్న సమయాన

అహం చూపందకుండా పెరిగిపోయి
ఆడంబరం అవకాశమంతా నిండి
జడలు విచ్చి నాట్యం చేస్తున్నప్పుడు
వట్టి వ్యుత్పత్యర్థంలో తప్ప
సమాజం ఎక్కడా కన్పించలేదు
మనిషిని మనీషిగా రూపొందించి
మమతా సమతా పెంపొందించే
మహాయత్న యజ్ఞంలో జన్మించే సమాజం

గజం గజానికి కత్తులు మొలువగా
హాహాకారాలు చెలరేగగా
అసమత్వం విషమత్వం గోతులు తీయగా
అడుగడుగునా నిప్పులు చెరుగగా
బతికుండటరీ అసంభవం
అందుకే —
సమాజం ఎక్కడా కన్పించలేదు.

— పంపట్ల మాధవ

కావ్యసూక్తము

ప్రతిభ యున్నది నిత్యనూత్నము
ప్రతిభ కవితకు ప్రాణసారము
ప్రతిభ ప్రకటితమైన చోటను
ప్రాత క్రొత్తలు లేవు కవితకు

క్రాంతదర్శన మున్నచోటను
కావ్యగతులకు లేవు ఎల్లలు
దృష్టిదోషము లేనిచోటను
కాలదోషము లేదు కవితకు

నియమమన్నది నిక్కమగు నం
స్కారజీవితసారసూత్రము
నియతి కవితకు కావ్యభాషకు
నిండు జీవము విలువ నిలుకడ.

సర్వ సారస్వతము సభిరుచి
సాపేక్షమ్మది భావగమ్యము
భావమన్నది వ్యక్తినిష్ఠము
వ్యక్తివ్యక్తికి వాసి గలదది
సార్వకాలికమైన సత్యము
కాన నానా కావ్యచర్చల
వలదు వల దతివాద శౌర్యము

కావ్య మది యధికార గమ్యము
మనిష మనిషికి తారతమ్యము
కలదు కావున కాదు కావ్యము
సర్వ జనులకు సంత వస్తువు.

ప్రగతిశీలము నతి విశాలము
నగు చరాచర జగతి లోపల
కావ్యగతి మార్గము లనేకము
సుముఖజన సుగమములు సర్వము
సహృదయత యందలి రహస్యము
సర్వ సత్పథ సామరస్యము.

— యస్వీ. జోగారావ్

•

దేహ శ్రీ

౧

గరళమునుఁగ్రోలి కలశాబ్ధి కలఁగు నమృత
మందరను పంచికొమ్మని నట్టివాడు

సకల సంపత్సమృద్ధి హస్తగతమైన
చింకి పాతయు లేని నిష్కించనుండు.

ఇట్టిదన త్యాగ మన్నచో నెంత విసము
మ్రింగికోవలె నమృత మర్పించు కొరకుఃఇట్టి దన రాగరాహిత్య మెంత కలిమిఃపూసికొన నేమి లేదింత బూది తప్ప.

ఆ మహాస్వామి మాహాత్మ్య మాంతరమున
నిత్య నూత్నముగా వెల్గి నిండి మనుత
ఆ మహానట వికటాట్ట హాస కటుత
కలాష విధ్వంసి యగుచు రక్షణము విడుత.

౨

ఎంత కాదనుకొన్న హృదంతరాన
భయము లేకుండ మావిసి బ్రతుకలేడు
దాని దాచి పెట్టగ నేది యేని చేయు
నట్టి పద్ధతికే బ్రతుకన్న పేరు.

పాము పోలిక పుట్టలో బ్రతుకు మనది
పడగ విప్పితివా వ్రేటు పడకపోదు
నిర్భానంద దివ్య సంగీతమనిన
బియట తప్పదు పాములవాని బుట్ట.

ఒక్క కన్నీటి చుక్క కవోష్ణమగుట
కెంత దావాగ్ని కావలె నెవడెరుంగుఃఅవనిపై పాదమే పెట్టనట్టి నీకు
తెలిసికోనగు నాసయే వలదు పొమ్ము.

ఈ వ్యథాబిద్ధ జీవిత మెంతదాక
నేను నటియింప వలయునో కావి స్వామిః
నా మనోవీధి నతివేల కోమలమ్ము
చేసి రసవీధి కత్తులు దూసినావు.

భగ్నభావన లుచ్చైర్విభావ్యమాన
పారలౌకిక కాంక్షలు తారసిల్లి
వర్త్తమాన జనుఃప్రాప్త వసువువోలె
చపలచపలమ్ముగా వెల్గి సాగిపోవు.

ఈ నభస్స్థాప నిర్మాణ మేనుదక్క
వింతగా నిన్ని రీతుల నెవడుసేయుఃా
ఏ తదద్భుత సుందర సృష్టి నిట్లు
స్వామిఃా వినువీడి పడద్రోయఁ జాలునెవడుఃా

నీవు కలవను విశ్వాస మావరించి
జీవితం బింతదాక రక్షించినాను
దుస్తమోదేశ మధ్యము దూరి సాగు
కాంతి రేఖాగత ప్రాణకల్పుడేను.

నన్ను వాచాలు పొనరించి నర్మగర్భ
భాషణమ్ముల ప్రొద్దును పంచినావు
తృణవదల్పప్రమోదము తెచ్చిపెట్టి
పూర్ణతావీధి తలుపులు మూసినావు.

అపజయమ్మ్ లసంఖ్యాకమైన యపుడు
కూడ చూచెద నీ గుడి గోపురములు
నన్ను కామప్రతారితాపన్ను రక్షి
నేయవే దివ్యసత్కృపామేయగరిమ.

భయము కలిగించు తలచుకోవలదు కాని
మరచి పోలేను. నాయెద మాసిపోని
చిత్రమది. నీ కంటి చివరలందు
ప్రేమవారాశి పొంగిన బిందువొకటి.

నన్ను రక్షించుకొనినాను, చిన్ననాడు
ప్రేమ పరిధికి దూరమై పెరిగిపోయి
గోవు వంటి నేత్రమ్ములి కొనవెఱంగు
బాష్పబిందువు నిజము దావానలమ్ము.

పిచ్చి కన్పింపగా నీవు...విప్పరాని
దుఃఖ పాశాలతో నేను, తోడునీడ
కోరనే లేదు, నీ కంట జారివచ్చి
వెలుగు నక్షత్రపు జాలిగా పిలుచు వరకు.

అర్భకుడవైన నీవు కరాగ్రమంది
వెంటనడచుచు నీ మూగప్రేమ వెలుగు
కన్నులెత్తి ననూరక గాంచుక్షణము
నన్ను పాతాళమున కంపుచున్నదనుచు
నీవెరుంగవురా! బాబు! నీవెరుగవు.

ఇంత నిర్మలప్రేమ భరింపలేని
నన్ను నీ దారి పడవై చికొన్న విధికి
హృదయమును పిండిపెట్టుట కింతకంటె
తీవ్ర శిక్షావిధానము తెలియలేదు.

—శ్రీ పెరుంబూదూరు లక్ష్మణమూర్తి

ఇది నా తరం గీతం

వీళ్ళంతా
బాధల పల్లకీ బోయీలు
జీవితం కరుణించనివాళ్ళు
అర్ధరాత్రి రెప్ప కింది
కాటుకలో చోటుచేసుకొన్నవాళ్ళు
బాధల్ని తివి
మృత్యువును జీర్ణించుకొన్నవాళ్లు

వీళ్ళంతా
జ్ఞాపకాల బంధాలను తెంపుకోలేని
భరోసా కనిపించని బ్రతుకు బండీలు

వీళ్ళలో
చాలామంది
బ్రతికేయటం తప్ప
జీవితానికో అర్థం లేదని భ్రమపడ్డవాళ్లు
అనుభవం తప్ప మరేదీ
మాకొద్దని
అనుభవాన్ని పూర్తిగా సొంతం చేసుకోలేక
దాన్నించి ఏమీ నేర్చుకోక దగాపడ్డవాళ్లు

వీళ్ళే
కలల్లోనే నిజాల్ని కళ్లజూచినవాళ్లు

ఏదో చేద్దామనుకుంటూనే
బ్రతుకు పొద్దును
పదమటికి మళ్ళించినవాళ్లు

ఆలోచనలే అంతరాయాలై
చేసుకొన్న నిర్ణయాలే చేతలకి సంకెళ్ళై
చీకటి మనసుకొట్టులో చిక్కుక పోయినవాళ్లు

కాలపు కలల సంచీలో
కాళ్ళు ముడుచుక పడుకున్న వాళ్ళు

పిచ్చోళ్ళే

అనేకానేక శతాబ్దాల
అశక్తత రూపుగా అవతరించినవాళ్ళు
గతాన్ని కాదంటా
వర్తమానాన్ని వద్దంటా
భవిష్యత్తుపై భరోసాలేని వాళ్ళు
చరిత్రి పై జన్మ తప్ప
చరిత్రలో చోటు లేనివాళ్ళు

వీళ్ళ జీవితం

అతితెలివి పిల్లవాడు
మితిలేని నమ్మకంతో
చేసిన తప్పుడు లెక్కలాంటిది
సమాధానం మనస్సులోనే ఉంది
తప్పు మాత్రం నిజమై
కూర్చున్న మాదిరి

వీళ్ళంతా

తమపై తమకే నమ్మకం చెడ్డవాళ్ళు
ఈరోజు సాయంత్రమే

బ్రతుక్కి చివరి రోజునుకొని
తాపత్రయపు మిన్ను విరిగి మీదపడ్డవాళ్ళు
లేపటి గూర్చినభయంతో
నేటిని మాయగా మార్చుకొన్నవాళ్ళు
కీర్తి మీద భక్తితో
మంచితనం మీద అనురక్తితో
తమ వ్యక్తిత్వాన్ని వదిలివేసినవాళ్ళు

వీళ్ళంత

లోకం పల్కులందు మించినవాళ్ళు
లోకం నాల్కపైన చెడ్డవాళ్ళు
చరిత్ర వీళ్ళనుగూర్చి చెప్పదు
వీళ్ళే చరిత్రను వల్లెవేస్తూ
దాటి పోతారు.

వీళ్ళంతా

దాసులు, దరిద్రులు
దౌర్భాగ్యాన్ని వద్దని వరించిన వదురుబోతులు
జాతుల జాబితాలో
ఒక్కట్లకు ప్రక్కన
ఒద్దిగ్గా నిద్దరోయే పూర్ణానుస్వారాలు

కాలాన్ని కైవసం చేసుకుందామని
స్టలానికే స్వాహా అయిన వాళ్ళు
తమ్మే తాము తెలుసుకుందామని
దిమ్మ తిరిగినవాళ్లు

ధ్యేయాన్ని చేరుకోలేక
జీవితం హేయమని వాపోయినవాళ్ళు

భగవాన్ :

తప్పించు లోకం భవిష్యత్తును
చగాకోర్లనుంచి, దండగరాయుళ్ళనుంచి
ద్వైనందిన ప్రవచన పరాయణులనించి
అణా పైసలకు తప్ప అక్షరాల విలువతెలియని
అశక్త దురన్నులనుంచి
అతిశయ స్వార్థపరుల అభినయం నుంచి
అశక్త సజ్జనుల ఆకర్మణ్యతనుంచి

బ్రతుకునొక మరణశిక్షగా
బ్రతికే వాళ్ళనుంచి
దుఃఖజీవుల దురంతర కాపవాహినినించి

తప్పించు
లోకం భవిష్యత్తు

రప్పించు
లోకానికి ముక్తి

పుట్టించు
భవిష్యత్తులో రక్తి.....

— అరిపిరాల విశ్వం

ఆనందం జీవనది

మంచి మాట వినిపించు చెలికాడు
మది పులకిస్తుంది, ముదంతో
మనమైత్రి వికసిస్తుంది

కరుకు పలుకులనకు తమ్ముడూ
ఎడద తరుక్కు పోతుంది
కడగండ్లలో ఇరుక్కుపోతుంది

సీసాలకొది ఉత్సాహపు టానిక్
దోసిళ్ళకొద్ది సంతోషపు శర్కర
పంచిపెట్టు మిత్రుడ పదిమందికి

మాసాల పాపాయి మొదలు
మీసాల బాబాయి వరకు
తలపండిన తాతయ్య దాకా
చిరునవ్వుల నునుజల్లులలో
పరిశుద్ధులు వరసిద్ధులు అయ్యేవారే,
రక్తిని ముక్తిని పొందే వారే

దురవస్థా పద్మవ్యూహం నుంచి
దుసికిల్లే మహాయత్నంలో
సామాన్య అభిమన్యులకు
సమ్మోదమే శరణ్యకవచం

దుష్టుడి మేధా వలయంలా పరుచుకున్న
చీకటి వలలో చిక్కుల వలకో
తగుల్కొన్నానని తలపోసి
దిక్కు తోచదని వాపోయి
ఉత్తలపడకు ప్రియసఖుడా!

ఆశావాదం మన పాలిటి ఖుదా
ధనార్జన కామేష్టిలో
ఇంధనమై కాలిపోకు.

అవుడూ ఇపుడూ ఎపుడూ సంతుష్టుడే
ఈ మూడు జగముల పూజ్యుడు

తేపు మనది
గెలుపు మనది
జీవిత మైదానంలో
ఆనందం జీవనది.

గోపాలచక్రవర్తి

అనుభూతి

పురందరదాసు కీర్తనేదో
ఒక మధ్యాహ్నం
బయటెక్కడో కాస్తున్న ఎండలోకి
చూస్తూ నాదస్వరంలో విన్నప్పుడు

ఆ మేఘాలు కదలాడినయ్
గాలి పిచ్చిగా పరవ్వెట్టింది
గగననీలం పల్చబడింది చైతన్యంలో విస్తృతమై
నా మేనంతా ఏదో పులకలు
కనులు తడి,

ఆపుకోలేని అనంత జ్ఞాపకాల వెలుతురు
ఎపుడో చచ్చిపోయిన అమ్మ గుర్తుకి
ఆదిశక్తి తనువంతా విద్యుత్తులా ప్రాకి

ఎన్ని గమకాలు ఆ నాదంలో
జగత్తంతా శుభంలో పూచి
మన గుమ్మాలకు కట్టిన తోరణాలు అల్లాడినట్లు;
ఎంత విసుగు ఆ జాజ్ మ్యూజిక్
వాల్ట్జ్‌ను యివ్వగలదా
ఈ పురా చైతన్యానుభూతి?

ఆ బూర ఊదినవాడు
ఇదిగో యిప్పుడు మేఘంలో
అదుగో సూర్యుడి మీద పడుకొని
మరో తృటి తారల చుట్టూ దోబూచులు
మరో లిప్త మన యింట్లో నీలో, హృదయంలో
సాగర సంగీతాన్ని నిశ్శబ్దం చేసి
సాగరాన్ని విస్తబ్దంచేస
అదుగో ఎన్నో యోజనాలు వెళ్లిపోతున్నాడు

ఆ సుస్వరం వెళ్లిపోయిన దారిన వెళ్తే
అక్కడ అమ్మ

నాదం నిండా వాత్సల్యం పొంగి పొరలి
పురాబాల్య స్మృతులతో తలంటి పోసి
స్వచ్ఛ ప్రేమతో సాదు బొట్టు పెట్టి
సర్వ జగచ్ఛరీరాన్ని ధవళ వస్త్రంతో తుడిచి

ఒకటే నాదం
ఆనందనినాదం
నాదస్వరంలో
ఆదిస్వరంలో

1

గగననీలాన్ని గాలి
పొరలుపొరలుగ చీల్చుతోంది
రెండూ అదృశ్యములే.
దిక్కులు ఊహా జనితాలు
దిక్కులు లేవు

కృష్ణుడు దిగంబరుడు
కృష్ణుడు శ్యామం
ఏమీ లేనిది నీలం
ఆకసం ఏమీ లేనిది.

2

ఇది నాది
ఈ సంగీత సాంప్రదాయం నాది, ఇది అనాది
అమ్మలా ఇది ఆది శక్తి.

పురందర దాసుతోబాటు నేను
అక్కడ చంద్రుని చుట్టూరా నేను
చుక్కల్లో తప్పటడుగులు వేస్తూ నేను
నాతోబాటూ రండి

పురందరదాసుని నేను
మీరందరూ ఎక్కడ పనులక్కడ వదిలేసి
నాతోబాటూ రండి

అదిగో ఆకాశం మనకోసం గీచిన హాసరేఖ
అదుగో ఎండలో యింకా మెరుస్తోంది

ఏ సాయంత్రానికో వెళ్తాం మనం
జడంనుంచి చైతన్యానికి
నాదస్వరం గాలి మూల్లోకి పాకుతుంది
మన గుమ్మాల తోరణాలు కదలాడుతున్నై
గగనసీనీలం పల్చపడుతోంది.

ఎవరో పిలుస్తున్నారు
ఆ మండిపోతున్న మేఘాల కొసనుండి.

— వేగుంట మోహనప్రసాద్

అందాల అతిథులు

ఎందుకు వస్తున్నాయి ఈ అందమైన భావాలు
నిశ్శబ్ద బంధురమైన నా మందిరంలోకి—
నా అందాల అతిథులకు ఏ ఆతిథ్యం ఇవ్వగలను.

వెన్నెల బాటలు విడిచి వచ్చిన
అప్సరసల గుంపుల్లా వస్తున్నాయి
ద్వారాల్లేని ద్వారబంధాల్లేని ఈ మందిరంలోకి—
ఆకాశపు నిర్మల నీలోదకాల తీరాలనుంచి
చిగివచ్చే లేయెండల పిండుల్లా
వస్తున్నాయి

విరిగిపోయిన కుర్చీల్లాంటి అనుభవాలుపడున్న
నా జీర్ణమందిరంలోకి—

కొండల్లో కోనల్లో క్రుమ్మరే దేశద్రిమ్మరిగాలి
వేసవి అడవుల్లో రాలిన ఆకుల మీద

చరా చరా నడిచి వచ్చినట్లు
ఎందుకు వస్తున్నాయి, చెదరిపోయిన చిత్రాల్లాంటి
స్వప్నాలు ప్రేలాడే ఈ శూన్యమందిరంలోకి—
పిట్టల్లా భ్రమరాల్లా పూలపెదవులు చుంబిస్తూ
తృణబాలికల శిరస్సులు స్పృశిస్తూ
వస్తున్నాయి

గాలుల దాడికి కప్పెగిరిపోయిన ఈ శిథిలకుడ్యాల్లోకి
ఏమివ్వగలను ఈ అతిథులకు ?
కనురెప్పల కొసల మసలే ఒంటరి బాష్పంలాంటి
ఒక గంభీర కంఠస్వర గీతిక తప్ప

యెదలు భగ్నమైన యెండలు
శాంతి కోల్పోయిన గాలులు
విషాదం తొణికిసలాడే వానలు
విడిసే ఈ ఎడారి సత్రంలోకి
ఎందుకు వస్తారు మీరు ?

నిర్జనప్రదేశవాసిని, లోకాంతరాలనించి
వచ్చిన ప్రవాసిని
నన్నే ఎందుకు వరిస్తారు ?
పొండి

సీలాకాశంలో తెలిమబ్బులై పొండి
సాగరాల్లో నావల తెరచాపలై పొండి
దూరతీరాలకు తరలిపోయే పవనాలయి పొండి
రేపటి గులాబీల తోటల్లో
ఉషస్సులై పొండి
పొండి ... ...

— గుంటూరు శేషేంద్రశర్మ

ఆచుంబితం

మాట్లాడని మల్లెమొగ్గ
మాదిరిగా నవచిరా
నిశ్శబ్దం ఎరుగనట్టి
నిమ్నగవలె నడచి పో

చేదగు కన్నీటిబొట్లు
చిందిన చప్పుడులు విను
వాదింపగరాని మనసు
పరవాదిని లోతు కను

మూగిపుస్తకాలలోని
రాగాలను పాడుకో
గాలివోలె కనుపించే
ఆలోచన వాడుకో

కడుపులోని దుఃఖంవలె
కరశ్మోత్తి పడెడు కడలి,
పచ్చని లోకమును చెరప
వచ్చెడి శైశిర పిశాచి

వెదురు పొదలలో చొరబడి
రొద లిడు మలుసందె
గాలికంపె తేలికగా
కదిలెడు కవి మనసు జాలి

భీముని గదలా బరువై
భీతిగూర్చు ఋషిశాపం
రాముని బాణాని కంటె
ప్రబలమైన జనకోపం

ఆకులేని మోదుగుపై
కాకలెతు పూమంటలు,
ఎరుపులేక నీరులేక
ఎగసి వచ్చు ఎద పంటలు

మనసుకె కనరాని రూపు
మాటకు వినరాని ధ్వని
తలకందని క్రొవ్వాసన
బుద్ధి కందనట్టి యెత్తు

ఆలోచన లంత లేత
వైన అంగుళుల కొసలు
స్పర్శింపగ లేనంతటి
పలుచని అర్ధాల ఓడలు

కోర్కెలు చుంబించలేని
కోమలి ఆశల పెదవులు
గగనము మాత్రమె దర్శిం
చగల విశాల మనస్సులు

ఉగాదిలో దీపావళి
కాముడిపున్నమకు వాన
భాద్రపద మహాంధకార
పథములలో చిలుక పిలుపు

రత్నాల్లో నాల్గు రాళ్ళు
ప్రేళ్ళు ప్రతుకు బాటలందు
అప్పు దప్పుడవి పూయుట
మరల అంతలో మాయుట

తలలు వాల్చియున్న జనం
గళాలెత్తి పాడుట,
కదలలేని ఎద నెమ్మల్లు
కండ్లు విప్పి ఆడుట

మట్టి ఆకుపై విష్ణువు
మాదిరి శబ్దమున శక్తి
సముద్రాన పాల వోలె
పరిగమలో సంగీతం

మనకున్న నిఘంటువులు
వినవట్టిది కనవట్టిది
నది తరగలలో, భావుకు
మదిలోపలి వింత పలుకు

మెట్లులేని మేడమీద
మేటి నీలి ముసుగు తీసి
నవ్వే అందాల తరుణి
నవశారద వికాశశి

ముసలి భాస్కరుని చూపుల
మసకలలో తప్పిపోయి
కనుపించిన కాలాంశం
కవిచూపుల కనుపించుట

అర్థ మగునె స్థగం సగం?
అచుంబితం మనోజగం
అందుకొరకె కలం ముక్కు
సందు సందుచేసుకో

ప్రవహించుము నీలో నీ
వెవరని మేల్కొల్పబోకు
విచ్చిన ఎదకంటి చూపు
విశాలమై క్రమ్మనీ.

— దాశరథి

నవత - కవిత

మిత్రమా:

కవిత వున్నపుడే నవత రాణిస్తుంది
అసలు కవితలోనే నవతకూడా వుంది.
కాని, మోడరన్‌గా వుందామని, ఏదో అందామని
తనకే తెలియని అస్పష్టపు అనుభూతిని
అర్థంలేని ఇమేజినరీతో కలగా పులగపు వర్ణనలతో
టిలాన్ ధామస్‌కు చేతకాని అనుకరణలతో
ఎందుకు బాధిస్తావు నన్ను, బాధపడుతావు నువ్వు:

"రాత్రి రెండో జాములో రెండు కత్తుల్ని తిన్నాను
గుండెమీద, సల్ఫూరిక్ యాసిడ్ పోసుకున్నాను.
నా పెదవుల్ని కత్తిరించి నీ వీపుమీద అతికాను.

ఈ విముషంలో విషంలో నా నేత్రాలు సువర్ణముషాలు"
ఇలా రాయడం కొత్తగా, గమ్మత్తుగా వుంటుంది కాని, ఇదినాన్సెన్స్
ఇది పసితనం ప్లస్ వెర్రితనం యింటూ డికడెన్స్

ఈ కషాయం వికటిస్తుంది.
ఈ వ్యవసాయం వెర్రితలలు వేస్తుంది.

కవిత్వంలో అబ్స్‌క్యూరిటీ కొన్ని సందర్భాలలో వుండొచ్చును
కాని, పాఠకుడికి నీ అనుభూతి ఆకారం అందాల్సి హత్తుకోవాలి.
అది ట్రాన్స్‌పరెంట్ చీకటై వుండాలి, నిన్ను పలకరించాలి
కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరవాలి, కదలించాలి.

ప్రతి మాటకీ శక్తివుంది, పదను వుంది
ప్రతి చిత్రణకీ అర్థం వుంది, ఔచిత్యం వుంది,
గులకరాళ్ళ డబ్బా మ్రోగించి గొప్పసంగీతం అని డబాయించకు
అలిగి నన్ను శపించకు, అన్నా : నీ మీద నాకు కోపంలేదు.

గంతలు కట్టినంత మాత్రాన గాడిద గుర్రం కాదు.
ఖద్దరు ధరించిన ప్రతివాడు గాంధేయుడు కాడు.
ఆధునికత వున్నంత మాత్రాన ప్రతీదీ శిరోధార్యం కాదు
ఆహార్యం మార్చినంత మాత్రాన సామాన్యుడు మహారాజవడు
అంత్యప్రాసలు వేసినంత మాత్రన ప్రొజైన్ భావం పొయెట్రీ అవదు

కవిత్వం ఒక అల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును.
కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకి తెలుసు
కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీ శ్రీకి తెలుసు.

ఈ కాలంతో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు
ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు

ముప్పు చెప్పేదేదైన నీదై వుండాలి,
నీలోంచి రావాలి-చింపుకొని రావాలి.

మాటలు పేర్చటం కవిత కాదు-మంత్రం తంత్రం అసలేకాదు.
మళ్ళీ యీనాడు చిత్రకవితల్నీ.
అయోమయబంధాల్నీ పునరుద్ధరించకు

విగ్రహ ప్రగ్రహాలులేని భావాక్వాలని బరిమీద వదలకు
అన్నా! కవిత్వం అంతరాంతర జ్యోతిస్స్నిమల్ని
బహిర్గతం చేయ్యాలి

విస్తరించాలి చైతన్య పరిధి
అగ్నిజిల్లినా, అమృతం కురిసెనా
అందం, ఆనందం దాని పరమావధి.

— దేవరకొండ బాలగంగాధర్ తిలక్

ఆత్మ మూర్తి

ఎక్కడో వెదకనక్కరలేదు
ఇక్కడే ఉన్నాను
వెళ్ళు మనసులోకి ఏకాంతంగా,
ఆధారం కోరకుండా
అనుభవం వీడకుండా.

నినాదం శాసనం కాదు
శాస్త్రం కాదు పురాణం కాదు

అన్నిటినీ అధిగమించిన వాస్తవం
అన్నిటివి విలీన పరుచుకున్న రూపం

అనుభవానికి ఆలోచనకూ
లోతులో దొరికేనూ
ఎత్తులో అందేనూ

అణువునుండి అణువులోకి ప్రసరిస్తూ
క్షణం నుండి క్షణంలోకి పయనిస్తూ
బంధననుండి స్వేచ్ఛామతినై
ఎడారిలో పచ్చని నిజమై
ఇక్కడే ఉన్నాను.

క్షణాల నుండి అయనాలు
పరుచుకొని బ్రతుకులో
హృదయంలో స్పందించే
ప్రాణానికి పరిమాణమై
హృదయంనుండి నిర్గమించే

శబ్దానికి సంగీతమై
విన్నటి గ్రీష్మానికి దగ్గరైన
అడవినుండి ఊహాచకితంగా
నేటి వర్షానికి అంకురంవలె
ఉద్గమిస్తా ప్రతిమనసులో

ప్రతి క్షణమూ భవిష్యత్తు బారచాచి
అనుక్షణమూ చావు ఎరువు బినచోట
కొసలుసాగే ఊపిరి తీవెలపై
కాలాన్నికొలుస్తూ
ఆయుస్సు పెంచుతూ

నేను వెళ్ళగలను శైశవంలోకి
నేను ఎగరగలను భవిష్యత్తులోకి
ఉండలేను అమాయకంగా
నిల్వలేను అవ్యవస్థలో

భూమీ ఆకాశమూ
ప్రాణులూ కామనలూ
ప్రేలాడుతున్నాయి తలలో
ఆడుతున్నాయి ఎదలో

ప్రపంచం మేల్కొని ఉన్న మనస్సును
ఏ క్షణానికి ఆ క్షణమే ఒక సమస్య
నేను కాదు బాలుణ్ణీ, చంద్రుణ్ణీ
నేను కాదు దేవతనూ, భక్తుణ్ణీ

కాలంలో ఒక భాగంగా
పరచుకొని ఉన్న నేను
జ్ఞానంలో ఒక అంశగా
ఆవహించి ఉన్న నేను
అహం నుండి నిర్గమించి
క్రమించే ఆనందాన్ని.

ఉచ్ఛ్వాస నిశ్వాసాల
లయలో సాగేకాలం
ఉదయ సాయంసంధ్యలూ
రాగంలో మారేకాలం
నా కంటి వెలుగులోని
వాస్తవికతకు దర్పణం
దర్పణంలో బింబించే సమస్యలూ
ఫణిమాలలు : మాలఫణులు :

ఇక్కడే ఉన్నాను నేను,
స్వర్ణ సత్యంలో వజ్ర సుందరంగా
ఇక్కడే ఉన్నాను నేను
బ్రతుకునేలపై కృషిఫలంగా

అంతరంగమూర్తి మస్తకం
హిమాలయం నుండి
వివేకలహరీ పదం
కన్యాకుమారి వరకు
విరిసిన కిమ్మీర రూపమై
కదిలే జనసందోహంతో

ఎక్కడో వెతకనక్కరలేదు
ఇక్కడే ఉన్నాను ఆత్మమూర్తిని
పలుకుతూ అందరిలో
ఒకే రాగమూర్తినై
మెదలుతూ అందరిలో
ఒకే శిల్పరేఖనై

— మాదిరాజు రంగారావు

సర్వతో భద్ర

పొదుపు కొండల సంకు పూరించినారెవరో
దిక్కులు ప్రతిధ్వనులు పిక్కటిలి పోయినవి
చీకటులు చిత్తుగా చెదరి పర్వెత్తినవి
కల్లోలములు సడలి కడలి తెలివందినది.

తొలికోడి కూసినది తొణకినది స్వప్నము
కల విహంగమీ రుతులు కడలెల్ల ద్రాకినవి
మనక మసకగ దోచు మబ్బులే వై దొలగి
దిగ్దిగంతములలో దినకరద్యుతులొలసె.

అభ్యంగ స్నానమాడినట్లుగ పుడమి
శుభ్ర దీప్తిచ్ఛటా శోభతో తనరినది
ఏల యీ ఉదయమ్ము ఇంత సంతసమెసగు
ఏల నా హృదయమ్ము ఇటుల పులకల నెసగు.

భరత జాతిని బట్టి పల్లార్చు పీడకల
చెరిగి చిరశాంతియే చేకూరు కాబోలు
తూర్పు దిక్కులలోని తొందరలు డిందువడి
తొలినాళ్ళ వైభవమె దొలకాడు కాబోలు.

పడమటిదిక్కుగా టంధుత్వములు పొసగి
స్నేహ సౌహార్దములె చెలువొందు కాబోలు
హిమగిరుల గలసిరులు ఈప్సితార్థమ్ములై
భారతీయుల హృదులు స్పదించు కాబోలు.

కాశ్మీరమున దిశాకాంత తిలకము దిద్ది
మంగళాచరణమును పఠియించు కాబోలు
ప్రాచీన సంస్కృతి ప్రాభవమ్ములు వెలిగి
పౌరాణికాత్మయే ప్రవచించు కాబోలు.

— శశాంక

అగ్ని పుత్రిక

చిక్కటి చీకటి పొర
సాంధ్యరాగాన్ని అదుముకుంటూ
ఊహకందని యెత్తుల నుండి
దిగ్భ్రాంతికలను రాసుకుంటూ
ఎట్టగా మత్తుగా
దిగజారగా
ఆర్భటిస్తున్న ఆకాశంలా
అతి భయంకరంగా ఉంది
మనస్సు

చిట్టచివరి కాంతి రేఖను సైతం
కనుమరుగు కానీక
కసిగాట్లు కరిచే
అస్తమిత సంధ్యా
కుపితారుణ ముఖరాగ
ప్రతి రూపాలై లేచే
మంటలు
నా మనో గగనాన;
బుద్ధికేమాత్రమూ
అందని విర్గంధ బంధూకాలా;

మనశ్శలభాన్ని
మాటి మాటికీ

తమచుట్టూ తిప్పుకుంటున్న
వెలుగు మొగ్గలు:

ఏదో నలికల తాళిచు
ఎర్రగా మెరుస్తూ
పాతుకున్న సందడి లోలోపల
ప్రశ్నార్థకాల్ని మోసుకుంటూ

పదే పదే మనసంతా
పారాడుతున్న
ఎర్రితేలు పిల్లలి
పెనువడి:

కన్నులలో
కోర్కెల మందారాలు
కోరగించటం లేదు:

మనోగగనాన
ఆశల హరి విల్లులు
అసలే విరియడంలేదు:

ఆకాంక్షల రిక్కల రెప్పలి
అందమైన
మిలమిలలు లేవక్కడ:

నాకు కావలిసిందీ
నేను కోరుతున్నదీ
నాకే తెలీని స్థితిలో
అంతర్గత చైతన్యం మీద
ఈ నీలి మంటల

చెలగాటమేమిటో
భయం కలిగిస్తున్నది

— నాయని కృష్ణకుమారి

ఇక్కడే మనమంతా....

ఇక్కడే
సామాన్యుడు
మోసపోతున్నాడు
ఎండమావుల్లో నీళ్లు తోడడానికి
విమానంలో పరుగెత్తుతున్నాడు

ఇక్కడే
విరుపేదవాడు
పొరబడుచున్నాడు
ఆకలి మంటల్ని ఆర్పడానికి
అగ్నిమాపకదళాన్ని పిలుస్తున్నాడు

ఇక్కడే
నవయువకుడు
పప్పులో కాలు వేస్తున్నాడు
బ్రహ్మరాక్షసికి పూలమాలలు వేసి
బ్రహ్మాస్త్రం పిచ్చుకపై వదులుతున్నాడు.

ఇక్కడే
విజ్ఞానసంపన్నుడు
విభ్రాంతి తీసుకుంటున్నాడు.

బుద్ధి పైవాడికి తాకట్టు పెట్టి
బురదగుంటలో అభ్యంజనం చేసివచ్చి
పడకగదిలో పగటి కలలు కంటున్నాడు.

ఇక్కడే
గట్టుపై కూర్చున్నవాడు
మేల్కొంటున్నాడు
ఎరను చూపి చేపల
ప్రాణాల్ బలిగొంటున్నాడు.

ఇక్కడే
ఇక్కడే
మనమింతా
జనమంతా

... ...

— పేర్వారం జగన్నాధం

ఉదయ విహారం

మెలుకువ రాగానే
బయలు దేరాను
ప్రాతస్నాయం సంధ్యాబిందువులను
స్పర్శించిన అక్షానికి గీసిన లంబం
పైన వెలుగు-
కింద చీకటి

రెంటికీ నడుమ
కెరటంలాంటి కాలరేఖ
అంతం చూడ్డానికి
రవంత ఆనందం పొందడానికి.....

మిన్నూ మన్నూ
నడుమ తెరచిన నోరు
కోటి నాలుకలాడిస్తూ
వాయువు, సముద్రం
పెద్ద హోరుతో
జీవాల్ని స్వాహా చేస్తున్నాయి
కడలి చెలియలి కట్ట వరకూ
సాగింది దేహ
ఇటు నుండీ అటు నుండీ
నిమ్నోన్నతంగా సాగే
జీవన తరంగాలకు
మృత్యువు కౌగిలి–చెలియలి కట్ట.

వాయు సముద్రంలో
విలిచి
జలధిలోని జీవాలను
గురించి
పంళయ పాదముద్రలా
నిర్మాలిస్తూ ముసలి కెరటాలు
అనుభవానికి ఆద్యాంతాలు.

భానుడుదయించాడు
కానీ నీడలు
పశ్చిమాబ్ధి చుంబిస్తున్నాయి.

తరంగాల స్పర్శతో
చెరుగుతున్నాయి ముద్రలు
తరుగుతోంది నీడ
సాగుతోంది నడక
ఎదురుగా వల
అహంకారం కొయ్యలపై
నీడల తలపై
ఆకాల మృత్యుహేల
ఆరుతూ మరొక వేటకు
సాగర తీరంలో సమాయత్తమౌతోందిః

వలను నుండి జలధిని చూస్తుంటే
మిన్నును తాకే యత్నంలో
మిడిసి పడుతున్న రంగు రంగుల మీనాల్ని
తన్నుకు పోతున్నాయి తీరువులు
తరుగు తున్నాయి పీడలు
తిరుగు దారి పట్టింది నా ఉదయ విహారం
దారిలో కట్టిన వార
పాములు రెండు
మసక లాడుతున్నాయి
కసి మెసగ
ఎగిరెగిరి పడుతున్నాయి
పెన వేసుకుని
నేలను విడిచి నిటారుగాలేచి
పరవశిస్తున్నాయి
పరాకాష్ఠలో ... ...

నాలో వేయి శంఖాలు
ఒక్క సారి పూరించినట్లు

మౌనంగా నాదం ఎగ చిమ్ముతోంది
నా మనసు గాలిలో
రెప రెప లాడుతోంది

వెలుగు కెరటాలు
చీకటి నీడలను
స్వాహా చేస్తున్నట్లు
నా వెనుక సముద్రపుహోరు
విజయధ్వని :

వెలుగు చీకట్ల
అవిరామ సంయోగంలో
అవతరించే నూత్నజగత్తు

కొన
దొరికింది
ముడి
విడింది
నడినెత్తి కి
ఎక్కు తున్నాడు భానుడు
బ్రహ్మరంధ్రంలో
అదృశ్యమౌతోంది నీడ

నా ముందు
మెలికలు తిరుగుతూ
సాగుతున్న బాట
ఒంటరి పాదాల వేట :

— కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

క్షుభితాత్మ

నా కన్నులు చెమ్మగిల్లునమ్మా
నా గుండె ద్రవించి పోవునమ్మా
ఓ కరుణామయి నిను నే
ఆ కరాళ సంధ్యలోన
కాంచినది స్మరించు నపుడు
నా కనులు చెమ్మగిల్లునమ్మా :
నీ చూపులు ఎంత గంభీరమ్మో
నీ హృదయమ్మెంత విశాలమ్మో
నీ భావనలెంత పవిత్రమ్మో
నేను గ్రహించితిని నమ్ముమమ్మా
నా గుండె ద్రవించిపోవునమ్మా

ఒక ఆత్మీయునికై వి
న్నకలంక స్నేహసుమము
అర్పింపగనీయనపుడు
ఆలమటించు విను తలచిన
నా కన్నులు చెమ్మగిల్లునమ్మా

ఒక మానవుని ద్రితుకు చెం
తకు నీదు దయానురాగ
పరిమళావిల పీచికల
ప్రసరింపగ సీయనపుడు
స్రుక్కిన నీ మూర్తి తలచి
నా గుండె ద్రవించు పోవునమ్మా

నీ నిర్మల హృదయ కపోతమ్మా
ఈ నీచ విషాత్మక సంఘమ్మా
నీ విశుద్ధ వాఙ్మధు సారమ్మా
ఈ విక్రగ్రతోనీతి వర్షమ్మా
చూచి బ్రతుకు చితికి పోవు తల్లీ
చుక్కవైనగావు. గగనవల్లీ

వేయి పవిత్ర చిత్రభావములు
వివరించిన నీ ముఖగ్రంథమ్మా
సరిగా తెలిసికొనలేదు నేను
పొరపాటులు కలవరించినాను

బ్రతుకు లోతులలో దూరు
స్మితప్రభామాలిక లటు
మానవతాత్మపై విసము
మసిపూపెడి భూతమ్మటు
విలోకించి కంపించితి తల్లీ
వెర్రినైతి నేను రాగవల్లీ

ఈ వాసంతమ్మా నీ ఉషస్సు నీ
ఈ విద్యుల్లతికల పూర్ణిమలని
నీ హిమాలయోన్నత శీలమ్మును
నీ ఆనందకళా రూపమ్మును
ప్రేమింతును నిండు గుండెతోడను
సామాన్యుడనైన మానవుడను.
ఓ మానవతార్ద్ర కల్పవల్లీ!
నీ మదిలో విలవనిమ్ము తల్లీ !

— జె. బాపురెడ్డి

మధుదీక్ష

ఇక్కడ
నీవులేని
నిండుచీకట్లో,
నేను

ఆశల
శైశిర నిశా శ్వాసల
అగ్ని వలయాల మధ్య
ఒక జ్వలత్ బిందువు వద్ద

చెరగని దివ్యస్మృతులు-
మనః పటలిపై మాయని మధు ముద్రణ
గుండె లోతుల్లో,
నితాంత వేదనా నిధులు.

కళ్ళు విప్పితే
కన్నీటి జలపాతాలు
గగనం పలికితే
వియోగ విషమ గీతాలు

క్షణ క్షణం
అతిశయిస్తున్న ఆశలు
జాగ్రత్సుషుప్తుల సంధ్యలో
సుందర స్వప్నరాశులు.

ఎప్పుడో
వెన్నెల రెక్కలు తొడుక్కొని
నీవు వస్తావని
నా జీవన తమో గీతికకు
కౌముదీ వ్యాఖ్యవై
విలసావని ;

దిక్కుల్లో
విమీలిత దృక్కుల్లో
వినదిస్తున్న
విశ్శబ్ది సంకేతాలు
మౌనగీతాలు
మహా సంకల్పాలు
చీకటిని చీల్చి
వేకువ రేకులగా పరికించేందుకు
వేదనను మార్చి
వేద ఘోషగా మలిచేందుకు.

ఇది మధు దీక్ష
అశ్రు వర్షా సరసిలో
అంతరించిన
అమృత ధారల కోసం;
నిర్ఝర తమో గర్భంలో
నిద్రాణమైన
ఉషశ్శక్తి కోసం ;

— గడియారం శేషఫణిశర్మ

పూల మొక్కలూ - పళ్ల చెట్లూ

జీవితసౌధంచుట్టూ ఏపుగా పెరిగిన తోటలో
ఆ పళ్ల చెట్లూ, ఈ పూలమొక్కలూ
నా బహిరంతర ప్రాణాలు!

౧

వాకిట వెలసిన పూలమొక్కలు
తపస్సమాధిలో ఉన్న ధ్రువకుమారులు.

రంగురంగుల అదాల పరికిణీలతో-
గిరగిరా తిరిగి గభాలున కూర్చున్న
ముగ్ధ మోహన బాలికలు,

చల్లని సంధ్యాసమయంలో-
ప్రేయసీ స్మితవదన సాన్నిధ్యంలో
పురివిప్పి నర్తించు నెమళ్ళు.
నా వాకిటనిలచిన పూలమొక్కలు
అందాల నెంచుకున్న చుక్కలు.

పీటి అందానికి అసూయ చెందిన ఆకాశం
పోటీపడి, ఎలా పరిచిందో లక్షల నక్షత్రాలని!

వెర్రిగాని, అందాన్ని ఒకింత అనుకరించినా
పూలమొక్కల సౌరభం ఎలావస్తుంది శుష్కమైన ఆకాశానికి!

—౨

పుష్టిగా, సమష్టిగా పెరిగిన ఆ పళ్ళచెట్లు-
సమగ్ర జీవన శక్తికి ప్రతినిధులు:

మేఘాలతో మంతనాలాడుతూ,
దూరదూర పవనాలను చేర పిలుస్తూ,
పాతాళగంగను పగ్గాలు వేసి లాగుతూ,-
ఎంతటి బాధ్యతను వహిస్తున్నాయి:
ఎంతటి రాజనీతిని ప్రదర్శిస్తున్నాయి!
ప్రచండ ప్రభాకరుణ్ణే సవాలుచేసి-
విజయపతాకలను స్థాపించినట్లు
చల్లని నీడల్ని సంతరించుకుంటాయి పళ్ళచెట్లు

చెట్లపై అలిగి, కోపంతో వేడెక్కిన సూర్యుడు
తానే ఎగ్గని పండుగా మారుదామని,
ఉభయసంధ్యల్లోనూ తాపత్రయపడే శూరుడు:

ఎరుపై తే ఎరువు తెచ్చుకోగలదు. కాని—
రహస్య రస మాధుర్యాలను ఎలా సాధించగలడు:

౩

కళాస్వరూపునికీ నాకూ మధ్య
వంతెనలు నిర్మించే ఈ పూల మొక్కలు
ఆత్మ జ్ఞానాన్ని గానం చేసే మహాకవులు.
కాని భౌతికవాదశాస్త్రజ్ఞులు, రాజనీతిజ్ఞులూ
గొంతెత్తి వోటి కుండల్లా మోగుతునేఉన్నారు.

"నిరుపయోగమైన పూలమొక్కలు
నీ బ్రతుకు కేడుగడ కాదు.

ఈ వెర్రిమొక్కలూ, పిచ్చి పువ్వులూ
మానవాభివృద్ధి నిరోధకాలు
పీటిని సమూలం పీకిపారేయి
పలుసీమల పళ్ళచెట్లే నీ తోటలో పెరగాలి;
బహుజనం ఈ సౌధంలో హాయిగ విహరించాలి॥

సాక్షాత్ శక్తిస్వరూపిణులు ఆ వళ్ళచెట్లు
కర్మయోగ క్షీరాన్ని పంచే వీరమాతలు.
పృథ్వీలో నా బాటకు వెలుగులద్దే జ్యోతులు
కాని యుగయుగాల తత్వవేత్తలూ ప్రవక్తలూ
ఒక్కటే గళమెత్తేరు:

"బలసిన కామంలా ఎగబ్రాకే ఆ పళ్ళచెట్ల నీడల్లో
కృంగి కృశిస్తున్నాయి పూలమొక్కలు.
చీకట్లను చేర్చే రాకాసి చెట్లను
నీ వాకిట్లో పెరగనీయకు.

వెన్నెలల్ని విరజిమ్మి సౌధానికి వన్నెతెచ్చే
ఈ పూలమొక్కలను రక్షించుకో;
ఆంతరిక స్వస్వరూప జ్ఞానాన్ని వీక్షించుకో॥"

౪

భిన్న విభిన్న తీరాల మధ్య
ఎండిపోతున్నది ఆలోచనాస్రవంతి.
ఈ రెండు కవాటాల ఘర్షణలోపడి
నలిగిపోతున్నాయి చూపుడువేలు నరాలు.
ఈ పెనుబొబ్బల ఉరుముల తాకిడికి
పునాదులు కంపిస్తున్నాయి జీవితసౌధానికి.

ఈష్ట భౌతికవాదం
కడుపుకు కావలసిందే సర్వ సమగ్రమనుకుంటోంది.
కన్నులనలరించేదే సర్వస్వమనుకుంటోంది
ఆధ్యాత్మిక శూన్యవాదం—
ఫలాలు అన్నమయకోశానికైతే
పూవులు మనోమయకోశానికి దారులు.

ఆధ్యాత్మిక భౌతికశక్తులు రెండూ
తాండవించాలి నా సౌధప్రాంగణంలో—
ఈ పూలమొక్కలూ, ఆ పళ్ళచెట్లూ
హాయిగా మెరవాలి; ఏపుగా పెరగాలి.
నా తోటను నందనవనం చేయాలి
అవును; నా బహిరంతర ప్రాణాలు
సమగ్ర సమాజ సౌధానికి పచ్చతోరణాలు.

— గొర్తి శంకర భాను

విష్ణు చక్షువులు

ఒక యషీ గవాక్షము విచ్చిచూడగా
మొక మెత్తను పద్మిని కేశకూళిలో
ఒక చక్షువు పక్ష్మము విచ్చి చూడగా
ముకుళించిన కైరవ మాళతో నగున్

కటిక నిద్దురలోన కన్నులు
మూయు ప్రాణములందు కదలిక
ఏతమెత్తగ వేడి వెలుగుల
విచ్చు చక్షువు ఒకానొక్కటి ;

వెలుతురులు వేరొక్క లోకము
వెడలిపోగా చీకటులలో
వట్టిచూపుల లేత వెన్నెల
వింపు చఱువు ఒకానొక్కటి:

విష్ణు ఫాలమునందు నవ్వుల
విత్తులకు వెలుతురులు విసపగ
వేడ్క-పడు బంగారు చెలమగ
వెలయు చఱువులవే రెండును:

ఋతువులను రైతుల భుజాలను
పవలురేలను కావడుల మో
యించి విశ్వక్షేత్రమును తడి
పించు చఱువులవే రెండును:

విష్ణుచఱువు లమరతరువుల
విరుల క్రొందేనియల పొదుగులు
విష్ణుచఱువు లమర సమ్మోద్
విపుల వజ్రపు చికిలి చిదురులు:

విష్ణుచఱువు లెల్లరంగుల
వెలుగులల్లిన మణుల గుత్తులు:
విష్ణుచఱువు లంబరాంబుధి
వెడల తరచిన వెన్నముద్దలు:

ఆదియె భూతలమదియె సాగర
మదియె పర్వత మదియె శిఖరము
కవుల వర్ణన చేతనుంబలె
నవియె క్రొత్తలు మఱల మున్నటి
వెల్లి రవి శశి రుచులు సోకగ
విష్ణుచఱువు లరసి తాకగ:

హారులు విష్ణుచక్షు రుభయాంతర తారతతద్యుతల్ మనో
హార విహారులై భవన మందున నిండిన రోగజాఢ్య నీ
హారము సంహరించునవియై యమృతాతప లాస్యతాండవా
కారత దివ్యవైభవ వికాస విశాదివముల్ రచించుతన్.

రాజిత చంద్రమః కిరణ రమ్యతుషార సుధా కృపామహః
భ్రాజిత చక్షువొక్కతటి వార్ధిల్చి. పవిత్ర రవిప్రభాత తే
జోజగదేక చక్షువున సుప్తి తమశ్చటఁజీల్చి విష్ణువున్
పూజలుసేయు మానవుల భూమికి కల్గుత సర్వ సౌఖ్యముల్.

ఆయతనీల పక్ష్ముల నల్లన వార్ధిల్చిన సంధ్యలందు- మా
యామయపాళ కర్కశము లై భ్రమ లుప్పతిలన్ తమోవయా
ధ్యాయము సాలెగూడువలె దారికి నడ్డముగాగ, తజ్జిఘాం
సాయుధముల్ రవీందుల మహమ్ముల హంతల రూపుమాపుతన్.

పీచిన గంధవాహమున వెన్నెల చూపులు గుండెలన్ సుధా
సేచన మాచరింప-రతి శీర్ష కిరీటమునందు పువ్వులై
పూచెడి మల్లె మొగ్గలు గుబుల్కొన-మన్మథుడేగు యాత్ర ను
ట్టూచెడి చంద్ర చక్షువున కూహలు పూజలు సేయుగావుతన్.

దీపితరోదసీ మదవతీ మృదులచేల కృతావగుంఠన
శ్రీ పరమైన జ్యోత్స్నల రచించుచు-కావ్యసుధా విపంచికా
ప్రాపిత భారతీసతికి ప్రాభవమిచ్చు సుధాకరాక్షి శో
భా పరిపూర్తి నొందెడు విభావరులిచ్చుత సౌఖ్యచంద్రికల్.

ఆరని ఆతపమ్ము- జనుషాంధుని చక్షువువంటి మౌఢ్య సం
సారము వెజ్జు-పుణ్యజల సారణిరేఖల ప్రావృషేణ్యమా
కారథి- సారథీ కృత నిషాది వసాంగ విహంగి- విష్ణు చ
క్రూరచితమ్ము వెల్తురుపగూహన మిచ్చుత మా యెడందకున్.

ఇషరసాలు నేత్రముల కీశ్వరకంఠ విషాగ్ని నార్పగా
దపులు తారకా రథపతాకలు కావ్యకళా బుభుక్షకున్
భిక్షలు నూత్న దంపతుల ప్రేమ సువర్గము తావులిందురే
ఘాషీ స్మితమ్ము లీ యెడద యంచుల మీగడ జిడ్డుకట్టుతన్.

దోష పిపీలికావృతము దుఃఖ విభావసరీసృపాంతరు
ద్భోషమునైన పుట్టపయి గొడ్డటి పెట్టగు జ్ఞానహేళి ప్ర
త్యూషమునందు లోకమున తూర్పగునేది తదీయ చక్షులరు
త్పేషిత తీవ్రపీక్ష చెలరేగు నిరాశల ధిక్కరించుతన్;

ఎన్ని యాగామి సారణులింకు నీ కలాపగ
ఎన్ని వర్తమానాపగ లితిహాసవార్ధి నిండు
వెన్నుని కసీనికల్ క్రొత్త వెల్గుల మానికలు
అన్నినాళ్లు ప్రత్యగ్రములై వెలుంగును గాక

— మిరియాల రామకృష్ణ

సూర్యుడెన్ని మారులొస్తేనేం!

ఎన్నడూ లేనిది
ఎంతో ముందుగా లేచి
సూర్యునికోసం ఎదురు చూశా నీ రోజు

సూర్యోదయంతో నా చిక్కులన్నీ
మంచులా విడిపోతాయని కాదు
సూర్యుని గురించి నిజమేదో
స్ఫురించిందీ రోజు నాకు

ఎంత జీవశక్తికి కారకుడతడు
రోజు రోజుకీ అతడెంత నవ్యుడు!

మరి సూర్యునికి గతం లేదా?
ఒక వేళవుంటే అది
అతనికి భావికి ఆడొస్తుందా!
భావి గతానికి శత్రువా?

ఏమైనా ఒకటి నిజం
సూర్యుని కన్నా సత్యం లేదు
అతని కన్నా నవ్యుడు లేడు
నాలో సత్యాని కీరోజు స్థానం లేదు
అందుకే సూర్యుడు నాలోకి రాడు

నాలో ప్రకాశించడు
నా అజ్ఞానాన్ని కాల్చడు
నాలో పేర్చుకున్న చీకటిని చీల్చడు
ఎన్ని అమావాస్యలు నాలో
కరుడు గట్టుక పోయాయి

ఎన్ని ఆశల జలపాతాలు
దూకి తమ శక్తిని కోల్పోయాయి!
ఎన్ని వానచినుకులీ ఇసుక నేలలో
ఇంకి పోయాయి!

ఇంగితం లేని నాలాంటి మనిషి బ్రతుకులో
ఇంద్రధనుస్సు లెన్ని విరిసి మాయమైనాయి
నాలో ఏదీ ఎందుకు నిలువదు?
నన్ను నేనెందుకు గెలవలేకున్నాను?

ఎప్పటి కప్పుడు కొత్తగా ప్రయాణ సన్నాహం
తప్పటడుగు వేసి నాల్కుకరుచుకునే వైవం

నేను సూర్యుని చూచి ఏమైనా నేర్చుకున్నానా?
నేను నిజంగా కాంతిని కోరుతున్నానా?
చిత్త శుద్ధితో చైతన్యమే వాంఛిస్తున్నానా?
చైతన్యం పేరుతో అరాజకాన్ని సృష్టిస్తున్నానా?

ఎక్కడ బడితే అక్కడ ప్రశ్నలు?
ఎక్కడి కక్కడ ఏదో అసంతృప్తి
ఆగ్రహం అభూయిత్యం అలజడి
ఫలితం అనుచితం?
పరిణామం అమానుషం?

అహంతో మనిషి మొహం మెరుస్తుంది
నకిలీ సరుకు తళతళ మంటుంది
అసలు విలువ వెలవెల బోతుంది.

౩

ఎందుకు బ్రతుకుతున్నానో మరచి
ఏమిటి మాట్లాడుతున్నానో మరచి
నా మూర్ఖత్వాన్ని నాలుగు పక్కలా పరచి
ఎదో దొరికిందనీ మూటగట్టి

ఇంటికి వెళ్ళి చూచుకుంటే ఏముంది?
మూట ఖాళీగానే వుంది
నా మూర్ఖత్వం నా దగ్గరే వుంది

స్వార్థం ఒక మూల్లో దాక్కుని
విన్నుపీడని చిరనేస్తాన్ని నేను
అవి పగలబడి నవ్వింది.

స్వర్గం నాకు కొన్ని కోట్ల మైళ్ళ
దూరం జరిగి నట్టనిపించింది
ఎందుకు బ్రతుకులో ఈ ఖాళీ

శూన్యాకాశంలాగ
నెల చివరి రోజుల్లో
ఉద్యోగి పర్సులాగ
ధనికుని దయాగుణం లాగ
వ్యాపారి నిజాయితీలాగ
పతిత ప్రేమలాగ

ఎందుకీ ఖాళీ ?
దీన్ని దేంతో నింపాలి ?
దేనికైనా విలువంటూ వుందా ?
అసలు విలువకే విలువుందా ?

పోనీ అనుకుంటే
గుండెనిండా ఈ గుబులెందుకు ?
విడిలించుకోవి ఈ వెలితి ఎందుకు ?

నా యింటిని చూచి నాకే అసహ్యం
నా కంటిని నేనే పొడుచుకునే ప్రయత్నం
నా జీవితం అలక్ష్యానికి బలై పోతూందా
నా ప్రతిబింబం నానాటికి వెలవెల బోతూందా
ఏం చెయ్యాలో చెప్పేదెవరు ?

అందరూ ప్రశ్నలే వేస్తున్నా :
కఠిన పరీక్ష పత్రమయింది జీవితం

ఎంతలో ఎంత దారుణంగా మారిపోయింది
గాజుగ్లాస్‌లాంటి జీవితంపై ఈ రాళ్ళవర్షమేమిటీ:
గంభీరమైనచూపులో ఈవక్రత ఎలాజొరబడింది:
గానుగెద్దు వలయం నన్నెందుకు కట్టిపడేసింది:

౪

వస్తాచనుకున్న సూర్యుడు
రానూ వచ్చాడు. వెళ్ళనూ వెళ్ళాడు

అతడు నిస్వార్థుడే
అతడు కురిపించిన కాంతిలో
కనీసం ఒక్క కిరణమైనా
నాలోకి ప్రవేశించ లేదే
నాలో చీకటిని తరిమి వేయలేదే
అంతశక్తివంతుడైన సూర్యుడు నైతం
మనిషి విషయంలో నిస్సహాయుడా :

అవునేమో :
మనిషి చీకటిని ప్రేమిస్తున్నంత కాలం
కల్లోలాన్ని చైతన్యంగా భ్రమిస్తున్నంతకాలం
సూర్యుడు నిస్సహాయుడే నేమో :
మనిషిలో సత్యం నిలువలేదేమో :

మరి ఎన్నిమార్లు సూర్యుడు
వచ్చివెళ్ళితే మాత్రమేమి :

మనిషి నిజంగా కాంతిని కోరనపుడు
విష్కల్మషమైన ఆలోచనా పరిధిలోకి చేరనపుడు
మార్క్స్ డెన్నిమార్లొస్తేనేం ?

— పరిగి రాధాకృష్ణ

కాలు సేయి కడప దాటదు ?

వొడగండ్ల వానలొస్తే ఏమి బలము — నేతి
కొచ్చె పంటలెల్ల మాయెజేసి పాయె

ఏటు పోటుతోని నెత్రమడుగుజేసి— రాజ్య
మెత్తుకోని దింపవోతె ఏమి ఫలము

అదునుకొద్ది పదును అయితె అపుడు సూడు-రాసు
లంతలేసి పెరిగి పెరిగి కళ్ల మాడు

పుట్టవోయె పిల్ల కెదురు చూడకుంట— తల్లి
పొట్టకోసి తీయవోతె సచ్చెనంట

కాళ్ళ సందులేసి వొత్తివొత్తి పిసికి సూస్తె—కచ్చి
కాయెలెట్లు మాగి పండుకొచ్చునోయి.

కన్న తల్లికింత సేవ సేయనోడు — నన్ను
కన్నదెందుకాని కొడితె కొడుకుగాడు

మాటజూస్తె కోటపేట లెగిరిపోవు— వాని
కాలుసేయి కడపదాటి కదుల లేవు.

— యెల్లంద రఘుమారెడ్డి

కపివ్యథ

ఆంధతమఃపరీత కుహరాంతరగుప నిషిద మారమం
చంధు లచేవ్య తత్త్వముల నారయనెప్పుడు నిర్గమింతు రి
ప్పాంథుల నెప్పుడెవ్వ డురుపంకమునంబడి చచ్చు; నీ గురు
గ్రంథము విప్పిచెప్పు మొనగాడెవడీ భువనమ్ములన్ ప్రభూ:

తీరము గానుపించని నదిన్ బడవైచితి జీవనావ గం
భీర జలప్రవాహమున భిన్నముగాక మరేమియౌను; నీ
వేరికి సాయమైతివి; వ్యయించెదలే ఎటులైన నేమి నే
నేరికి పట్టలేనని గ్రహించితిలే మునుపెప్పుడో ప్రభూ:

గ్రుడ్డిపొగడ్తలందిడి గగుర్పొడిచెన్ సనసన్న వెండ్రుకల్
వెడ్డిగ గొన్ననాళ్లు; మనవెట్టి తనమ్మది పొంగి పొంగి ఏ
గడ్డకొ పేరుకొన్న నురుగై కనుపించిన నాటి నుండి ని
న్నడ్డము బెట్టి జారుదునయా ! భగవత్కృప యంచునో ప్రభూ:

కనులను మూసి నీ కనులగాంచుదు, వీనుల మూసికొన్నచో
వినియెద నీదు వాక్యము, వివేకము మూసిన నిన్నెజూతు ఈ
మనసును మూసి నీ మనసు మర్మము జూతును కాని యెట్టులీ
గుణముల మూసికొందు, కనుగొందును నిర్గుణు నిన్ను నో ప్రభూ:

నాదగు వేదనా హృదయ నాదమునీ చెవికింపు గానిచో
రాదగు నాలసింపక పరాకును జేయుట పాడిగాదు నీ
వే దయచేయగావలయు ఈ స్వరభంగుని కేమినేర్పి న
మ్మోదము గూర్చికొందొ నను మూకను జేసిన శాస్తికో ప్రభూ:

కన్నులన్నందుకు వెల్గబెట్టినదియున్ కన్పించదోయన్న ! లే
పనుకున్నన్ మటి కొంపమున్గినది లేదన్నా ! జగత్తొక్కరీ
తిని సంసారము జేయనేర్చినది విస్తీర్ణించు మర్యాద నే
ర్చిన దీవున్నను లేకపోయినను నీ చిక్కంత నాకే ప్రభూ!

సాపేక్షన్ జపియించి కాంచితిని సంసారమ్మిలో స్వర్గమా
క్షేపించందగు నింద్రభోగముల నిస్పృ। మోము కొల్చెన్ నిర
స్తాపేక్షం దపియించు నిప్పుడు సమస్తానంద కేంద్రమ్ముగా
దీపించం దగునంచు చిద్గగన చాంద్రీ మాతృమూర్తీ శివా!

— అనుముల కృష్ణమూర్తి

బుక్కపథము

కొత్తదారి ప్రక్కనిలిచి క్రొత్తయాస చిగుర్చి
అకాశాన్నధిగమించు విచ్చెన సృష్టించు
ఋభోదర్శమైన నేటి సూర్యరశ్మి నిలచి
చీకటి చీకాకులన్ని ఒక్కటిగా రాల్చి!

నీ జీవిత పరమావధి చేయిజారి పోయినదా!
ఇదిగో చేయూత గొనుము గమ్యము కై నేయుము
బ్రతుకు పండెమందు ఓడి నేల గూలిపోయితివా
నేడే, యీనాడె తిరిగ భవితవ్యము నొడ్డుము.

ఈ విశాల వసుంధరను సుఖముల గని కలదు
ఈ ప్రమోద మేదినిపై బ్రతుకు పంట కలదు
సమ్మతిపై వాగ్రిసియిచ్చే సమత ఒక్క విల్లు
జనులెల్లరు సమానముగా అనుభవింపచెల్లు.

కొండవంటి అధికారము క్రింద నలగబోకు
బండలాంటి బ్రతుకు సీద్వలేక ఏడ్వబోకు
స్వాతంత్ర్యము సీకు నాకు సంక్రమించు హక్కు!
నినదించుము దశదిశలా ఇదే నరుని ఙుక్కు.

— శశాంక

సోహం

శిశిరవసంతం-వసంతశిశిరం
కాక మరేమిటి జీవితం?

శిశిరం వసంతానికి ఆహ్వానం
వసంతం శిశిర శీర్షాభిషేకానికి యత్నం
కాక మరేమిటి సృష్టి సర్వస్వం ?

భూమ్మీద పడడం మొదలా
నాంచారమ్మ కత్తి బొడ్డు మీద నడుచు
అమ్మ ఒడిలో కులికి నప్పుడు
ఉయలలా ఆలోచనలా కదిలేటప్పుడు
ఎన్ని వసంత ఊహా గానాలు?
కాక మరేమిటి జీవితం ?

బడిలో పుస్తకం తెరిచి నప్పుడు
మడిలో విత్తనం చల్లి నప్పుడు
ఎన్నికూల లేదు ఆశాసౌధాలు !
చుక్కల్లా ఆశలు దూరమై

చక్కగా అందక మెరుస్తున్నప్పుడు
ఎన్ని శిశిరాలు నడిచి పోలేదుఁ
కాక మరేమిటి జీవితం ?

బాల్యం బంగారం గని
యౌవ్వనం పొంగే ఝరి
వార్ధక్యం ముసిరే నిశి
కాక మరేమిటి జీవితం ?

జీవితం పట్టకంలో నుండి
మనస్సు వికాస ప్రకాశం దూస్తే
పరిణామం కోరికల ఇంద్ర ధనస్సు
కామ క్రోధాల అరుణ వర్ణం
మద మాత్సర్యాల వర్ణార్ణవం
అదే జీవిత ఇంద్ర కార్ముకం ?

కాని .....ఎన్ని సీటి బిందువులు
అవుతున్నాయి ఇంద్ర ధనువులు
ఎన్ని జీవితాలు కాకుండా రాలడం లేదు
ఆనంద వర్ణ సింధువులు ?

అసలు ఆనందం క్షణికం-అల్పం
అనుభూతి శాశ్వతం-అనంతం
కాక మరేమిటి జీవితం ?

సామాన్యుడి ప్రాతఃకాలం సమస్యల ముడి
సాయంత్రం రేపు ప్రశ్నల జడి-
సమస్యల సమరం జీవితం
కవిత్వం అంటే-

అంతే కాదు–తీరనిదాహం కవిత్వం
అంతేకా జీవితం ? కాక మరేమిటి ?

తీరందను కొకే భ్రాంతియే కాని
తీరే ఆశ–తీరిన తృప్తి లేవు
తృప్తి లేని మనస్సు చావదు–

అసంతృప్త జీవన రంగంపై
ప్రతికు ఒక వేస్ట్ ఆర్టిస్ట్!
దీర్ఘ కాల మృత్యు విద్రా పటలంపై
జీవితం అల్ప కాల స్వల్ప స్వప్నం !
కాక మరేమిటి జీవితం ?

చావు లేని మనస్సుకు నూతన జీవితం మృత్యువు
మళ్ళీ ఆకాశంలో నీటి బిందువులా
సూర్య కిరణ కరస్పర్శాసక్తులా

మళ్ళీ మృత్యు విద్రావనిక మీద
కోటానుకోట్ల జీవిత స్వప్నాలు
ఆత్మ సాక్షాత్కారాభిలాషలు

కాలం ఫలిస్తే–తపన ఫలిస్తే
ప్రతి బిందువు ఇంద్ర ధనువే
ప్రతి తనువు ధన్య మనువే !

కాని.....సామాన్యం బిందువు
జీవితం సామాన్యాల సింధువు
ఐనా ప్రయత్నం ధర్మం
జీవితం ప్రయత్నశీలం

ప్రయత్నశీలి విన్యాసం సృష్టంతా

ఆసంపూర్ణ చిత్రాన్ని పూరించడమే
ఈ ప్రయత్నమంతా :

వ్యష్టిలో నుండి సమష్టిలోనికి
'స్వం'లో నుండి 'సోహం' లోనికి
పరిణమించడం జీవితం
కాక మరేమిటి దీనికరం :

— పురాణ పండరంగనాథ్

చీమ లేమ

ఓ చీమ వెలది మిన్నా
నీ చరితంబద్భుతంబు వినుఁ దొగడగ వ్యాక్
కోచమయి అలరు నా వా
గ్వైచిత్రి వినూత్న భావబంధురమగుచుఁ :

పర్ణ శాలలందు, భవనాంగణములందు
బాటలందు, పూలతోటలందు
మెట్టపొలములందు, చెట్టుతొరటలందు
మెలగు విన్నుజూచి మెచ్చుకుందు.

చింతలు వంతలు లేక ప్ర
శాంతముగా జీవనము సాగించెదు నీ
సంతృప్తి సుఖము లే శ్రీ
మంతునకును గలవొ చెప్పుమా చీమ చెలీ :

మృణ్మయమ్మలైన మేడలు నిర్మించి
పరులకప్పగించి బాధపడవి

సీదు త్యాగశీల మాదర్శమౌగాక
జ్ఞానవంతులైన మానవులకు.

చిగురువంటి లేత జీవితమ్మున తీయ
దనమె సంతరించుకొనెడు సతము
వగరు చేదు తీపి షగ మేళవించిన
నరుల బ్రతుకుకన్న నయము సీది.

పసపూతబట్టిన పెసరు మొక్కల క్రింద
కులము వారలతోడ కొలువు దీర్చి
చిలువెల్ల మాధుర్య మొలుకు చెరుకుమ్మ
ఇంటిల్లి పాదితో ఇరవువెట్టి
చిట్టాదికాయని చిటిలిగింజలు రాల్చి
నువు చేనిలోన పండుగలొనర్చి
మునుముట్ట కుప్పనూర్చిన వరి కళ్ళాన
పేర్మి బందుగులతో విందుగుడిచి
కణకణమ్ముగూర్చుకొని దొంతరలు పేర్చి
కలతలేని చిన్ని కాపురమును
దిద్దుకొనుచు మదిని దిగులుమాని చరించు
చీమరాణి! నీకు నేమమగుత.

— వేమగంటి నరసింహాచార్యులు

నా సంచి

నా పూర్వసంచితాలు ఒకటొక్కటీ
మోయనంత బరువై నవి
అవియే నాసంచికి రూపురేఖలై నవి.

బస్సులలో బండ్లలో ఎక్కడ చూచినా అక్కడ
నాకంటె ముందు నా సంచి యుండు
నా సంచి చూచి నన్ను గుర్తింతురు.
ఎన్నో తిరునాళల ఎన్నో యాత్రల
చూచినారు లోకులు
నా జన్మాంతర జన్మల నా గమనాగమన వేళలి
నా సంచియుంట నాచేతుల
సామానుకొంత మారెనేమొ
సంచి మాత్రమదియే యనిరి

పోలికలవియే గుర్తులనవియే
చిరునామ కొంత యస్పష్టము
పెరవారల చేరి మరల నా యింటికె వచ్చుచుండు
ఎవరో బె రాగది, ఎవరో ఒక భోగిది
కాదెవరో ఒక సంసారిది
ఔను కాదు కాదౌనని త్రిప్పి త్రిప్పి మరలమరల
నా చేతికి తగిలించు చుంద్రు
ఎన్నోమారుల ఎన్నో బస్సుల
మారుపడ్డ దీ సంచియు.

నా నవ్వును పోల్చక కొందరు
నా వేదన పోల్చక కొందరు
నా సంచిని గుర్తించు చుంద్రు

నా ఆనందము నా విరక్తి
నా ఆహార విద్ర భయచాపల్యాదులు పోల్చిపోల్చి
వా సంచి తెచ్చి నా కిత్తురు.

— దుర్గానంద్

వ్రత దీక్ష

నేను
అగ్నివ్రత దీక్షాపరుడనై యజ్ఞ జ్వాలనై
నిరంతరమూ జ్వలిస్తూ
జగత్తున వెలుగులు నింపుతాను
ఆహుతినై ధ్యేయపథాన్ని సుగమం చేస్తాను.

* *

నేను
మృత్యు దేవతా పూజారినై అగ్ని పథగామినై
నా శిరస్సును హవిస్సుగా అర్పిస్తాను

హాలాహలాన్ని మ్రింగి అమృతాన్ని పంచుతాను
నవ్వుతూ మరణిస్తాను మరణిస్తూ జీవిస్తాను
ప్రపంచానికి బలిదానమనే పాఠాన్ని నేర్పుతాను
నా ఆచర్మాల భవ్యహర్మ్య నిర్మాణంలో

పూలహారాలు తాకవి జయజయకారాలు సోకవి
ఆధార శిలనై
అట్ట అడుగున నిలుస్తాను

* *

నేను
అసిధారావ్రతపారీణుడనై
ఉగ్రవీరవ్రతధారినై
తుపానుల కెదురు నిలుస్తాను
పర్వతాలను ఢీకొంటాను
ప్రళయ ఝంఝలను శాసిస్తాను.

* *

శీతతపాలు హిమపాతాలు అశని పాతాలు
జలప్రళయాలు భూకంపాలు
ఏవీ నన్నడ్డలేవు
వికటాట్టహాసాలు వికృత పరిహాసాలు
తర్జనలు భర్జనలు గర్జనలు
రోషకషాయ నేత్రాలు రోదనలు
ఏవీ నన్నాపలేవు నన్ను బంధింపలేవు
ఆకలి దప్పులు నన్ను బాధింపలేవు
కష్టాలు నన్ను కదిలింపలేవు
ఇంద్రియ సుఖాలు స్వప్నాలు నా దరికి చేరవ్
అన్నిటినీ అధిగమిస్తాను
అప్రతిహతంగా సాగిపోతాను

* *

నేను
అపరాజేయుడనై విజయ శీలినై
అహర్నిశమూ ముందుకేగుతుంటాను

నా అగ్నిపథంలో క్షణమాత్ర విరామాన్ని సహింపను
ఏ శీతలచ్ఛాయిల ఆహ్వానాన్ని మన్నింపను
అలసిపోను ఆలసింపను ఆగను వెనుకకు తిరుగను

* *

కర్మత జీవన జాగృత సాకార ప్రతిమను నేను
శంకరుని సాక్షాత్ ప్రతినిధిని నేను
జ్ఞానపీయూష ధారల యోగసాధనా చాతురుల
ప్రేమ సుధా మాధురుల సమన్వయ ప్రవంతిని నేను

* *

నా నరనరంలో ప్రవహించేవి అస్రుగ్ధారలు కావు
బడబాగ్ని జ్వాలలు
నా హృదయం కుసుమ కోమలి కాదు
అధర్మాన్ని సహింపని కరాళకాళిక
నావి హిమవన్నగ సదృశ సంకల్పాలు
వజ్ర కఠోర నిశ్చయాలు ఉక్కు నరాలు
నా భావాలు మరుగుతున్న లావాలు
నా వాక్కులు ఓజస్సునాలు
నా పనులు పవిత్ర జాహ్నవీ జలాలు.

పరశురామ నృసింహ వీరభద్ర హనుమలు
ఆదర్శాలు నాకు
రామ శివ గోవింద బుద్ధులు
దృష్టాంతాలు నాకు

— దోనెపూడి వెంకయ్య

నై వే ద్య ము

అంచిత భక్తితోడ జనులందరు పువ్వులు పండ్లనుగా సమ
ర్పించుచు నుండ నేనొకటి రెండు ఫలంబులు వారగింపు నే
యించక చెంత నుండి భజియించెదు నప్పుడు స్వామిచూపు నా
పంచియలోని పండ్లపయి బడ్డది చప్పున మాటువెట్టితిన్.

తేకువతోడ నేడు గొనితెచ్చిన పండ్లివి నీ కొసంగి నా
రాకకు వేచి వాకిట నిలంబడి చూచుచు "ఏవి పండ్లు నా
న్నా! కొనిరావు నీ వెపుడు నా" కను బిడ్డలకేను నిర్దయా
భీకరమూర్తివోలె గనిపించగలేను ప్రభూ! నిమేషమున్.

ఎవరో స్వామికి పూజ చేయించుచుండ
వెస గుబాళించె నా మూట వెలయు పండ్లు;
పండ్లవాసన లెట్లు నాపంగ వచ్చు?
స్వామి కసుదమ్ములెట్లు కప్పంగ వచ్చు?

అంత నర్చకుండు యవనిక దిగజార్చి
స్వామి కారగింపు సలుపుచుండ
నన్ను పరిహసించె నా జిల్గు వలిపంపు
పంచలోని పండ్లు పయికి దేలి

గుడి గంటల్ వినిపింప నీ కడకు రాకుండంగ పోలేను-నా
కడనున్నట్టివి నీ కొసంగక చనంగాలేను-ఏదేని నీ
కిడు చున్నప్పుడు నాదు బీదతనమో ఏదో ననున్ లుబ్ధునిన్
కడు దుర్బుద్ధుని జేసి కొంత తడవాకట్టున్ గదే చేతులన్,

ఆదరమొప్పనే నొసగు నట్టి ఫలంబిది శూన్యమందునన్
గాదని, నీకు నర్పణ మొనర్చిన దించుకయేని వ్యర్థమై
పోదని దానినిం దిరిగి పొందెదనంచని నమ్మియుండియున్
లేదనకుండ నే నొసగలేను గదా దురదృష్టవంతుడన్.

పద్యమందు దగిన పదము వేయకయున్న
కవికి గలుగునట్టి కష్టమెంతొ!
దైవమునకు నీయదగినది యీకున్న
భక్తు డొందునట్టి బాధయంత!

అకృతాత్ములో సుకృతాత్ములో తెలియరా కజ్ఞాతమైయున్న యా
పిక లోకమ్మున కీ వొసంగెడి శుభాశీర్వాద వారమ్ములో
నొక యంశంబును మాకు జెందునటులన్ యోజించి మావంటి లు
బ్ధకులం గూడ సముద్ధరింపుము ప్రభూ! దాక్షిణ్య భావమ్మునన్.

— ఉత్పల సత్యనారాయణాచార్య

అందమైన అంతరంగం

అందమనగా ఎర్రతోలని
చెందవలదు మిడిసిపాటు.

ఎర్రతోలే అందమనుకుంటే
ఎర్రగన్నేరు పుష్పరాజంకా లేదెందుకు?
ఎరుపే అందానికి గురుతయితే
ఎర్రని యెండను ఏవగించుకుంటా రెందుకు?

అందమైన బాహ్యరూపం
ప్రళయానికి హేతువవుతుంది ఒకప్పుడు
అందమైన అంతరంగం
ప్రణయానికి సేతువవుతుంది ఎప్పుడూ.

నల్లని కోయిల గళము విప్పితే
పల్లవిస్తుంది ఉల్లము
ముళ్ల గులాబి మొక్క ప్రసవిస్తే
కళ్లకు విందు కలుగుతుంది.

నల్లని వాన కరుణిస్తే ఎల్లలోకం
పుల్ల వికసిత కుసుమ మవుతుంది.

ఎర్రని యెండ వేడికి
గుండె పగిలిన నేలతల్లి
నల్లని మబ్బు నీడకు
కాలసేతువా కూడదీసుకుంటుంది.

మందార మకరందం వంటి మనస్సు
అందానికి నిలయం.
పారిజాత ప్రసూనం వంటి మాట
అందానికి నెలవు.
అందరు మెచ్చుకునే మంచినడత
అందానికి ఆచార్యపీఠం.

నల్లనయ్య వినిపించిన వంశీనాదానికి
అలనాటి రసికలోకం పరవశించిందట;
నల్లనయ్య వినిపిస్తున్న గీతా మాధుర్యానికి
ఈ నాటి సభ్యలోకం పరవశిస్తున్నది.

నడుపు తెప్పలలోన లేదు అందం
తలపు తీరులోనే ఉంది అందం.

— చల్లా రాధాకృష్ణశర్మ

అహార్మ ఖివ్

రేయి రక్కసి ప్రళయ దంష్ట్రికలలోన
జిక్కి యేకాకియై బిక్కు బిక్కుమనుచు
ముసలి జాబిల్లి కడకు సొమ్మసిలి తూలి
కూలుచున్నాడు పడమటి కొండ కొనల.

అది విర్ణిత విరంతరాయ సుఖ సుప్తావస్థయుం గాదు-జా
గ్రదవస్థాస్మృతిగాదు- మాధ్యమిక పాత్రంబైంద్ర జాలక్రియో
న్మద లీలావిలసత్కరాళ జగదంబా హస్తముద్రాంగుళీ
కదమాయాచ్ఛవి పేదవాని కెద వెన్కంగ్రుచ్చు బల్లెంబుగన్.

వెలుగు బిడ్డల రక్షకై వేగుతల్లి
హరిహరబ్రహ్మమునకు ప్రీత్యర్థమిడిన
విమల నీరాజనోపచారముల తోడి
కొనయుసురుగాగ నిల్చిన గ్రుడ్డిప్రమిదె

ఎక్కడో గుడ్డ ఊయలలోని పసికూన
కెవ్వంచు నేడ్పు లంకించుకొనియె
ఎక్కడో తొరిపోయిన తాత 'రామ రా
మా' యంచు స్మరణమ్ము సేయుచుండె

ఎక్కడో నెర్రిలో నిరికి కీచన్న ఆ
పియు నాపి పద మాలపించుచుండె
ఎక్కడో కాకి రంయ్యన బర్భ్యమాగంటి
పిచికమ్మ గుండె గుభిల్లుమనియె

తన పయిన నున్న ప్రియునిహస్తమును మెల్ల
మెల్లగా సుంత తొలగించి యల్లలేచి
క్రొత్తకోడలు పనిపాట్లకును గడంగె
మూడు యుగముల యలవాటు వీడలేక.

దుమ్ములోబడి పరుగులెత్తుచును గుడ్డ
పేలికకు నాశపడి బిట్టు పెనగి పెనగ
కుక్కపిల్లలు రెండాడుకొనుచు నుండె
దానితోడిదె జీవితమ్మైనయట్లు.

కోడిపుంజుల నిదుర మేల్కొలిపి నిక్కి
నిక్కి సనుదెంచు వేగు కన్నియ మొగాన
వచ్చిపడె బూడిదె- దివమ్మునైన మెలగు
చెనటి సన్యాసులెవరు ఘర్షించుకొనిరొ

చదువు వల్లించ వలసిన చట్టుబండ
అమ్మ యెక్కడ లేపునో యనుచు ముసుగు
దన్ని. బహుగాఢ నిద్ర నొందగ దొడంగె
ఎచట తమకమ్మ తన్నావరించినట్లు

ఎండుచొప్పను తననోటినిండ దివిచి
దీర్ఘనిశ్వాస వాయుగీతీ తరంగ
హేళి బలికించి కొమ్మలాడించుచుండె
గాటికడ రొచ్చులో నిల్చి గమిడి గేదె.

ఈ నిశాంతర క్రాంతి– ఈ ప్రశాంతి
నా జనింపక పూర్వమున్నదియు లేదు
నేగతించిన వెన్క– నుండెడిది గాదు
నా కొరకె బ్రహ్మ సృష్టించినాడొ యేమొ ?

ఎవతెవె? చేతిక్రింద బడి యేదొరహస్యము చెప్పు నాపసా
వి ... పొరపాటు గుండియవు నిగ్గనుగొంటి–సరే వచింప మీ
వు విడక యట్లె మేలుకొని పుచ్చితివో నిశ నెల్ల. లేక నా
కు వలెనె కున్క–. త్రుళ్లిపడి కూర్చొని యుంటివొ నా భయమ్ముచే

లీల గైలాస శిఖరి భేతాళరాజు–
ఎగసి డమరుక మొకట మ్రోగించె నేమొ
తన్మృదంగార్భటీ విరంతర తరంగ
రేఖ చెవిలోన గింగిరాల్వెట్టుచుండె.

— గాడేపల్లి కుక్క–టేశ్వరరావు

స్వేచ్ఛా గానం

దివిలో ఊగే విహంగాన్ని
భువిలో పాకే పురుగు బంధిస్తూంది
గదియేని ఆగని సూర్యుణ్ణి
గదియారపు బాహువులు బంధిస్తాయి
పీత డెక్కల చంద్రుణ్ణి
చేతు లెత్తే సముద్రం బంధిస్తుంది
గలగలలాడే తరంగాల్ని

జలకాలాడే అంగాలు బంధిస్తాయి
తనచుట్టూ తాను తిరిగే చక్రాన్ని
మలుపులు తిరిగే రోడ్డు బంధిస్తుంది
తెగ వాగే జలపాతపు నాలికని
సెగలెగిసే గ్రీష్మం బంధిస్తుంది
ముడుతలు పడ్డ ముసలి సాయంత్రాన్ని
మాటలురాని కొలవ బంధిస్తుంది
రాత్రి వచ్చిన రహస్యపు వాసని
ధాత్రిని దాగిన వేళ్ళు బంధిస్తాయి
గురి మరచిన గాలి బాణాన్ని
తెర యెత్తిన నౌక ధనుస్సు బంధిస్తుంది
ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు
ఇద్దర్నీ కలిపి బంధిస్తుంది మనీష

— ఇస్మాయిల్

మహాంబుధీ

అన్న : యొక మహాంబుధివి నీ, వమృత మయమూ
నిత్య సంపూర్ణమౌ : జుమా : నీ యెడంద

యే కుటిల వాత ఘాతముల్ సోకినపుడొ
పొంగులెత్తి యుత్తాల తరంగ మాల
పొరలు నీలోన దమ తమ దరులు సోకి
మరల నీయందె యవి డిందు మాడ్చి నరయు

మేపగిని నైన కల్గినొక్కింత నీకు;
క్షీణత మరెట్టి మార్పును జెందవోయి;
అన్న! యొక మహాంబుధివి నీవమృతమయము
నిత్య పరిపూర్ణమౌ జుమా నీ యెడంద.

అల తడలపర్వ నా యది యని భ్రమించి
కలతపడ కుబ్బి తబ్బిబ్బుగాకు. నిన్ను
నమ్ముకొని సాగు జీవికానౌకలెన్నో
మునుగవలదు నీలో మృత్యుముఖమునవలె
అన్న! యొక మహాంబుధివి నీవమృతమయము
నిత్యసంపూర్ణమౌ జుమా! నీ యెడంద.

కలదు నీ చుట్టు చెలియలికట్ట యొకటి
ధర్మమను పేర నద్దాని దాట వలవ
దొక్క- తప్పుటడుగు వేతువో; అనంత
జంతు సంతతి పచ్చపచ్చని మురిపపు
గాపురాల్ క్రుంగి క్షణమున గరగిపోవు
నీ ప్రభువు క్షమింపడు సుమా; నీ కతమున
జగతి పాడౌట. నీకు నైజమ్ము చలువ
అన్న; యొక మహాంబుధివి నీవమృతమయము
నిత్య సంపూర్ణమౌ జుమా; నీ యెడంద.

ప్రకృతి నవనవ శోభదాల్చి కొరకీవు
సృష్టమైనావు హింసకు; జేతులేత్తి
దేని. నీవలె భూతాళికెల్లనట్టి
యేదొ హింసకతా శక్తి లేదె; యింక

మిగులు నదియేమి, విషపూర్ణ హృదయుడవను
కటిక నిందయు కలుష పంకమ్ము తప్ప
అన్న ! యొక మహా బుధివి నీవమృతమయము
నిత్య సంపూర్ణమౌ జుమా ! నీ యెడంద.

వట్టి జడధివి కాబోకు, వర్ణనీయ
సుగుణ రత్నాకరుడవయి నెగడె దీవు
నీ పరోపకృతి శ్రీవి నెలవు కొల్పి
దేశ సౌభాగ్యము వెల్గుదెమ్మొకింత
అన్న! యొక మహాంబుధివి నీవమృతమయము
నిత్య సంపూర్ణమౌ జుమా ! నీ యెడంద.

క్షార భావము దిగ దోర్చి సహజ మధుర
హృదయ సార మొకింత పై కెత్తి కురిసి
దేశ దేశాంతరమ్ముల తీవ్రతాప
మారజేసి ప్రమద నదుల్ పారజేయు
శక్తి నీ యది తలచిన చాలుగాని
యన్న! యొకమహాంబుధివినీ వమృతమయము
నిత్య సంపూర్ణమౌ జుమా ! నీ యెడంద.

పెల్లుబుక నీకు, పేరాస విసపుబొంగు
చాలు, నీజగద్దోహమునై పడీకు
దీవు నీ దివ్యశక్తి రూపెత్తలెమ్ము
కామధేనువై, కలవృక్షమయి, చివర
కమృతమై భువం బమర లోకముగా జేతు
వన్న! యొక మహాంబుధివి నీవమృతమయము
నిత్య సంపూర్ణమౌ జుమా ! నీ యెడంద.

— చిలుకమర్తి రామానుజాచార్యులు

యువత - నవత

ఏమి నవత-ఏమి యువత ?
ఏది మానవత-ఏది నాగరికత ?

రెండు జడలి అమ్మాయిని
మొండిగ వెన్నాడుట
గుండాలై వీధిలోన
గుద్దులాటకైన దిగుట-ఏమి నవత - ఏమి యువత?

బల్లపైన బాకు బెట్టి
బల్లక్రింద కాపి గొట్టి
బలసిన ఆంబోతులాగ
విలచిన గంగెద్దులాగ-ఏమి నవత - ఏమి యువత?

హిప్పీలా వెంట్రుకలు
జిప్పీలా అనుకరణలు
తనదంటూ యేమిలేని
మనదంటూ యేమిరాని-ఏమి నవత - ఏమి యువత?

ఆడవారి గేట్లవద్ద
అవకాశపు సీట్లవద్ద
నరాల పొంగులోన
పరాగ హంగులోన-ఏమి నవత - ఏమి యువత?

చిన్నకొంగు చంక జుట్టి
సినిమాలా పోజుబెట్టి

అర్ధనగ్న శరీరాలు
అలంకార జీవితాలు-ఏమి నవత - ఏమి యువత?

దిగ్రీలను కట్నాలకు
దిగ్నిటీని పుట్నాలకు
అమ్ముకొన్న అవివేకులు
అభ్యుదయానికి బ్రేకులు-ఏమి నవత - ఏమి యువత?

అన్నింటికి తలవంచి
అవినీతిని తలలోపెంచి
గండిపడిన చెరువులా
జాతికి ఒక బరువులా-ఏమి నవత - ఏమి యువత?

యెదిరించెడి శక్తి లేక
మార్పుచేయు యుక్తి లేక
మేధగల్గి అవ్యక్తమైన
కాలానికి విధేయులైన-ఏమి నవత - ఏమి యువత?

ఆత్మ పరిశోధన
సమస్యలపై వేదన
సమధర్మమైన నవత
శాంతి నింపు మానవత

తేగలదే యువత
ఆ తొలిజామే నవత

— చౌడూరి గోపాలరావు

క్రాంత దర్శనము

ఇవి ఉషస్సులో: ఈశ్వర ప్రేరితములా
నవరసోపనిషత్తులో: నా మనస్సు
కోటి సుమనస్సు లటు గుబుల్కొనుచె కాదు
నృత్యమాడును శతకోటి నిర్ఝరులయి:

ఆమని పొంగులివ్వి శరదాగమ చంద్రికలై, దిగంత వ
ల్లో మకుటోద్గమ క్షితిజరేఖలలో వసుధైక వల్లరీ
ప్రేమ సుధాగవేషణల భృంగ కిశోర విహారశీలినై
ఈ మధురానుభూతి నొకపే గరువారిన మేనుదాల్చెదన్.

ఏ సీమావధిలేని ఏక వసుధాహ్వాక దేవాలయ
ప్రాసాదోపరి ఘంటికా ఋతులలో, ప్రాలేయ కాదంబినీ
ప్రాసక్రీడనదీధితి స్మృతులలో ప్రక్రీడలై క్రాంతిరే
ఖా సంక్రాంతుల పొంగిపోదును జగత్కళ్యాణ జాగ్రన్మతిన్.

అచ్చపు మల్లెపువ్వు హృదయాంతర మందలి స్వచ్ఛతాగుణ
ప్రచ్ఛవి సుప్రకాశనము ప్రక్క గులాబుల గుండెలోని కాం
తిచ్ఛట సంప్రదీపనము తీర్చుటలో నొకటవైన దివ్య దీ
వ్యచ్ఛిఖరీ సహస్ర కిరణావళిసారము కంటె సారమా:

అతివేల రసలోల హరినీల జలధికో
భవ్య నౌకలపైన పరవశింతు
నవగీత సముపేత నవనీత సరసిలో
హూల నావల మీద పులకరింతు

ప్రగతీహ జగదూహ పరిణాహ పథములో
ప్రత్యణువున యందు ప్రతిఫలింతు
సవివేక పరిపాక సకలైక పరిధిలో
పరమార్థ నిష్టలో పరిఢవింతు
ఇవి ఉషస్సులు ఈశ్వర ప్రేరితములు
నవరసోపనిషత్తులు నా మనస్సు
కోటి సుమనస్సు లటు గుబుల్కొనుచె కాదు
నృత్యమాడును శతకోటి హృదయులయి.

— కొర్లపాటి శ్రీరామమూర్తి

రేపు

చేజిక్కిన మంచుగడ్డ కరిగి నీరయింది
కలలోని మోహినీరూపం చెరిగిపోయింది
బలిరాతిరి దాపుకు చేరిన స్వల్పోష్ణం
మళ్ళీ యెండాకాలం దాకా వాయిదా పడింది

కొవ్వొత్తి ముందరున్న సుందరవదనం
అది కరిగి ఆవిరవగానే నలనయింది
విరిసిన విరికన్నె రెక్క లెందుకో విరిగినవి

రేపీ సమయం వరకు వాతావరణం
అతి భయంకరమని రేడియో ప్రసారం
క్షయలో ఉన్న చంద్రుడు చల్లనై, సన్ననై
నశించిపోయి నల్లని కల్వల సృజించాడు

పడమటి సముద్రంలో పడిన సూర్యగోళం
లేపిన ముత్యాలు

నా కళ్ళముందే అవి కొన్ని నీటపడి
లేపు సాయంకాలం సూర్యుడు తమని
తిరిగీ పైకి లేపుతాడా ? లేపడా ? అని
దుఃఖసాగరంలో ప్రశ్నించుకొంటున్నవి :

— ముదిగొండ వీరభద్రయ్య

ఇది జీవితం

ఈ జీవితం తొలినాటి స్థాణువు కాదు
ఈ నాటి మారణ పరమాణువు కాదు
రోజువారీ ఉదయాస్తమయాల నివేదిక
అనుకొనే వీలులేదు
చితుకుల చేర్చి వేసుకొనే
చలికాలపు క్షణజ్వాల
పతివ్రతలకూ పుణ్య స్త్రీలకూ
లభించగల సత్రపు శయ్యాశాల.

ఈ జీవితం సరళరేఖ కాదు
వర్తుల రూపంలోనూ చుట్టుకోదు
మాజీ మహోన్నత్యాల
జీమూత శ్రేణియైనా కాలేదు
నాస్తికుడు భగవద్గీతా గ్రంథాన్ని
ఆవిష్కరించిన ట్లూహిస్తుంది

సుస్థిగా ఉన్న వ్యక్తికి ఒలింపిక్
క్రీడల నాయకత్వం ఆదేశిస్తుంది.

ఈ జీవితం నెత్తురు చిమ్మదు
పోసి ఘనీభవించినట్లయినా తోచదు
మోజుపడి సమాధుల్లో మందిరాల్లో
నిల్చిన సంస్కృతిగానూ రూపొందదు
ఆశల గగనంలో నిరాశల పుష్పమెక్కి
క్రింది సొంత నేలను చూసింది
చూచి మాసిన ఆతుకుల బొంతపంటి
ఆ దృశ్యాన్ని ప్రకృతిసౌందర్య మనుకుంది.

ఈ జీవితం కేవలం నల్లపూస కాదు
మహా మేరువూ అనడంలేదు
కాజేసిన ఆత్మ కథల్లోని
ఘట్టాల ఉండకూడా కాదు
చిత్రంగా బహిరంగ సంతాప
సభలాగా సాగిపోతుంది
పత్రికలోని పతాక శీర్షికవలె
వెతక్కుండానే కనిపిస్తుంది.

ఒక్కటి మాత్రం నిజం— ధరల వెంబడిపడి
యీ జీవితం పెరుగుతోంది
చిక్కువడి త్యాగత మస్సులో
దారికై సంఘర్షణల దవాగ్ని నారాధిస్తోంది
ప్రపంచం విదార్శిణమై ఒక్క వార్తకూడా లేని
ఆఖరు క్షణం వస్తుంది
అపుడు నిలువెత్తున లేచి నిజంగా
పతాక శీర్షికై యీ జీవితం వెక్కిరిస్తుంది.

— పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి

బాపూ!

బాపూ!
నీవున్నప్పుడన్న మాటలే
పునశ్చరణ చేస్తున్నాను.
నిన్ను దేవుని కిందికి చేర్చిన
మరుగుజ్జులలో చేరను.
నేను నీ భక్తుణ్ణి కాను.
నీకో పాలరాతి గుడి కట్టించి
నిన్ను అందులో స్థాపించి
జే గంటలు కొడుతూ— నీ భజన చెయ్యను.
నీకు నామ సహస్రాల నర్పించను
నీకు హారతులిచ్చే నెపంతో
నీ కళ్లకు ధూపపు పరదా కట్టను.
నీ చూపుకు బైటి ప్రపంచం కనపడకుండా
తలుపులు ముయ్యను
నీ కోసం అంటూ 'రాక్షస' కన్నీరు కార్చి
నీవే తప్ప 'ఇతఃపరం' లేదని చెబుతూ
నా తప్పని సరితనాన్ని చాటను.

బాపూ!
నీవూ నా వలెనే సాదాగా పుట్టిన వాడివి
నా కలల్లో చిత్రించుకున్న
ముక్త మనస్సౌందర్యమూర్తివి.
నీ జీవన సుమనం సుగంధ పరాగమయం

నిజమే.
నీ జీవన లతలో ముళ్లు చేరడమూ
అంతే నిజం.
జీవన సాగరాన్ని మథించిన వాడివి
సాంధించిన అమృతాన్ని లోకానికి పంచినవాడివి
మిగిలిన విషానికి ఆహుతి అయిన వాడివి.

జనమనోతాపాన్ని అపనయిద్దా మనుకొని
అనుకున్నది సగమే నిజమై ఉసూరుమన్న వాడివి
సుఖంకొరకు నిర్మాణాన్ని ఆశించే ఈ లోకంలో
నిర్మాణంలో సుఖాన్ని వెదకిన నీ వేదన
నిజమైన మనిషి పడే ఆవేదన.

బాపూ!
నీవు నడచిన ప్రతి బాటనూ
నేను వరించలేను సుమీ!
ఐనా నీ ఎదనిండిన తహతహ
నా జీవనాదిలో స్పందించిందంటే
నీకు మృషాకైవారాలు ఇవ్వాలని కాదు.
అందుకే నీ వందేండ్ల సంస్మరణం పేరిట
నిన్ను విస్మరించే ఈ శతవార్షికాలు జరపను.

మన చరిత్ర బహుశాఖావిస్తృతం
ఇది అక్షయ వటవృక్షం.
అందులో సమీపవర్తి కాఖవు నీవు
అందుకే నిన్ను ఆసరాగా పట్టుకున్నాను.
నీలో నాకు ఆలంబనంగా కన్పించినంత
అచ్చంగా, నిజాయితీగా అర్పిస్తాను.

బాపూ!
నీకు అసత్యం సచ్చదు కదూ!
నీ భక్తుణ్ణి మోసగించను
నా గొప్పకు నీ సమాధిపై మెట్లు గట్టను.

— భండారు సదాశివరావు

దివ్యక్షి

పని యిది యెంత మాత్రమును పట్టదు నీకును. నాకు: తమ్మి పూ
వున గల జంట తుమ్మెదల పోలిక గోల యొనర్చు టొక్కటే
మనకిగ సాగుచున్నది సుమా. యిట తేనియ గ్రోల వీలు లే
దనియెదు. గొంతు విచ్చెదు విహాయసమోహన గీతికాధ్వనై
పిలిచి మొగాన దీపమును పెట్టి, కవిత్వము నోటగొట్టి, క
న్నుల నులివెచ్చ నీళ్లల మణుల్ మొలిపించి, అయోమయంపు త్రో
వల జను జీవితాన జడివానల ముంపుల జుట్టుముట్టి న
న్నలమట పెట్టు నీవు తరువా, గురువా, చెరువా యెవండవో

నిను గురుతువట్టుకోసమై నీడలేని
యూళ్ల వెంబడి, యేరుల నీళ్ల వెంట
బడి, తుదకు గుండె గుండెలో పాకికులాడు
కోర్కెలోతుల మెరపుగా గుస్తరించి

గీతిక వెంట గీతికగ - కృష్ణపయోద విషాదరేఖగా
రీతుల లోతులందు- తరళీకృతమైన లయానుగామిగా—
చేతమునందు తోచితివి - శ్రీ మయ! వెన్నెల పాదులోన ప్ర
స్ఫీతమునైన తీవవలె ప్రీతిని వెల్గెడు సుస్మితంబవై

సిగపయి మింటిపువ్వు. నొక
చెక్కు చేడియ కంటి వెంట జా
లుగ చనుదెంచు నవ్వు. జడ
లో తయితక్కు ల నాడు గంగ చె
మ్మ గలుగ జేయు రువ్వు. తన
మె తిరుగాడెడు పాపరేండ ని
వ్వు. గురుతు పట్టు పెట్లు ప్రభు
వున్ తనలో తను జూచు వేలుపున్.

— ఘనశ్యామల

నే!

ఎడద లోతుల నుండి పాడుదు
కడలి అలల గలగల వోలె
మూడు లోకాలలో ధ్వనించు
ప్రేమ వారిన ప్రతుకు పాట

కడలికైన అంతమ్ము కలదు
కాని చెలియలి కట్టయే లేని
నా విషాదసాగర ఘోష ల
నవరతము ప్రేమ వలసినదే

తీయని తలపుల నెపుడు నా
ఎడద కలలోనైన నెరుగదు
కలతలే తలపోసి తలపోసి
కటిక చీకటియే కాని యెపుడు
కాంచనైతి చిన్ని దివ్వెనైన

విండువున్నమ వెన్నెల రేడు
ఎనలేని ఆనందమ్ము విచ్చు
కాని నా దుఃఖార్ణవమునకు
ఆటు పోటై అవతరించెను

శరజ్జ్యోత్స్నా సంఘర్షణ
సంజనిత మయినటి వెలువ
ఎదలోని కలత కడలి వెల్లువ
కదలి పొంగిన ఉప్పెనలో

లోకములకే కన్పడకనే
లోలోన మున్కలిడి తానమాడుదు
పరవళమ్మున విషాద గీతిక
పరిభువి మోదిల ఎపుడు పాడుదు

— రుద్రశ్రీ

సాయంచేతన

విద్రితారణ్య వాటికా విధృత రేఖ,
మూకత బ్రతిక్షణ యుగాళి బుచ్చగదవె;
నీ వ్యధా గీతికలా—కోష్ణ నిశ్వసిత మ
రుత్ప్రపూర్ణ రోదసివి నిల్చినొకొ లిప్త;

ఈ సినీవాలిలో-జడలెగయ దిగ్వి
తానముల-కృత్రిమస్మితోద్యన్ముఖముల
మలయు నైరాశ్య దగ్ధ జీవులకు నేమి
యవసరము; భవన్మార్మికారవ మధురిమ

సీకు సీవె-యీ దృగ్వ్యధా నిర్ఝరాగ్ని
దాపమంద-సీ నా యవస్థా విశేష
మను నిమేష బాష్పస్థగితాక్షి యుగళ
మలఘు నైశ్చల్యమూర్తి నేమని వచింతు ?

అగ్ని పర్వత తుంగ శృంగాంతరముల
సమద పుంస్కోకిలా సుధాసార రుచిర
గానముల విందు-ఘోరశ్మశాన తతుల
ముగ్ధ బిర్ఝిచ్ఛటా లాస్యములను గందు

కనులన్ విచ్చిన యీ యుషర్బుధ మహో
గ్ర గ్రావ శృంగంబులే
ఘన కంకాళ నటత్ పతత్రి వివహా
క్రాంత శ్మశానమ్ము లే
కన వచ్చున్-నిఖిలమ్ము శూన్యమయి శు
ష్క వ్యర్థమీ సామిచే
తననింకెన్ని విశా విషాంబుధుల నీ
దన్ వేధ కాసించునో !

— టి. బి. యం. అయ్యావారు

శిశుగీతం

ఇప్పుడే పుట్టాను నేను
ఇంకా పేరుకూడా పెట్టలేదు
బొడ్డుకోసి ఆవలి గట్టు నుండి ఈవలకు పడవేశారు
మాయ నుండి మమతా బంధంలోకి విసిరేశారు

కాయగా వున్న నా మనస్సు
కటిక రాయిగా మారుతుందో—
విచ్చుకొన్న పువ్వులా వున్న నా ఆత్మ
మొగ్గలా ముడుచుకు పోతుందో—

ఇప్పుడే పుట్టిన నాకు
అనంత గర్భంలోంచి, ఆకాశ హర్మ్యంలోంచి,
అమ్మకడుపులోకి పడ్డ నాకు
రక్తంలా విడిగా, పాలలా తెల్లగా,
పేరులేక, ఊరులేక, కరుణించేవారు లేక
పుల్లవోలె, గాలి రెమ్మవోలె వున్న నాకు ఏం తెలుస్తుంది?

అపుడే అపుడే ఆకలి అనిపిస్తున్నది,
అమ్మా అని ఇంద్రియాలు ఆక్రోశిస్తున్నవి

గట్టుమీద, చెట్టుమీద
గాజు కళ్లు, చింకిబట్ట, చివుకు బుట్ట
వేస్టైడ్ ఈవ్, వేస్టు పేపర్ బాస్కెట్
ఎండిన తన రొమ్మును నా కందిస్తే
ఎండుచేప వాసన నను మండిస్తే
నా క్షుధాగ్ని శతముఖాల లోలోపల నా లోపల వ్యాపిస్తుందని
నను కబళిస్తుందని ఎవరికి తెలుస్తుంది?

దేవుడా! ఈ దేశంలో ఎందుకు సృష్టించావు నన్ను?
జనగణమన గీతాన్ని జడునిలా గానం చేస్తున్న జనత
తెల్లటోపీల వెనుక తెలివి లేమిని దాచగల యువత
నాకు సహాయం చేయకుండా చూడు.

ఆసుపత్రి పాలబడే నా శిశుత్వాన్ని
ఊరకుక్కలచే కండలుగా పీకించుకోలేను

అనాధాలయంలో అమ్ముడుపోయే వ్యక్తిత్వాన్ని
డైమండ్ రాణీగా, కళావరు జాకీగా మార్చలేను

హంసలా, ఆరని మంటలా, హరిణశాబకంలా,
విద్యుత్తులాగ, వీరునిలాగ, ఋషి శాపంలాగ,
వర్షంలా, వెన్నెలలా, నవయౌవనిలా, బ్రతకాలని—
మబ్బు పరదాక్రింద, పడీలా నాట్యం చేయాలని
హిమాలయ సానువుల్లో గంగా జలమై గలగల పారాలని
నా సంఘానికి, నవ కవనానికి, ప్రతినిధిగా బ్రతకాలని
అందంగా నవ్వాలని, కన్నీటిని తుడవాలని ఉన్నది.

తండ్రీ: తపనతో తల్లిగర్భంలో బ్రుగ్గి భూమిపై పడ్డ నేను
బట్టతలకూ మోకాటికీ ముడివేయలేను
నల్లబజారులో లక్ష్మిని నగ్నంగా నిలబెట్టలేను.
వాణిని వేశ్యనుగా, నా దాసీలా, తాడు తెగిన పటంలాగ మార్చలేను

అర్భకుణ్ణి:
ఆరువు పాలమీద బ్రతకవలసిన వాణ్ని.
ఎరువు తిండిమీద పెరుగుతున్న వాణ్ని
దేవుడా: నేను పసివాణ్ణి—

బ్రతికిస్తే జీవితాంతం పచ్చగా పసిగా బ్రతికించు
కసితో, మసితో, మనసంతా కాలుష్యంతో నను కాల్చకు
మీట నొక్కి నను చంపించు
చీకటికీ, ఆకటికీ ఆట విడుపు కల్పించు.

— కొండముది శ్రీరామచంద్రమూర్తి

మరచి పోయిన పాట

ఁ

చూరుపై వంచి నిల్చున్న మర్రిచెట్టు కొమ్మల్లోంచి
స్రవించే నీరెండ చురుకులా నువ్వు జ్ఞాపకం వచ్చావు.

సుఖాల మెత్తందనాలతో గట్టివడిన ఆంతరంగపు గోడలకు
అడుగుపొరల లోలోపల సవ్వడులు చేసిన సందుల్లోంచి
నువ్వు కనబడ్డావు.

అద్వితీయంగా ఆశ్చర్యంగా ఇంద్రధనుస్సులు పుష్పించే
మా తోటలో రేపటికి పరచిన మసక వెలుతురు బాటలో
హఠాత్తుగా నిలువెత్తుగా
పగిలిన కాలజలదఖండంలోని పచ్చని మెరుపు వత్తిగా
కనబడిన నువ్వు
గళం విప్పిన నువ్వు
మమ్మల్ని చూడగానే దూరంగా వెళ్ళి నిల్చున్నావు.

మా ప్రపంచం ఇరుకుగా ఉందన్నావు.
మా ఆహార్యాన్ని తిరస్కరిస్తూ
మా స్వాగతాన్ని అధఃకరిస్తూ
పసందుగా శ్రుతిచేసిన మధురోహల వీణపై
అశాస్త్రీయ సంగీతాలాపన చేశావు.

౨

ఇంతమంది రసికులకై మేము వేసే నాటకంలో
ఇతివృత్తం మంచిది కాదని
అప్పుడు పేచీ పెట్టావు
ముందు సీట్లో నేను వాల్చిన సిల్క్-లాల్చీల సెంటు
మూలకొరిగి దూరంగా నిల్చున్న వాణ్ని మింగేస్తున్నాయని
అందరినీ తిట్టావు.

నాజూకైన మస్తిష్క-పు గాజుమేడమీదికి
ఘాటైన సత్యాలు గురిచేశావు
సుఖాంతమై రక్తి కట్టబోతున్న కథలో
డెడ్‌లాక్ కల్పించావు

ఆ క్షణం నుంచీ ఎవ్వరికీ నిద్రలేదు
సందేహాల సుడిగాలిలో కూలిన ముత్యాల చలువ పందిరి
మళ్లీ నిశ్చలంగా నిల్చుకోదు
విన్నటి సార్థవాహం ఇకపై మా కోసం
నిరీక్షించదు.

ఈ సన్నివేశంలో గొంతు ముడివడ్డుకుంటుందా ?
కానరాని హేతులవిత్రం కింద తీవసాచిన బ్రతుకులో
ఆనంద భైరవి వినబడుతుందా ?

౩

సిందూర తిలకం దిద్దిన వదన సౌభాగ్యాన్ని చూపించే
అందమైన ఈహాదర్పణంలో
నాణ్యం కోసం ధరించిన నవ్వుల క్రింద నలిగి మరణించే

నాగరికుని చర్విత చర్వణావసానంలో
ఆవహించిన భీవాల
భయాల
ఆ వర్తాలలో
కోర్కెల మానికలతో జీవితాన్ని కొల్చుకుంటూ
గతాన్ని నటించి వేశాను

భవితవ్యాన్ని ఎలా జీవించను ?
దుర్బలమైన మానవత్వం
నిజాల జాలంలో చిక్కుకున్న మానవత్వం
దుర్భరంగా కనిపించినప్పుడు
నేను నాలో నుంచి పారిపోవాలనుకున్నప్పుడు
ఈ చేతి సంచీ తీసుకువెళ్లి గుప్పెడు జ్ఞాపకాలతో నింపమని
నా చుట్టూ చేరిన వాళ్లను వేడుకున్నాను
ఇక గాంభీర్యం ఎలా వహించను ?

విరంతర సౌందర్య జ్వరగ్రస్తుణ్ణి
గదిముందరి గాఢతమోకాసారం దాటి నీటి వద్దకు ఎలా రాను?
నీ పాటలోని భయద రహస్యాలను
ఏమని అర్థం చెప్పుకోను ?

ళ

నీ పాట
సనాతన మధువు తాగి చివరి అంతస్తులో పవళించిన నాకు
నిద్రాభంగం చేసే పర్జన్య ఘోష
నమ్మకాల సుందర నందనాన్ని నుసిచేసే అగ్నికీల.

నీ పాట
శిశిర వసంతాల మధ్య చేతనా తీరానికి చేరిన

విశ్వబ్ది కాంతి వీచికలా మిరుమిట్లు గొలిపింది
ఉదయ సూర్యుని రథాశ్వాలకు తగిలిన
కొరడా కొసలా నన్ను మేల్కొలిపింది.

నేను శివుడినై తాండవించాను—
ఎండిన ఆశలు కంటకాలై గుచ్చుకుని
అడుగడుగునా రక్త ముద్రలు పడ్డాయి
నా ప్రపంచంలో చీకటి రంగులతో గీచిన రేఖా చిత్రాలు
తెల్లబోతూ విలబడ్డాయి
నేను భయపడి పరుగెత్తాను
అందరూ నన్ను రిబెల్ అన్నారు.

ఓయి సఖా;
పసందుగా శ్రుతిచేసిన మధురోహల వీణపై
ఆశ్చర్య సంగీతాలాపన చెయ్యకు
నా అజ్ఞాన శాంతిని హరిస్తూ ఇక వినిపించకు
ఎన్నడో మరిచిపోయిన పాట.

— పణతుల రామచంద్రయ్య

ఆనో భద్రాః

నేను చేస్తాను యజ్ఞం:
శాంతికై విశ్వ శాంతికై
కాంతికై జగతి వికాసంతికై
నేను చేస్తాను యజ్ఞం॥

అశాంతి నిహతికై
ధర్మ విరతికై
నేను చేస్తాను యజ్ఞం

'పక్వాన్న మివ భోజ్యేన...' అన్న
కామసూత్రాలు ఖండిస్తూ
ఇహానికీ పరానికీ ఇజాల
గారడీలు వద్దంటూ
నేను చేస్తాను యజ్ఞం ।

నా యజ్ఞానికి ఋత్విక్కులు
నానా జాతి మానవులు ।
నా యజ్ఞానికి సమిధలు
బూతుపురాణాల కట్టలు ।

ప్రజలలో అశాంతి పోవాలనీ
ప్రపంచంలో సుభిక్షం పండాలనీ
కార్మికుడూ, కర్షకుడూ
యువతా నవతా ఒకచో చేరి
ప్రజాస్వామ్య జగన్నాథ రథానికి
సమతా తోరణాలు కట్టి
శుభోదయ నాద స్వరం వినిపించాలనీ
నేను చేస్తాను యజ్ఞం ।।

— ఎల్లోరా

ఉషసి

పసి నునుడెక్క త్రొక్కుల చివాలున తోకను త్రొక్కబిడ్డవై
బుసబుసలాడు నాగులయి మూగిన దుమ్ములవార్చిలు సంజలం
దెసగు మనోజ్ఞరాగరుచి నిండిన బంగరుకాంతిపుంజముల్
దెసలకు చిమ్మికొంచు నలాదిక్కుల తోచడు నేత్రపర్వమై.

ఈ బంగారపుకాంతి వెల్లిగన నా యీ మానసాబ్జమ్మునన్
దోబూచుల్ పచరించు చున్నదెదొ ముద్దుల్గుల్కు రూపమ్ము వే
డో బాలుండయి నల్లజిల్లెడుల బొడ్డుల్వోని మైచాయతో
గో బృందంబుల తోలుచున్నటుల దిక్కూలంబులం దోచెడిన్.

వార్చిలన్ సంజల నేటవాలు కిరణాల్ వ్యాపించి బంగారు వ
ర్ణాలం జిందెడి ఈ వియత్తల ముదంచన్మోహనాకారమౌ
మౌళిం జిత్రవిచిత్ర కాంతిమయ పింఛంబౌచు తూగాడి యం
దాలం విచ్చెను మై గగుర్పొడువ నందాల్ విచ్చె నా చిత్తమున్.

నందాపత్యము నల్లకల్వసిరి చందం బందమౌ ముద్దు మే
నం దారాడి పవిత్రమై యమునపైనన్ మెల్లగాప్రాకి గో
నందోహమ్ముల వీపులెక్కి వ్రజయోషాస్వేదముల్పాపి యా
బృందావీథుల వీచు మందపవనం బీ నాడు నన్ దాకెడిన్.

ఈ సంధ్యా మృదువాయువీచికలలో నేవో శ్రవఃపర్వముల్
గా సంభూతములౌచునున్నవి మనోజ్ఞంబైన నిస్వానముల్
గోసంతానము వెంటనంటి చను నా గోపీజనప్రార్థిను వం
శీసంరావములేమొ మై పులకరించెన్ చిత్తమూగించుచున్.

ఎన్నటి సంజవెల్గు లివి ఎన్ని యుగమ్ములనాటి వెన్క వీ
పన్నని చిన్నిచీలలకొసల్ ననుబంగరు రంగులోవి యీ
చెన్నొలికించు సృష్టి యిటు చిన్నరి నల్లని గొల్లవాని నా
కన్నుల గూర్చిపెట్టినవి కమ్మని యీ యనుభూతి చిత్రమౌ.

— తుమ్మపూడి కోటేశ్వరరావు

పితృతిథి

M. V. KOTESWARA RAO
Minister for Education & Cultural Affairs
Executive President,
WORLD TELUGU CONFERENCE
NEW DELHI, INDIA.

లిపి సమభ్యాస దినముల యపుడు నేనే
దిద్దుకొన కమ్మనెంతో వేధించినాను
చెప్పవమ్మ! సముద్రమ్మ చెరువుకన్న
చిన్నదా! పెద్దదా! నాకు జెప్పుమనుచు.

చిన్ని నా కేలు మీ కనిష్ఠిక నమర్చి
నన్ను గొనిపోయి చూపిరి మిన్నులొరయ
నల మహాజలరాశి యనంతమనుచు
విరియు పసిగన్నులందు నచ్చెరువు నింప.

కావ్యశిక్షాదినమ్ములు గడిచి విరత
భావనావళహృదయ విపచ్యమాన
వాసనాదుగ్ధ పరవళ భావమందు
తటిని మరువకుమని చెప్పి తరలినారు.

గలిత సాధనపరమై ప్రగాఢ మోహ
వివశమై తండ్రి మీ పర్యవేక్షణమ్ము
తప్పి దెసమాలు మజ్జీవితమ్ము నందు
చెలగి యొకనాడు మిము దలంచినది లేదు.

నే డమావాస్య మున్నిటినీట గలుప
వచ్చినాడను పితృభు క్తి భాజనముల
కబళిత నభఃకటాహాంధకార విలయ
జలధి మీ కోపమరసి విహ్వలుడనై తి.

— మల్లంపల్లి శరభయ్య

కనకాంబరపు రంగు చీర

సూర్యుడు అప్పుడప్పుడే లేచి, కళ్ళు నులుముకుంటూ చూస్తున్నాడు
రాత్రింతా తనతోగడిపిన సంధ్య,
తనకెక్కడ అగుపడటం లేదు, చుట్టుప్రక్కల
తనలో ఇమిడి పోయిందేమోనని, తనవైపే చూచుకొన్నాడు

సంధ్య తన దేహచ్ఛాయనూ,
ఆచ్ఛాదనగా వుండిన కనకాంబరపు చీర రంగునూ,
వంటికి పట్టించినట్టుంది ఆ రాత్రంతా
పల్చని మబ్బుతునకలతో వళ్ళు రుద్దుకుంటే తప్ప

రాత్రంతా కురిసి, గడ్డిపరకలపై ముత్యాలు అద్దాలు పేర్చిన
హిమ బిందువుల్లో-తన తెల్లటి అందాలు చూసుకోలేదు
తెల్లబోవడం కాదు; లోకం పాలించాలి కదా!

తెలుపుకు తోడు వేడి తెచ్చుకోవాలి,
శుచియై, ఉషస్సందించనున్న శ్వేత వస్త్రాలు ధరించి,
లోకపాలనం చేయాలి- మళ్ళీ సాయింత్రానికి
కనకాంబరపు రంగుచీరతో సంధ్య సాక్షాత్కరించే వరకూ...

— వంగపల్లి విశ్వనాధం

ముఖం ఎత్తిందో! లేదో!

ముఖం ఎత్తిందో, లేదో కాలం
చేతులు చాస్తుంది మనస్సు
చంక కెత్తుకోమని.

కాస్త ఆలస్యం చేస్తే చాలు
మారం చేస్తుంది.
ఏడుపు లంకించుకుంటుంది
కాస్త - చనువిస్తే చాలు
కొండెక్కించ మంటుంది.

చంద్రబింబాన్ని పట్టుకోవాలనీ
చేతి బంతిగా ఆడుకోవాలనీ
చుక్కల పూలు కోయాలనీ
ఉత్సాహం ప్రకటిస్తుంది.
ఆకాశాన పరుగెత్తాలనీ
ఆరాటం పడుతుంది.
అసంభవాన్ని అనుభవించాలనీ
ప్రవర్తిస్తుంది అసంబద్ధంగా.

కాలగర్భం నుండీ
పుట్టిన మనస్సు
కాలం సీదలో
పెరిగిన శరీరంతో
శైశవం దాటక ముందే

అన్నీ వశం చేసుకోవాలనే.
శైశం దాటేప్పటికి
బీజ భూతాలై నవన్నీ
ఏవేవో వృక్షాలవుతాయి
కొమ్మలు చాచి వింగిలోకి

ఆశలు వింపుకొని మనస్సులై
ఋతకోసం చూస్తుంది కాలం.
తన ముఖంపై వెలసిన నీడల్ని
మనస్సు వెలిగించాలనుకుంటుంది.
తనను సమీపించే చీకటిని
మనస్సు తగుల బెట్టాలనుకుంటుంది.

కాలానికి లేదు విసుగు
మనస్సుకు ఉండదు తీరిక
కాలానికి ఉంది ఆయుః పరిమితి
మనస్సుకూ ఉంది తరం భేదం.
మనస్సుకు కలిగినపుడు వివేకం
కాలం పొందుతుంది అమృతత్వం.

మనస్సు ఎన్నటికీ
శిథ రూపంలో లేకపోయినా
కాలం ఎన్నటికీ
వీడదు తన మాతృత్వం.

— మాదిరాజు రంగారావు

ఉభయ సంధ్యలు

ఇటు తూర్పున
తలరాకు జొంపాలపై స్నిగ్ధంగా ముగ్ధంగా జారే మంచుబిందువులా
తామర కొలనును వేయిముఖాలతో విప్పార్చే నునులేత కిరణంలా

తుషారంతో,
తరుణారుణభాను విషాణంతో సించితమైన
మలయ గంధసార సమార్ద్రి పవనంలా
పవనంతో రెపరెప లాడే పైరులా
భూమాత కట్టుకున్న చిలకపట్టు చీరెలా
ఇటు తొలివాకిలి రంగుల తెర ।।

అటు పడమర
ముసలి తనంతో నెరిసిన మబ్బు ముక్కలా
అలసిన సూర్యుని పండువారిన దృక్కులా అస్పృక్కులా
విరాళాంధకారానికి ఉపధలా, ద్విపదలా
తెలుపు, ఎరుపు, నలుపులవర్ణ సమామ్నాయంతో
అటు మలివాకిలి మాయల వల ।।

అవంధ్యగా మారిన ప్రకృతికన్న స్వప్నాలు ఘనీభవించి నవుడు
ఆకారంలేని ఒక నిర్వికారం నామ రూపాలతో దర్శనమిచ్చినవుడు
తొలి వాకిలి నుండి బ్రాహ్మీముహూర్తంలో
అవతరించిన ఒక దరహాసం
మలివాకిలి నుండి నిర్గమించింది కొన్ని క్షణాల తర్వాత
రెండు ద్వారాలకు మధ్య ఒక ఆరడుగుల ప్రాంగణం ।
పురాతన సనాతన చిరంతన నిరంతర ప్రవాసాంగణం ।।

ఇంట్లో చాందినీలు పిరిసిన కొన్ని గదులతోబాటు
శిథిలమైన బూజు తోరణాల సవ్వడులూ విన్నాను
రాగోష్ఠ చుంబనాలతో బాటు
రక్తకరాళ కృత్యాలూ కృత్యాలూ కూడా కన్నాను

ఆనంద వెల్లువగా పొంగినా ఈ ఇంట్లోనే
అదుగో విద్వేషం వింధ్యపర్వతంలా లేచింది
ఆనంద వారిధికి కాల్వలు నిర్మించడం చేతకాక
ఆగస్త్యుని ఆవాహన చేసే శక్తి లేక
మరో ఇంటికోసం వెతుకులాట
మరణానంతర జీవనానికై ప్రాకులాట !

పరిమితమైన ఈ ప్రాంగణంలోనే
ప్రజ్ఞా ప్రతిజ్ఞా ప్రదర్శనాలు
అజ్ఞానపు గంజాయి వనాల్లో
నిలబెట్టిన కత్తులు
నిర్నిద్రమైన అతిమానస తపస్సులు
రాబందుల రాక్షస స్వప్నాలతో బాటు
రాత్రి తరువాత రాబోయే అరోరాకోసం
మానస సరోవరం చుట్టూ మూడువందల కోట్ల హంసలు
అమృతాభిగమనానికై సాగించే
విరీక్షణా చిత్రం !

కాలంపై విసిరిన గాలంతో
కొందరి ఇంద్ర జాలంతో
ఇప్పటి నుంచి విన్నటికీ రేపటికీ పరుగులాట !
'ఇప్పుడే' విన్నగానూ రేపుగానూ
మారుతుందని తెలియని వెతుకులాట !
జీవనాన్ని చూచి భయపడే పిరికివాడికి
జీమూత నేచనుడైన పలాయనవాదికి

రెండువాకిళ్ల రెండు బ్రహ్మరాక్షసులు
మధ్యనున్న 'ప్రాంగణం' మలినం-విద్దిష్టం-మోహావేశం

వేదాంతులు ఎన్ని గ్రంథాలు వ్రాసినా వాదాలు చేసినా
వారి మేధావినిర్గత సిద్ధాంత కుసుమాలు పూచినా
ఈ రంగుల తెరల ఇంద్రజాలం తెలియకనే
ఈ మంత్ర కవాటాలు తీయడం మూయడం ఎరుగకనే।

శంకరుడు, గౌతమబుద్ధుడు, చార్వాకుడూ, ఐన్‌స్టీన్,
ఇందరికి తెలియని ఈ రంగుల తెరల కవతలి
దృశ్యముతో విశ్వంతో నాకేమిటి పని।
ఉపాధికి దర్శనమిచ్చే ఈ ప్రాంగణంలోనే
ఉన్నంత కాలము యదార్థంగా పదార్థంగా జీవించడమే
ఇదలి ధ్వని।।

— ముదిగొండ శివప్రసాద్

నీవు

సోమిపూరిత జలకుంభ చలన రావ
రీతి శబ్దించు గుండెలోతు నుండి
ఎవరవే నీవు వచ్చుచుంటివి అపాంగ
పీఠికాంతాల నందనాల్ విచ్చికొనగ

ఈ రహోవేళ పాద మంజీర శింజి
తములు కకుబంతముల మ్రోయ రమణి। లేచి
వచ్చినావేరు। తామిస్ర మచ్చుపడిన
గుండె సందుల సందుల నుండి ఇటకు.

ఇది మదీయ జనూరహస్యద సమాధి
పేదకు లోతులు చూపెడునది అనంత
విచిత్రమైన మదీయమ్మెదో చిర నవత
విరుచుకొని వచ్చిపడునంచు తెరువుగనుదు.

కనుచు కనుచును కన్నులు కునుకవింత
ఇంత తునికను అది వచ్చునేమొ ! నీవు
అట్టి సమయాన వచ్చితి వయ్యొ గదవె
నీవె తత్క్షణ దేవతా భావమేమొ !

నీవు నీవందుగాని– కాంతి స్రవంతి
వంటి నిను నీవు నింతైన పరిచయింప
శయితివో విద్యుదక్షి ! నా అంగమెల్ల
క్రమ్మబడినది నీ ప్రభావమ్ము వలన !

ఉచిత యౌవనరాగ పర్యుత్సుకమ్ము
కాలికశ్రీ విభాపూరకమ్ము దివ్య
భావ దేవీపదాంక సంభావితమ్ము
నా మనోభావనమ్ము సమ్మిత ఋతము.

నా కనుంగొనలందు నైందవ మనోజ్ఞ
రేఖికా ప్రచారమ్ము నై లింపరీతి
కేత మెత్తును–త్వత్స్వదృక్ ప్రీతదృష్టి
మనసు నిండుగ నన్ను చూచినద యేని.

ఎవరవో కాని నీవు– ఇద్దువదియైదు
గా పొలిచిన శారదిక సాంగత్య జనిత
ముదవల్లంబితయైన చిరవిముగ్ధ మస్మ
దీయ హృత్పథమందు చిందింతువహము.

— సంపత్కుమార

హంస పయనించింది

చుక్కల్ని చూడలేను
చుట్టూ రెపరెప కొట్టుకుంటున్న
పసిరెక్కల్ని చూడలేను

ఎదమీద కుందపోతగా పురుస్తున్న
మృదువైన కన్నీళ్లు చూడలేను
కన్నీళ్ల సెలయేళ్ళ దూకుడులో పుడుతున్న
కనిపించని విద్యుత్ కళాఘాతాల్ని
చూడలేను

ఇన్నాళ్లలాగా వెచ్చగా పాడుకోలేను
మంచుగడ్డలాంటి మరణ బంధమునుంచి
నన్ను నేను కాపాడుకోలేను
మమతల్ని పుటుక్కున తెంచుకోలేను

మంచం కాలువైపుల ఆరవేసిన
తడిసిన కనురెప్పల నుంచి తప్పించుకోలేను
అల్లంత దూరాన ఒక కుక్క మొరుగుతున్నది
అంబరాన ఒక రిక్క ఓర్చుకుతున్నది
ఇంటి వెళ్ళుపల గాడుపు ఊళ పెడుతున్నది

మింటిలోపల ఏడుపు చీలిపోతున్నది
నిశ్శబ్దత బరువుగా చేరుకుంటున్నది
విశ్వాసం అశ్వంలా దౌడు తీస్తున్నది
చావు బ్రతుకుల సన్నని పొలిమేర

నీవా నేనా అని కుమ్ములకుంటున్నది.

గాలిలో సరికొత్త ఊపిరి రగిలింది
నేలలో సరికొత్త మృత్తిక మిగిలింది
వెలుతురు ఒక అగ్గువం వికసించింది
జల హృదయం జలజల కంపించింది
ఆకాశం నీరవంగా ధ్వనించింది
ఆత్మ హంస ఊర్ధ్వంగా పయనించింది.

— సి. నారాయణరెడ్డి

ఉగాది

తమో బంధురమైన కృష్ణపక్షాంచలం నుండి
జ్యోత్స్నామయ నిశ్రేణిక శుక్ల పక్షానికి
పరిణమించే సంధి అమావాస్య—

చైతన్య శ్మశానమైన శిశిర భూముల నుండి
సౌమ్యవాసనా బంధురమైన వసంత లోకానికి
అనుగమించే త్రోవ మలుపు ఉగాది—

అమావాస్యైనా ఉగాదైనా ఒక బిందువు
అది ఎప్పుడూ కదిలేది-స్థిరమైంది కానేకాదు

ఉషస్సునుంచి మరో ఉషస్సుదాకా
దివారాత్ర చక్రం పరిభ్రమిస్తూ వున్నది
జడ సముద్రంలో చైతన్యం ప్రజ్వలించి
మనోమయ సర్గగా రూపొందుతున్నది

నలుపూ–ఎరుపూ–తెలుపూ
కలగలుపుగా పులుముకున్న జీవుల
సంక్షుబ్ధ సంక్లిష్టనిర్లక్ష్య భావనాదళ–
మనస్సునుంచి ఎగురనీయదు–అయినా
అనూహ్య పథాన నడక సాగుతూనే ఉన్నది.

పరిణామానికి మృత్యువు విరోధి
జీవితంలో సజీవమైన మృత్యువు–భయం
రాబోయేది నరకమో స్వర్గమో–
ఉన్న లోకం చాలు–సగం బ్రతుకుతున్న శవాలకు

తనలోనుండి పుట్టిన లెక్క–లేనన్ని రేఖలు
అల్లుకుంటున్నాయి చుట్టూ అనంత వలయాలు–
ఒకదానికన్నా మరోటి దూరం దూరం
ఒకదానికన్నా మరోటి మరీ విశాలం.

ఈ పరిధిలో రోజూ ఎదిగే లక్ష బిందువుల్లో
ఒక్కొక్కటీ తనకు తానే కేంద్రబిందువు
తనచుట్టూ తిరుగుతున్నాయి ఈ వలయాలూ–
తనకోసం ఎదుగుతూంది ఈ పరిధి–

వలయాలను ఆవరిస్తూ ఎదుగుతారు తామై
జ్యోతిర్మయ జీవులు క్షణం క్షణం–
వలయాలను తమలోకి కుంచించుకుంటారు తామె
తమోమయ జీవులు అనుక్షణం–

ఈ చేతన సమిష్టి అనంతం వైపుగా సుదీర్ఘప్రయాణం–
దారి తప్పడం, లక్ష్యం మరచిపోవడం కద్దు–
అంతస్సులో మేల్కొనే ఆనందరేఖ అప్పుడప్పుడూ
మళ్లీ త్రోవలో పెడుతుంది, మరోసారి హెచ్చరిస్తుంది.

జారిపోయేది జారిపోతూనే ఉంది
రాలిపోయేది రాలిపోతూనే ఉంది
కాని మిగిలేది పరివేషాలు కావు
నిజంగా – నీవూ, నేనూ.

ఒక వ్యవస్థకూ పరిస్థితికీ కాదు నీవు దాసుడివి
ఒక సిద్ధాంతానికీ అనుబద్ధతకూ కాదు నీవు పల్లకివి
నీ త్రోవ నీది – ఎలాగు సాగిపోకతప్పదు.
సహజంగా కుబుసాలు జారిపోవాలి నిరంతరంగా
కావి మనస్సు బాధ పడొచ్చు జీర్ణమైన వేషం జారినప్పుడు.

ఏ రంగూ ఏ ఒక్కడి సొమ్మూ కాదు
తెలుపు అంతటిలోను ప్రవర్తిస్తోంది కనుక–
మంచితనం ఏ వ్యవస్థా గుత్త స్వభావంకాదు
అది మనిషి ఆత్మలో వెల్గుతుంది కనుక–
ఏ జండా జీవన సంపూర్ణత గ్యారంటీ చేయదు
అన్నీ మృత్యువు నీడలో పుట్టాయి కనుక–
సంకెళ్లలో మన యాత్ర సాగదు
కదల్లేకపోవడమే మృత్యువు.

పొరలు పొరలు క్రమంగా తొలగిపోయి
స్వచ్ఛమైన సూర్యకిరణంలా సాగిపోయే నీవు–
అనంతత్వద్వారాలు భగ్గున తెరుచుకునే వేళ
మనస్సుకూ విశ్వచేతనకూ మళ్లీ ముడిపడే వేళ
అచింత్య సౌందర్య జ్వాలాతోరణ వెలిగే వేళ
ఎదురు చూచే ఆ వేళ– తప్పక సాక్షత్కరిస్తుంది,

— సుప్రసన్న

విరుద్యోగి స్వగతం

ఈ అధోలోకం నుంచి
అమావాస్య చీకట్లు చించి
బయటపడే మార్గంకోసం
ఒక గవేషణ

నాకేం కావాలో నాకే తెలియదు
అందమైన అమ్మాయి
సలోమి పౌలోమి కావాలో
ధనం కావాలో ఉద్యోగం కావాలో
చనిపోతే సుఖంగా ఉంటుందో
చిరకాలం బ్రతికి చేసేదేమిటి
నాకే తెలియని వింత మానసిక పరిస్థితి.

మానవుడు చిరంజీవి అంటారు.
మానవ విజయాన్ని
పొగడుతారు
కాని నాకు తెలుసు కలలు నిజం కావని
జీవితానికి అర్థంలేదని
శ్రమ ఫలితం కన్పించదని

తాజమహల్ సౌందర్యం ఒక అబద్ధం
సారూయన్ కథల సొగసు
టాగూర్ కవిత్వంలో ఆధ్యాత్మిక

పరిమళాల గుబాళింపులు
ఇవన్నీ విజంగా ఉన్నాయంటావా ?

ఉద్యోగి మాత్రం
వితాంత వైభవోజ్వలుడా ?

విరంతరానందం ఎక్కడ వుంది ?
అందరి బ్రతుకులూ ఒకవిధంగానే వున్నాయి
ఎవడు సుఖపడుతున్నాడు ఈ భువిపై ?
వరువి మస్తిష్కమొక తమస్సముద్రం
కురుక్షేత్ర యుద్ధరంగం

మల్లికాప్రసూనం కంటే
భద్రగజం దంతం కంటే
శరత్కాల మేఘం కంటే
తెల్లనైన కుక్కపిల్లి
మనకంటే ఎంతో నయం
దాని కాలోచనలు రావు
దానికి సమస్యలు లేవు.

చీకటి దుఃఖం కరువూ కాటకం
లేని దేశం ఎక్కడ వుంది ?
సదా అమృతం వెల్లువూ వున్న
రమ్య బృందావన మెక్కడ వుంది ?

— గోపాల చక్రవర్తి

కన్నీళ్ళ కడవ

కన్నీళ్ల కడవ నెత్తిన పెట్టుకొని
తడుస్తూ, జడుస్తూ నడుస్తున్నాడు మనిషి
ఆకాశం చిల్లులు పడ్డట్టు కుండపోతగా
ఆశ్రువర్షం కురుస్తూనే వుంది.

మస్తిష్కం నిండా అజ్ఞానం దట్టించి
విద్యాలయంలో తిష్ఠవేశాడు వానరుడు
స్వస్తివాచకాలు, స్వాగతగీతాలు పలుకుతూ
మనీషిలోకం బ్రహ్మరథం పడుతూనేవుంది.

మరణించిన మానవతకోసం విలపిస్తూ
సంతాపం ప్రకటిస్తున్నారు దానవులు
మేళతాళాలతో పూజాపురస్కారాలతో
వీధికో గుడి వెలుస్తూనే వుంది.

విన్నటిదాకా నాస్తికత్వాన్ని బోధించి గంభీరంగా
నేడు ఇందిరామందిరం చేరుకున్నాడు భక్తిపురస్సరంగా
పాతమనిషిలో సరికొత్తమార్పుని చూచి
భాగవతులూ భజనపరులూ హర్షం ప్రకటిస్తూనే వున్నారు.

— డానకీ జాని

నాదోత్సవంలో

శంఖారావం
హృదయంలో వెలుగులను
బ్రహ్మరంధ్రంలోని నాడుల వరకూ
విటారుగా చిమ్ముతుంది
చిచుబుడ్డిలా ।

కోయిల గానం
కుహూ కుహూలతో
ఒక్కొమెట్టూ నెక్కుతుంటే
హృదయం పైకిసాగి
సుందర రోచుల్ని విరజిమ్ముతుంది
తారా జువ్వలా ।

ఈదురు గాలి
కిటికీ సందుల్లోంచి
రహస్యనాదంగా ప్రవేశించి
ఆనంద జలధారల్ని
శిఖరాల నుండి
పారబోసుంది
మతాబాలా ।

శయనించిన
తలుపుల్ని తట్టిన చప్పుడు
గదిలో పేలుతుంది
టౌటులా ।

క్రాస్
చీకటిలో
ఆ కీచురాయి పాటేమిటి ?
ఆకురాయిలా అరగదీస్తుంది గుండెల్ని ;
బలపం మొనలో అద్దుతగిలిన
గులకరాతి పంటితో వార్చిస్తున్నట్లు
దాని గరగరలు వింటూంటే
పలు వరునలు జివ్వున లాగుతాయి ;

— కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

హాలేబీడులో నేను....

శివపాదము నుంచ నేను శిలనైనను కారాదా ;
కైలాసపు సామి మరల కలనైనను రారాదా ;

పూవునైన కాబోనా ; పూజకైనా నే లేనా ;
కలత కనుల కరిగి-ప్రభువు కభిషేకము కారాదా ;

పలుక లేని రాయికాను-పలుకులందు రాయలేను
మూగి గుండెలోతులలో-మూలనేవో గుసగుసలై
చెప్పలేని మమతలాచు-చెదరిపోవు నెచ్చటికో ;

ఊహ పులగు లెక్కడికో ; ఒకనీకై ఎగిరిపోగా
గూటిలోని మసక దివ్వె-కొంచమౌచు కునికిపోగా
కంటిపాప గంట వినును-మింటిదారి నందెనేమొ ;

ఎదసీ చిరుగజ్జెమ్రోత-చెవులేమో డమరుకలై
వెలుగు దారి వినువీధిని- కనులేగును నీ కొరకై

మబ్బువెంట-మలుపువెంట-మనసులోని పిలుపు వెంట
నీవే నీవే మృత్యుంజయ ! విలిచిపోగ రారాదా ?

శివ పాదము నుంచ నేను శిలనై నను కారాదా ?
కైలాసపు సామి మరల కలనై నను రారాదా ?

— అరిపిరాల విశ్వం

ఎత్తిపట్టిన పిడికిలిలోని రహస్యం

వాడు :
వట్టి పిచ్చివాడు
వాణ్ణి గూర్చి వ్యాఖ్యానించలేను
వర్ణిస్తాను విను :

మధ్యాహ్నంలోకి నడుస్తున్న ఉదయంలాగ
కళ్లలోంచి నిప్పులు చెరుగుకుంటూ
ముళ్ల కంచెల్లోంచి,
రాళ్లలోంచి రప్పల్లోంచి,
పల్లెలలోంచి, పట్టణాల్లోంచి
నడుస్తాడు సమస్యల
జ్వాలా తోరణాల్లోకి
వాడు నడిచిన చోటల్లా
అడుగు జాడలు మెరుస్తాయి.

వాడి మాటలూ, చేతలూ
వాడిగా, వింతగా ఉంటాయి.

కాలి కమిరి కంపుకొడుతున్న, ఈ
గాలిని అమాంతం మింగి
కొత్త గాలి నింపుతానంటాడు.

సమాజ పుస్తకంలో కొన్ని
పుటల్ని మారుస్తానంటాడు
శతుర్వి ఏ రూపంలో ఉన్నా
పుట మారుస్తానంటాడు.

చీకటి నల్లగానే కాదు
ఎర్రగా, పచ్చగా కనిపిస్తూ
ఎన్నో రంగుల్లో ఉంటుందంటాడు.

బురఖాల్తో దూరంగా పోతున్నా నీడల్ని
మురకచూసి ముక్కు విరుస్తాడు
ముసుగుల్ని చీల్చుస్తానంటాడు.

మణికాంతుల హరిణాన్ని చూసి
మారీచుడా ! గుర్తు పట్టానంటాడు.

బోర్లా పడుకున్న వాణ్ణి
పూస బొక్కలమీద తన్ని
గల్లా పట్టుక ఊపి, లేపి
కళ్లలోకి వేడి చూపు జొన్పి
సూటిగా సూర్యుణ్ణి చూపి
చకచకా సాగిపోతాడు.

ఎవరైనా ఆపి
ఏమిటిది ? అంటే
మేల్కొల్పడానికే తాను పుట్టానంటాడు.

గోవుల వద్దకూ, గొర్రెల వద్దకూ వెళ్లి
మిమ్మల్ని అమ్మేవాడు
మిమ్మల్ని చంపుక తినేవాడు
మీకు పాలకుడు కాడంటాడు.

నువ్వు తిరుగుబాటుదారువా ; అంటే
విరగబడి నవ్వుతాడు
స్వేచ్ఛ నీకూ, నాకూ
అందరికీ జన్మహక్కంటాడు.

కన్నీరు, నెత్తురూ, స్వేదం
కలిపి కొత్త టానిక్ తయారు చేశానంటాడు.
వాటి పరస్పర పరిణామ దశల్ని గూర్చి
పరిశోధించానంటాడు శ్రద్ధగా.

తాను చావును కావులించుకు పడుకుంటే
తన వేడిని భరించలేక వెళ్లిపోయిందంటాడు.

దేశమే తాను, తానే దేశమంటాడు
లోకం తన యిల్లంటాడు.

ఎత్తిపట్టిన పిడికిలిలో
ఏం దాచి ఉంచాడో తెలీక
బొంబుందంటారు కొందరు
కాదు. ఫిట్సంటారు కొందరు.

అదేదీ కాదని నాకు తెలుసు
ఆ రహస్యం నీకు చెప్పదలచుకోలేదు.

పెద్దలలో కొందరికి వాడంటే భయం
రాగానే కసురుకుంటారు

పక్కలో బల్లెం చూచినట్లు
పక్కకి తప్పుకుంటారు.

పిల్లలకి వాడంటే బెల్లం
రాగానే ముసురుకుంటారు.
అందర్నీ కూడగట్టుకుని
అలా మైదానంలోకి వెడతాడు
అక్కడేం చెబుతాడో తెలియను కాని,

ఎత్తి పట్టిన పిడికిళ్లతో, పిల్లలంతా
ఎదురుగా వస్తూ కనిపిస్తారు.

— వే. నరసింహారెడ్డి

నన్ను పశువుగా చిరకాలం ఉంచలేవు

ఓపిక కొన ఊపిరిదాకా ఎదురుచూచి ఎదురుచూచి
అన్నుపట్టిన నా ప్రాణాలను, అదిమిపట్టి బ్రతికున్న నాకు
ఆదృతి కావాలి నా ఆకలి తీరాలి
అసలే అలిసిఉన్న నన్ను విసిగించి
ఉడికించి ఉసికొల్పి చంపకు.

ఎంగిలి దానం తిననేర్పి నేర్పి-చేతులు కదిపే అలవాటు మాన్పి
నన్ను చంపి నా ఎముకలతో నీ పీఠానికి కాళ్లు చేసుకోకు
నీ నినాదాలకు నన్ను బలివెయ్యకు
నీది తినమరిగిన ఉపవాసం నా ఆకలిరుచి గ్రహించలేదు
బ్రతక నేర్పిన నీ చలోక్తులు నీ పంటిన నా కడుపున దూరవు

ఎంగిలి అలా వెదజల్లకు-పంచకు
లొత్తులైన నా చూపులకు
మెతుకులు కన్పించవు-నా కుతి తీర్చవు.

నీ దొక మహా తెలివని తెలుసు
చరల ఊడిగంలో బ్రతికిన వాడివి
నాకున్న పరువులోతు గ్రహించలేవు
నా పేద మనసు తెలుసుకోలేవు.

నీ కన్నుల కాటే ధారలు అహంకార రుధిర ధారలు
నీ దయతో పనిలేదు నాకు-మాటలతో మతిపోదు నాకు,
నా రెండు చేతులు కదలాడి తినిపించే దొక్క కడుపు
ఈ చేతులు కదిలే దారిరి అడ్డురాళ్లు పాతకుంటే చాలు నాకు
నా స్వేదానికి విలువకట్టే హక్కు నాది-దాన్ని దోచుకోకు
నా కష్టానికి నెలవువెదికే స్వేచ్ఛ నాది, అడ్డురాకు నాకు.

పేద తనాన్ని-రక్తనదాన్ని-ఆకలి బాధను-ఆక్రోశాన్ని
స్వంత ఆస్తిగా వాడుకోకు బేరపు సరుకులుగా చేసుకోకు
నా కోసం నడుస్తానంటూనే నీ బిరువును నా నెత్తిన పెట్టావు
పలురకాల ఏ వికృత స్వరాలకు స్వరంతిత్తిగా నన్ను వాడావు
నా బాధల గాధను నీ గీతంగా ఎవడికో అంకితమిచ్చావు.

ఇహ నీ కలంలో నా కన్నీళ్లను సిరాగా పోసుకోలేవు
నా బ్రతుకును నీ కవితకు కాగితంగా చేసుకోలేవు
నా గుండెచిమ్మిన రక్తంలో తడిపిన నీ జండాను
నా కొరకంటూ నా నెత్తిన ఎగుర వెయ్యలేవు
గ్లిజరిన్ కన్నీళ్లు అర్భకుని స్వేదాలు కురిసి
చివరికి మా సమాధులపై రాజ్యం నెలకొల్పే
నీ వ్యూహాన్నిక్కడ సాధించలేవు

ఇహమీద నన్ను లాలించలేవు
నన్ను పశువుగా చిరకాలం ఉంచలేవు
నా పేదతనం వస్తువుగా సాగే నీ కవితను
బ్రతికించు కునేందుకు
కలకాలం నన్ను 'గరీబుగాణ్ణి'గా ఉంచలేవు
నా ఆత్మకు ఉరిశిక్ష విధించలేవు.

— భండారు సదాశివరావు

యుగాని కొక పూర్ణిమ

పాపం
అదే నా ఆకాశం
యుగానికొక పూర్ణిమ
యుగమంతా అమావాస్య
గట్టెక్కలేని అలలా అదెప్పుడూ ఇక్కడే
దిశలను విమురుతూ ఉంటుంది
దాని అరికాళ్ళలో ఎప్పుడూ గుచ్చుకుంటూ ఉండే
నక్షత్రాలే—

అదంటే చాలా జాలి నాకు
నా సుదీర్ఘ స్వప్నాలను దానికి రెక్కల్లా తగిలించాను
ఎటేనా ఎగిరిపొమ్మని:
అయినా అదెప్పుడూ ఇక్కడే ఉండిపోతుంది
అస్థిపంజరంలో చిక్కిన హృదయంలా ... ...

దారి తప్పి తోటను ప్రవేశించిన వసంతరాగాలు
చెట్ల మీదికి ఏవేవో రంగులను

ముద్దలు ముద్దలుగా వెదజల్లాయి
చెవిలో ఏమేమో గుసగుస లాడాయి;

నా చేతిలోనూ ఒక పువ్వు ఉంది
ముద్దగా వికసించిన దాని రెక్కలెంత భారంగా
వంగి పోతున్నాయో చూడు!

ఏమి నేర్చుకోకుండానే ఆమెకు నేను ప్రేమను నేర్పబోయాను
ఏదీ తెలీకుండా ఆమె నాకు నిరీక్షను విధించిపోయింది!

పాపం
ఇదే నా ఆకాశం
యుగానికొక పూర్ణిమ
యుగమంతా అమావాస్య.

— వనమాలి

చంద్రసూక్తం

వెన్నెల కురుస్తోంది
అమృతంలాంటి వెన్నెల!
భూమిని ముంచి దిక్కులకు పొంగి
కిందికి పాలవాకలా జారుతోంది!

ఉత్తుంగ తరంగరాశీ తీరస్థ పృథు శిలాగ్ర స్పర్శనంచేసి
అంచుల వెంబడి నురుగుల గక్కుతూ జారినట్లు
వెన్నెల కురుస్తోంది.

తాగినంత తాగి, మత్తెక్కి
అక్షయంగా ఊరే ఆ వెన్నెలను
ఒళ్ళంతా పులుముకొని పరవశిస్తోంది జగత్తు
నిర్మలిన ధవళగోళంలా స్వచ్ఛంగా మెరుస్తూ
సదా శివత్వాన్ని పొందిరహిస్తోంది
అప్సరసలాంటి వెన్నెల హాయలు చూడనైనా చూడక
కవి చంద్రుడి మీద కవిత్వం వ్రాసుకుంటున్నాడు
మోహినిలాంటి వెన్నెల కవ్విస్తూ ఉండగా
తలవంచుకొని చకచక వ్రాసుకుంటున్నాడు
చంద్రుడి మీద కవిత్వం.

శశీ!
గ్రహరాజ దత్తాల్పరుచీ!
నిన్నింక శశాంకుడనరాదు
హరజటా జూట కోటీరస్థగిత దివ్యమణివి కావు నీవు
క్షీర సాగర మధనావసర నవనీత రాశివి కానేకావు
కలువలు నీను కని విరిసేది కల్లి
చెలువలు నీకు చెదిరి తొలిగేది యిల్లి
నీవు మట్టి ముద్దవు
జీవదీపకళికల్ని దేదీప్యంగా వెలిగించే
ప్రాణ పవనం లేని మృతలోష్ట ఖండానివి
నీ మీద రవ్వంత వెలుగులో
జీవ ద్రవ్యాన్ని మాడ్చి మసిచేసే ఉష్ణతీవ్రత
కాస్తంత నీడకో కవోష్ణ రుధిరాన్ని శైతం
కరడుగట్టించి మనుషుల్ని మంచుబొమ్మల్ని చేసే ఉగ్ర శైత్యం
నీవు అస్పృశ్యుడవు
స్ఫోటక చిహ్నితమైన భవన్ముఖోపమానాన్ని
బహిష్కరిస్తున్నాను

రాజబింబాననల్నీ రాకా చంద్రముఖుల్నీ
నా శబ్దకోశం నుండి వెడల నడుస్తున్నాను
ఆకాశంలో చందమామ అదే పనిగా నవ్వుతున్నాడు
మొన్న మొన్న గరుడ పక్షి అచ్చొత్తిన కాలిగుర్తు
అందంగా మెరిసిస్తూ అది పనిగా నవ్వుతున్నాడు
చంద్రహాసం సందేశంగా అల్లుకుంటోంది.

శూన్యం నుంచి గాలిపొరల్లోకి
గాలి ద్వారా మనుషుల గుండెల అరల్లోకి
సుతారంగా చేరుకుంటోంది
సుధాధాముని సందేశం.

* * *

నన్ను బహిష్కరించి నిన్ను నీవు చిన్నపుచ్చుకోకు
నేను నీ మామను
సమస్యల సముద్రంలో నిలువు మునుకలు వేసే
నరుల పాలిటి నావను ;

నీ తల్లీ నేనూ ఒక్కతానులో గుడ్డలం
ఒకే కేంద్రాన్ని చుట్టే సదృశ వర్తనులం
ఆకలి, దిగులు భయం అన్నీ మర్చిపోయిరండి
అసూయ, ద్వేషం క్రౌర్యం అక్కడే పాతిపెట్టి రండి

వేషాలు కావేషాలు విడిచి
అంతస్తులూ అడ్డుగోడలూ దిగద్రొక్కి
మెరసి ఉల్లాసంగా పైకెగసి రండి
ఇలా నా దగ్గరకు రండి ;

మీ రాకలో నిలువెల్లా
ప్రాణపవనాలు విజృంభిస్తాయి

జీవ జలాలు పొంగి పొర్లుతాయి
సమశీతల మధురోష్ణత సమకూడుతుంది.
ఉత్సంగతలం నిండి
ముత్పులకలు విరసిన తనువుకు
సస్యశ్యామల రమ్యత్వం
దానంతటదే ఒనగూడుతుంది
వింటున్నావా కవివరా!

వా ఆంతర్యం.
అర్థం చేసుకుంటున్నావా!

*　　*　　*

ఆకాశంలో చందమామ
అదే పనిగా నవ్వుతున్నాడు
చందమామ సందేశం
శూన్యం నుంచి గాలి పొరల్లోకి—
గాలిద్వారా
మనుషుల గుండెల అరల్లోకి
మూటగా ప్రసరిస్తోంది.

— నాయని కృష్ణకుమారి

సహగమన సీమంతిని

నను సింగారించినారు
చివరిసారి లోకముతో

ఈ వేళ నేను గలియుదు
నిజమ నా దేహముతో నా విభునవి

ఒక బొమ్మను గంగలోన
కలాపబోవు నప్పుడు
చేనెడి శృంగారము వలె
నా మోమున తిలకము నదినారు
చివరిసారి నా నశ్వర సౌభాగ్యము
చూడనేమొ మీరందరు.

నేనీ సవారి నెక్కితి
జగము ముందు కడసారిగ
నను జూచిపోవు వేరటాండ్రు
రా రండూ!

నేమగని గలియ బోవుచుంటి
నా సింగారము నా తిలకము
నా కౌశేయ వసన మందెలు ముక్కర
నా నుదుటి రేఖ కుంకుమలూ
చెరిగి పోవు
నే నా చితిలో దుముకు వేళ

నను సింగారించినారు
నా కీ సొమ్ములేల
నా కుంకుమ కౌశేయ వసన
మా కలయికలో మాయమగును
పై పై తొడవులేల?

ప్రియుని గలియు వేళ
నగ్న సహజముగ నుంట గాక

ఈ లోకమేల: ఈ జనులెందుకు:
విర్మానుష్యముగా నుంట దప్ప.

ఈ లోకములో నేనుంటివి
ఇన్నాళ్లగాని ఏ యొక్కనాడు
నా మగని తోడ పలుకలేదు
లోకము వారలు తిరుగుచుండ
నాకు నడుమ వాని వడుమ
మా ఇర్వురకు సిగ్గగు నెప్పుడు

ఒక ఇంటిలోవె ఉన్నారము
ఒకరి మోము ఒక రొక్కరము
స్పష్టముగా నెరుగము
మోమోటము మా స్పర్శ సుఖము
మోమోటము మా ఆలింగనము
శ్వశుర శ్వశ్రూ పరివార మధ్యమున
ఏదో కాపుర మవిపించినాము.

ఆయన ఏదో చెప్పు తమిని
ఆక్రమించు నయ్యెవేళల
ఎవరో వచ్చెది వారు నడుమ
ఈ తగులాటము లేలా మాకని
వేడే ఏగుచుంటి మా దేశము
ఈ గృహమున కది అతిదూరము
ఈ బంధు జనులు
ఏ ఒక్కరుండ రేకాంతము.

కడసారిగ చూడ విండు
ముగుదలార: మీ మోములు

క్రొత్తగ నున్నది ఈ రోజున
మీరు విజము సంసారము
చేయుచుంటిరో ; భ్రమలో నుంటిరో ?

మీ భర్తలు, మిమ్ముల గలయ లేక
ఎకడెక్కడ విధురులుగా
తిరుగు చుండిరో నా కనిపించును
వారందర నొక కన్నున
మీరందర నొక కన్నున
కాంచుచుంటి ఆ యడుగులు
మీకేమాత్రము విన్పింపవు.

వారెక్కడనో మీరెక్కడనో ;
మీ కష్యలు మీవే యనుకొని
కలసి రాత్రిలో కరిగిన భారము
వీదికొంచు మేల్కాంతురు
అవి యన్నియు నా కనిపించును
విజము మీకు కలలే పతులా.

కలలో మురిపి మురిసి
మా భర్తలు మా కుండిరి యని
గర్వించుచుంటి రయ్యో ! భ్రమ
మీ భ్రమపై నే రోదింతును
మీ రోదనలన్ని మాంగళ్య గీతులై
నన్ను సాగనంప వచ్చెడు
దూతిక లైనవొ
నా సవారి మోయగ పరుగెత్తెడి బోయాలో ?

నా ఉత్సవంబు తిలకింపగ వచ్చిన
దుర్వార్తలొ, అపరాలొ

నేనేగుచుంటి, మీరును
మీ భర్తలు గలయుంగ రండు
నా స్థితియే త్వరలో మీకు గలుగు

నను సింగారించినారు
చివరిసారి లోకములో.

— దుర్గానంద్

మండే సూర్యుడు

నేను చెమట బిందువును
కండల కొండల్లో ఉదయించే లోకబంధువుని
గుండెలతో నాకు దోస్తీ
నేనుండేది బాధల బస్తీ
సింధువంత చరిత్ర నా పిడికిట్లో ఉన్నా
చెప్పకుండా మనిషిని చెక్కిన శిల్పిని

వెళ్లిన పశులగుంపులు వెనక్కి రాలేదని
ఆక్రోశిస్తున్న అడవుల్లో
చిక్కటి నక్షత్రాలు కలుపుకుని
చీకట్లు ఆస్వాదిస్తున్నా
స్మృతులలో అల్లిన పైటచెరగు పట్టుకుని
నా దేశం పాదాలు పెనవేసుకుంటున్నా

చెట్టుకు వ్రేలాడిన శిరసులు పూస్తున్నయ్
కొమ్మల్లో పూలై.

గోలీ దూరిన గుండెలా కదులుతున్నాయ్
గుడిలో గంటలై
ఎందరు ఎన్ని రాత్రులు రక్తం పిండి ఇచ్చారో
ఈ దినం కోసం
మన పంచల మంచుబిందువులై ప్రేలాడుతున్నారు

ఇదిగో నాది ఇనప పిడికిలి
కాలపు కఠినశిలల్లోంచి కాంతిజ్వాల
త్రవ్వి తీస్తా

ఎదిరించే శతాబ్దాల నిదురకు
విప్పుంటిస్తా
సముద్రాల విరహంతో పరుగులెత్తే నదుల్ని
ఆగండని కేక వేస్తా

ఈ రంగుల్లే బంజర్లకు అకుపచ్చ
పులమ మంటా
దేశంనించి పారిపోయిన నవ్వుని
తిరిగి రమ్మని ఆహ్వానిస్తా

పువ్వుకోసం వెతుక్కుంటున్న
సీతాకోకచిలుక్కి ఒక
పూలతోట యిస్తా

పిల్లల్ని రాత్రిముక్కాలా
వెన్నెల్లో ముంచుకుని
కొరుక్కుంటూ తినమంటా
సూర్యుడు ఈ శుభదినాన్ని
మోసం చెయ్యనివ్వను
ఈ దేశపు ప్రాచీరేఖమీద

సూర్యుడు
ఉదయించకపోతే
మండే నా గుండె చీల్చి
ఎర్రటి నా కండలతో
ఎండలు కాయిస్తా ... ...

— గుంటూరు శేషేంద్రశర్మ

రాజీవ గీతం

వింగి ఆవులించి
నేలను కౌగిలించిన వేళ
మనకు కవిపించవి చోట
మహి– మహాకాశాన్ని చుంబించిన వేళ

మంచు కంచుకం పికిలిన వేళ
మంచి దానిమ్మ పెకలిన వేళ
నదీచేలం తొలగిన వేళ
నవయవ్వనం రివ్వుమన్న వేళ
చైతన్యం నకల దిశల
గీతం వినిపిస్తున్నది

అంతా నడిచే దారి వదిలేసి
అంతులేని అడవిలో పడిపోయి
వింత మూలికలు కనుగొని
ముళ్లు గుచ్చుకొని
రాళ్ళు కొట్టుకొని

మూలిగే కాళ్ళ
రక్త రాజీవ గీతం!
రమణీయ చైతన్యోపేతం!

నేను—నింగీ నేలా పొంగి పొరలే
విశ్వబ్ధితీరం పట్టికుంటాను
అక్కడ ఇల్లు కట్టుకుంటాను

పరువం పొంగే తరుణీ నయనాలలోని
వెచ్చదనాన్ని పచ్చదంలా కప్పుకుంటాను
ఓంటరివాని జీవితంలో
కుంటుతున్న కాలాన్నీ
పిరికివారిలా పారిపోయే
దేవతల్నీ నేను మెచ్చుకోలేను

తెగిన రెక్కల విమానంకన్న
తెగించి ముందుకు సాగే విహంగం మిన్న
డబ్బు రుబ్బురాయి కింద నలిగే
డాబుసరీ సమాజం కన్న
రెక్కాడితే దొక్కాడే
విరుపేదల నిండుగుండె మిన్న

గడియారం నడవని
పాత కోట గోడకన్న
సూర్యుణ్ణి ఉరికించే
ఫ్యాక్టరీ కూత మిన్న

చలనం లేని
జ్వలనం లేని
వికసనం లేని
వినాయకుల కన్న

కుషి కోసం కషిను పెంచుకోక
రషిణ పేరిట భక్షిణ సాగించక
భిక్ష కోరినవాణ్ణి శిక్షించక
నషిత్రాల్ని అందుకునే 'పషీ' మిన్న

ఆ పషీ పషాల పయనం
ఈ కమనీయ కవనం.

— దాశరథి

కవితా సరస్వతి

మరల యాతన మొదలయ్యె మరల కన్నుల
కొక్క గాలింపు మొదలయ్యె. ఊపిరంత
కనుల బిగబట్టుకొని గుండె గాడిపడ్డ
ఈ ఘటమ్మును నెట్టుచు నేగుదేను.

మరల తిరుగుడు మొదలయ్యె, మరల కనుల
కెదురు చూపులకు మొదలు, చెదురు గుండె
మరల ఆగుటకు మొదలు, మరల మొదలు
దేనికై తపియింతునో దాని యలుక.

ఉరుము ఉరిమినది, మెరుము మెరిసినది, చె
లీ: పలుకలేదు నవ్వును లేదు సీవు
వాన వెలసినది వరద పారినది, చె
లీ: కదలలేను పాడగా లేను నేను.

రనము తొణకినది, వలపు రగిలినది చె
లీ! కదల లేదు కదుపగా లేదు సీవు
కరుణ మొలికినది కనుల నొరిగినది చె
లీ ! పలుక లేను పలికింపగా లేను నేను.

ఒక్క చిరునవ్వు కోసమై ఉగ్గబట్టి
ఒక్క కడకంటి చూపునై ఊపిరాగి
ఒక్క చక్కిలిగింతనై ఉన్నదంత
ముడుపు గట్టితినే చక్కనడుగులందు.

నేతువునుండి శీతనగసీమల దాకను మా కనుంగవల్
మూతలువడ్డ పాడు దినముల్ గతియించె, సమస్త భారతీ
చేతన మొక్క జాగృతికి చేరిన నాటి స్వతంత్రకాంతి సం
ఘాతములో వెలింగిన అఖండ చిరంతన మాతృతేజమా !

నావలె ఎందరెందరిని నమ్మిరొ విన్ను ముహూర్తకాలమే
నీ విరహానలచ్ఛటల కింధనమైన యెడందలన్ నిదా
ఘావసరప్రయాణ జలకాంక్షులుగా మహదూషరాన జ్యో
త్స్నావళయీకృతాబ్జనయనా ! స్మరియింతువె వారి నెప్పుడేన్.

అలనాడీవయి నీవు వచ్చి మహదాప్యాయమ్ముతో నేస్త మ
ట్టుల కైకై కొని వెంట రాగ నవనాడుల్ చందనమ్మందు చిం
దులు ద్రొక్కన్ దనువంత తేలికయి ఏదో క్రొత్త లోకాల చు
క్కలలో సూర్యునిలోన చందురునిలో కల్పాంత మున్నట్లయెన్.

నా కవితా సరస్వతికి నాలుక లేదొక గుండెదక్క, మే
లా కనుచూపు లే దలుక లావగు నక్షువుతక్క తాను తా
నై కదలంగ లే దొకరి యాసర వెంబడి దక్క ఇంక ఏ
సాకును జూపి తాను మనజాలునొ నల్వురి నోటిముత్యమై.

ఎవడైన నేమి నిన్నెప్పు డెదలోన పవళించు దాని
భువనాల భుభము గూర్పంగ పొమ్మ్మచి గదుమువాడు కవి—
పవనాస్త్ర ఆహూతిచేసి సర్వమ్ము. స్వర్గమ్ము మాత్ర
మెవడేలుకొనునని దులిపి ఏగు శతక్రతువు కవి.

ఇల ఆనందరసప్రవాహముల కంతేలేదు చిన్నారి దో
పిలితో ఎంతని త్రావనోపుదుము. మా చిన్నారి కన్నాల రె
ప్పలతో నీ బహు కాంతిపుంజముల సంబాళింతు మేలాగు మా
మలినోద్యాన మనశకవాటముల అమ్మా! యెప్పుడూడ్పింతువో.

— అనుముల కృష్ణమూర్తి

అనుభవం

దారి పొడుగునా
నది కొకటే పేరు
పై నెక్కడో మహారాష్ట్రలోనూ
మన బెజవాడలోనూ
నది కొకటే పేరు

కృష్ణానది పొడుగునా ఒక
చిలుకదండు వెడలి, పక్కనున్న
జామతోటలో వాల్తుంది
నిద్రలో రాత్రంతా వివస్త్రయైన మనసు
మళ్లా లుంగలు చుట్టుకొని సర్దుకుంటుంది పైట
మహాబలిపురం నుండి మన బెజవాడ వరకు
అలల తెప్పలమీద సూర్యుడు

కాళ్లూ చేతుల్తో ప్రాకుతుండేప్పటికి
బాలార్కుడికీ లాలస
ప్రౌఢ నదికీ లాలస

పై నెక్కడో నాసికలోనో, మరెక్కడో
కొండలకి మబ్బుల కపోలాలు తగిలి
ఇక్కడి వధూధరాల మధువు చిందుతుంది
దాన్తోనే మన కాల్వ కింద చేలు పండుతయ్

ఆనంద నదీదేహం పులకించినంత ప్రదేశమూ
మనం తెరచాప లెత్తుకుని పాటలు పాడుకుంటూ
పడవలమీదలాంచీలమీదప్రయాణమైవెళ్తుంటాం
భద్రాచలం నుండి రాజమండ్రీ వరకూ
అలానే వెళ్లొచ్చు గోదావరీ అయినా

ఊహకందని, ఊపిరిసల్పని, దిక్కుతోచని
మూడు బుడుంగుల సౌఖ్యం ముంచుతుంది
ఏ సుడిగుండంలోనో, ఎన్నినిలువుల లోతులోనో
మణికర్ణిక మంటలవెలుగు
అంచు నించి తప్పుకో లేరెవరూ
కానీ దారి పొడుగునా నది కొకటే పేరు.

— వేగుంట మోహనప్రసాద్

శారదావిర్భావము

ఆ సంకల్పములైన లోకములు ప
ర్యాధ్మాతముల్, వేణు వీ
ణా సమ్మోహన వాయులీన నినదాం
తర్వ్యక్తి, నాదాబ్ధిమై
ఆకాంతమ్ములు తీర్చగాబడని పూ
ర్ణాకాశ మానాడు సం
ధ్యాసౌవర్ణరుచి ప్రలిప్తమయి, సౌం
దర్యార్చకై పొల్చెనో,

తన పుట్టు పద్మసౌందర్యరేఖల తోడి
తన మేని బంగారుతళుకు పొంగి
తన చుట్టు పాలసంద్రము ఫేనములతోడి
తన సృష్టి భావనార్థము మలంగి
తన తల్లి నేత్రాంత దరహాసములతోడి
తన నైగమాంతవృత్తి వెలింగి
తన చతుర్ముఖవాక్ప్రిధానరాజ్యముతోడి
తనయందు పుష్పేషుధనువు వంగి

అఖిల నాదాంబరస్ఫురత్ హైమరేఖ
క్షీరసాగరవీచికా స్నిగ్ధమూర్తి
అఖిల సౌందర్య లావణ్య హార్ద్రిభావ
ముల కధిష్ఠాత్రి శారద పొలిచినపుడు.

ప్రసర దుదారనాద పరి
పాలితలోకచతుర్దశమ్ము. రా
గసరఉదీర్ణపంకజము
గా వెలుగొందెడి వాణి చూచినన్
అసితసితచ్ఛవుగ్ కనుల
యందములై విరబోసికొన్నచో
విసరిన సృష్టికర్మ్మడయి
వేదజడుం డతడేమి యయ్యెనో!

అమధితవార్ధిపీచి కొస
యందున పొల్చిన చంద్రరేఖయై
అమృతము విందు చేయునొకొ
ఆవృత మృత్యు విభీత ప్రాణి లో
కమునకు తీవెమీటి తన
కచ్ఛపిపై సృజియించు నాదలో
కమున సమస్త రాగ మధు
కొంతలు మర్త్యుల కొగిలింపగన్

ఇది శబ్దమ్మని యందురీ పదము శ
బ్దించెన్ మహాకాశ మం
దిది యర్థమ్మని యందు రీపదము వ్యా
పించెన్ మహాలోక మం
దదియున్ విచ్చెన పైన విచ్చెనయుగా
నారోహణంబుం బొన
ర్చి దయామోహినిః సర్వశుక్ల. ప్రణవ
బ్రహ్మాణి పాదాగ్రమై

తగు నిటువంటి లోకముల
తానయి పొల్చిన దుఃఖ మొక్కటయె

ఇట్లు గ సకలేంద్రియమ్ములను
భూర్తమఃపరిపాలితమ్ములై
తగవి దురూహాలం బడిన
తాకిడిలో మధుమాసికోజ్వల
ప్రసుదయమోహనంబులయి
చలబడున్ భువనంబు లామెచే.

పొలిచిన సర్వభూతముల
పూర్ణ మనోనుభవంబు లెల్ల తీ
రుల విభజించి వావి యవ
రోహణ మార్గములంచు లందు వే
ల్పులు కనరావి సౌఖ్యముల
పొందికగా, కథరీ దృశాంత రో
చుల 'రస' పీథులేలు పద
చుంబిత నైగమమూర్తి పొల్చెదిన్.

— సుప్రసన్న

మహా భారతీ!

ఓ జనతా నతాంజలి వు
రో జ్జ్వల కోష్ణకవోష్ణబాష్ప ధా
రా జలసిక్త పాదకమ
ల ద్వయశోభి మనోజ్ఞదేహ రే
ఖా జయభారతీ! యుగ యు
గమ్ముల పున్నెపుపంటవీవు, నీ

పూజకు తెచ్చినాడ విదే
పొంగిన గుండియ విందు పద్దెముల్.

జండా ఒక్కటి మూడు వన్నెలది, దేశం
బొక్కటే భారతా
ఖండానేతు హిమాచలోర్వర; కవీ
ట్కుండంబు లోనన్ రవీం
ద్రుందొక్కండె కవీంద్రు; డూర్జిత జగ
ద్యుద్ధాలలో శాంతి కో
దండోద్య ద్విజయుండు గాంధి యొకడే
తల్లీ ! మహా భారతీ!

— దాశరథి

కవి పరిచయాలు

★

అయ్యవారు, టి. ఇ. యం: (19-9-1935) బి. ఏ (ఆనర్సు)

రచనలు: పల్నాటి వీరచరిత్రము, ఋతుసంహారము, ఉన్మత్తరాఘవము, ధనంజయ విజయము, మొదలగునవి, పత్రికలలో ఎన్నో ఖండకావ్యములు.

ఆంజనేయశాస్త్రి, పి. యస్. ఆర్. (1928)

రచనలు: గండిపడ్డ జీవితాలు, ఎన్నో కథలు వ్యాసాలు రేడియో నాటికలు.

ఇస్మాయిల్:

రచనలు: చెట్టు నా ఆదర్శం మొదలగునవి.

ఎల్లోరా: గొడవర్తి భాస్కరరావు(1933)

రచనలు: మధుర కవితలు, మన ప్రాచీన కళలు-పుట్టుపూర్వోత్తరాలు, రేపటి వసంతం మొదలగునవి.

కృష్ణకుమారి, నాయని: (14-3-1930) ఎం. ఏ; పిహెచ్. డి.

రచనలు: ఆంధ్రుల కథ, ఆయాథా, గౌతమి, తెలుగు జానపదవీరగాథలు(సిద్ధాంత వ్యాసము). పత్రికలలో వ్యాసములు, కథలు.

కృష్ణమూర్తి. అనుములః ఎం.ఏ

రచనలు: సరస్వతీ సాక్షాత్కారం మొదలగునవి.

కుక్కుటేశ్వరరావు. గాదేపల్లి: (22-8-1937) ఎం. ఏ.

రచనలు: జీర్ణశిల, విజయభేరి మొదలగునవి. అష్టావధానము చేస్తారు.

కోటేశ్వర రావ్, తుమ్మపూడి: ఎం. ఏ., పిహెచ్. డి.

రచనలు: ఆముక్తమాల్యదాసౌందర్యము (సిద్ధాంతవ్యాసం), వసంతోత్సవము, కుందమాల మొదలగునవి.

గోపాలచక్రవర్తి: నడిమింటి వేణుగోపాలశాస్త్రి (1931) బి. ఏ. ఆనర్సు.

రచనలు: కలంకలలు, ఆనందం జీవనది మొదలగునవి. పత్రికలలో ఎన్నో కథలు.

గోపాలరావు, చొదూరి. (15-8-1934)

రచనలు: మల్లిపదాలు, మధుశాల, అభాగిని, రోహిణి మొదలగునవి.

ఘనశ్యామల: కొత్తపల్లి ఘనశ్యామల ప్రసాదరావు, ఎం. ఏ.

రచనలు: పాంచజన్యం (అనువాదం), పత్రికలలో వ్యాసాలు, కవితలు.

జగన్నాథం, పేర్వారం: (23-8-1931) ఎం. ఏ.

రచనలు: సాగరసంగీతం, ఇంద్రియద్యుమ్నియ మనే ప్రబంధానికి సంపాదకత్వం, చేతనావర్త సంపుటాలలో కవితలు మొదలగునవి.

జానకీజాని: సామవేదం జానకీరామశాస్త్రి. (1931) ఎం. ఏ.

రచనలు: మేలుకొన్నవాడి కలలు, పాషాణి, వెన్నెలమెట్లు, మొదలగునవి.

జోగారావు, యస్వీ. (2-10-1928) ఎం. ఏ., పిహెచ్. డి.

రచనలు: ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర (సిద్ధాంత వ్యాసము). పంచకల్యాణి, సప్తతంతువు, ఉపనిషత్తు, అప్సరస, మహాకవి మార్గము, మొదలగునవి. వివిధ పత్రికలలో వ్యాసములు.

తిలక్: చేవరకొండ బాలగంగాధర తిలక్ (1921-1966)

రచనలు: అమృతం కురిసిన రాత్రి, కొన్ని కథల సంపుటులు.

దాశరథి: దాశరథి కృష్ణమాచార్యులు, (1927) బి. ఏ.

రచనలు: అగ్నిధార, మహాంధ్రోదయము, పునర్నవం, మహాబోధి, అమృతాభిషేకము, కవితాపుష్పకము, తిమిరంతో సమరం, గాలిబ్ గీతాలు మొదలగునవి.

దుర్గానంద్: సి. హెచ్. దుర్గానందరాజు (12-1-1927) సాహిత్యరత్న.

రచనలు: అంతర్గోళాలు, మధూలిక, జూనాపర్ణియగాథ, గీతాంజలి, చిరంతన మొదలగునవి.

నరసింహారెడ్డి, వే: (9-6-1939 మృతి 27-1-1973)

ఎం. ఏ; పిహెచ్. డి.

రచనలు: పాల్కురికి సోమనాథుని కృతులు (సిద్ధాంతవ్యాసం), సవిత మొదలగునవి.

నరసింహాచార్యులు, వేముగంటి:

రచనలు: తిక్కన, మణికింకిణి, వేంకటేశ్వరోదాహరణము, మొదలగునవి.

నారాయణరెడ్డి, సి: (జులై 1931) ఎం. ఏ. పిహెచ్. డి.

రచనలు: నాగార్జున సాగరము, కర్పూరవసంతరాయలు, విశ్వనాథ నాయకుడు, జాతిరత్నం, మంటలూ-మానవుడు, ఆధునికాంధ్ర సాహిత్యములో సంప్రదాయము-ప్రయోగము (సిద్ధాంతవ్యాసము). మొదలగునవి.

ప్రసాదరాయకులపతి: పి. వి. యల్. వి. ప్రసాదరావు. (23-1-1937) ఎం. ఏ., పిహెచ్. డి.

రచనలు: రసవాహిని, శివసాహసిక్రి, ఐందీక్రిసాహసిక్రి, అంబికా-సాహసిక్రి, భాగవత విమర్శ (సిద్ధాంతవ్యాసం). మొదలగునవి.

బాపురెడ్డి, జె: (1937) ఎం. ఏ.

రచనలు: బాపురెడ్డి గేయాలు, బాపురెడ్డి పద్యకావ్యాలు, బాపురెడ్డి గద్యకావ్యాలు, బాపురెడ్డి గేయనాటికలు మొదలగునవి.

మోహనప్రసాద్, వేగుంట. ఎం. ఏ.

రచనలు: చితి-చింత, పత్రికలలో వ్యాసాలు, కవితలు మొదలగునవి.

రంగనాథ్, పురాణపండ:

రచసలు: పత్రికారచయిత, పత్రికలలో గేయాలు కథలు.

రంగారావు, మూదిరాజు. (7-12-1935) ఎం. ఏ., పి.హెచ్. డి.

రచనలు: యుగసంకేతం, ఉషఆగమనం, మానవీయం, ముక్తధాత్రి, పడగెత్తిన ఉదయం, వెలుగులో ఈనేల, కవిత్రియము నాచనసోమనల కవితాసిద్ధాంతాలు - శిల్పము [సిద్ధాంతవ్యాసం] మొదలగునవి.

రఘుమారెడ్డి, యెల్లంట: (27-9-1911) ఎం. ఏ; పిహెచ్. డి.

రచనలు: ముత్తిపదాలు, పల్లెపదాల్లో ప్రజాజీవనం [సిద్ధాంతవ్యాసం] పల్లెల్ల పొద్దు పొడిసింది మొదలగునవి.

చాకృష్ణ, పరిగి: (1-7-1937) బి. ఇ

రచనలు: పత్రికలలో అనేకఖండకావ్యాలు.

రాధాకృష్ణశర్మ, చల్లా: [6-1-1929] ఎం. ఏ; పిహెచ్. డి.

రచనలు: తెలుగు విందు, వ్యాసమంజూష, జయించిన జనత, సుబ్రహ్మణ్యభారతి మొదలగునవి.

రామకృష్ణ, మిరియాల: ఎం. ఏ.

రచనలు; స్నేహదేహళి, విద్యుద్వీణలు - వెన్నెలతీగలు, బాలాభిరామం, రంగురంగుల రత్న దీపాలు మొదలగునవి.

రామచంద్రయ్య, పణతుల: ఎం. ఏ.

రచనలు: పత్రికలలో వ్యాసాలు, కవితలు.

రామానుజాచార్యులు, చిలుకమర్రి:
(24-10-1924 మృతి 24-11-1967)

రచనలు: కల్యాణరాఘవము, స్తోత్రాంజలి, మధురవేదన మొదలగునవి.

రుద్రశ్రీ: చిట్టిమల్లె శంకరయ్య, బి. ఓ. యల్.

రచనలు: ఆరాత్రిమ్, మహాకవి గురజాడ, ఇంద్రచాపము మొదలగునవి.

వసుమూలి: యువ రచయిత.

లక్ష్మణమూర్తి, శ్రీపెరుంబుదూరు: ఎం. ఏ; ఎం. లిట్.

రచనలు: ఎలియం బ్రైరస్ నవలల్లో అస్తిత్వవాదం (సిద్ధాంతవ్యాసం) సంస్కృతంలో తెలుగులో అక్కడక్కడా పత్రికారితాలు.

విశ్వం, అరిపిరాల: [31-10-1936] ఏం. ఏ; పిహెచ్. డి.

రచనలు: విదురకన్నెలు, రేపటి స్వర్గం, మనస్, హాలేబీడు, నవ్య-కవిత్వంలో ప్రగతి- మానవప్రకృతి [సిద్ధాంతవ్యాసం], మొదలగునవి. పత్రికలలో వ్యాసములు కథలు. ఇంగ్లీషు లోనూ కవిత్వంవ్రాస్తారు.

విశ్వనాథం, పంగపల్లి: (11-1-1941) ఎం. కాం.

రచనలు: వీచికలలో కవితలు, ఇతరతారి 'యువభారతికి' ప్రాణం.

వీరభద్రయ్య, ముదిగొండ: ఎం. ఏ.

రచనలు: శివయోగి, స్రోతస్విని మొదలగునవి.

వెంకయ్య, దోనెప్రాతి:

రచనలు: పత్రికలలో కొన్ని కథలు, గేయాలు.

శంకరధాను, జి: [27-2-1929] ఎం. ఎస్సి.

రచనలు: పత్రికలలో కొన్ని కథలు, గేయాలు.

శరభయ్య, మల్లంపల్లి: [1928]

రచనలు: మాణిక్యాగ్నిమిత్రము మొదలగునవి.

M. V. KRISHNA RAO
Minister for Education & Cultural Affairs,
Executive President,
WORLD TELUGU CONFERENCE
HYDERABAD 1975.
ISB

అగ్నిగర్భ

శ్రీ చంక: పోలేటి వెంకటసుబ్బారావు, (3-4-1929 మృతి 1974) ఎం. ఏ.

రచనలు: నయాజమానా, రాగవల్లరి మొదలగునవి.

శ్రీ పర్వతాల, ముదిగొండ: (23-12-1940) ఎం. ఏ., పిహెచ్. డి.

రచనలు: మహాపర్వ, పుష్యమిత్ర, బసవగీత, ఆధునికాంధ్రికవిత్వ-ముపై ఉద్యమముల ప్రభావము (సిద్ధాంతవ్యాసం). సగం విరిగిన చందుర్బిందు, చిదంబర రహస్యం, బానిసలవ్యా-పారం, కృతయుగ ఇత్యాది నవలలు, ఎన్నో కథలు వ్యాసాలు.

శ్రీ పాణిశర్మ, గడియారం:

రచనలు: పత్రికలలో అనేకరచనలు.

శ్రీ పేంద్రశర్మ, గుంటూరు:

రచనలు: ఋతుమోహ, నరుడు - నక్షత్రాలు, షోడశి - రామాయణ రహస్యాలు, స్వర్ణహంస, శేషజ్యోత్స్న, మండే-సూర్యుడు మొదలగునవి.

శ్రీ నివాసమూర్తి, కొర్లపాటి: (17-10-1928) ఎం. ఏ., పిహెచ్. డి.

రచనలు: చిత్రశాల, గుడిగోపురము, వీణ, శ్రీనాథుడు (సిద్ధాంత వ్యాసము) మొదలగునవి.

శ్రీ నివాసమూర్తి, కొండముది: ఎం. ఏ.

రచనలు: గడ్డిపూలు, ధనుర్దాసు, బలిపశువులు, దైవోపహతులు, చిగురుటాకులు మొదలగునవి.

సంపత్కుమార: కోవెల సంపత్కుమాచార్యులు. (26.6.1933)
ఎం. ఏ.

రచనలు: తెలుగు ఛందోవికాసము, మనకవులు - పండితులు - రచయితలు, చేతనావర్త సంపుటాల్లో కవితలు మొదలగునవి.

సదాశివ: భండారు సదాశివరావు. (1925) బి. ఏ; ఎల్ఎల్. బి.

రచనలు: మనవారసత్వం, జై సోమనాథ్, చంద్రగుప్త, మహారాణా ప్రతాప్ మొదలగునవి.

సత్యనారాయణాచార్యులు, ఉత్పల: (1928) ఎం. ఏ.

రచనలు: కచుని పీడ్కోలు, తపతి, శరణాగతి, క్షీరసాగరమథనము, ఈ జంటనగరాలు హేమంత శిబిరాలు, మొదలగునవి.

సత్యశ్రీమన్నారాయణ, కొత్తపల్లి: బి. ఇ.

రచనలు: వెలుతురుపిట్టలు మొదలగునవి.

సుప్రసన్న: కోవెల సుప్రసన్నాచార్యులు. (17-3-1936)
ఎం. ఏ; పిహెచ్. డి,

రచనలు: తేజశ్చక్రిము, దుఃఖయోగిని, అధునా, సాహిత్యవివేచన, బుతంభర, రామరాజభూషణుని కృతులు (సిద్ధాంత-వ్యాసం), చేతనావర్త సంపుటాలతో కవితలు మొదలగునవి.

అగ్ని గర్భ

కవితా సంకలనం



జాతీయ సాహిత్య పరిషత్
ఆంధ్ర ప్రదేశ్ - హైదరాబాద్.

Title Printed at VISTAS PRINTERS. Hyd

169

Check List

Book Number	MBOTA212	Date	12-11-2021
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	CI, 181		
Missing Pages	NO		
Prepared By	Adilakshmi	Cutting By	Yameema
Scanned By	Amrutha	Pages	181